
చౌకబియ్యం..
తరలుతోంది!
కార్డుదారుల నుంచి ఎండీయూ వాహనాల సిబ్బంది కొనుగోలు
కిలోకు రూ.10 నుంచి 12 చెల్లింపు 7

ఆంధ్రజ్యోతి

ANDHRAJYCTHY

5



శ్రీ పొట్టిశ్రీరాములు
నెల్లూరు
జిల్లా వార్తలు
శుక్రవారం 6 డిసెంబరు 2024

రెవెన్యూ సదస్సులకు
సర్వం సన్నద్ధం

- నేటి నుంచి జనవరి 8 వరకు నిర్వహణ
- రైతులు, ప్రజల నుంచి వినతుల స్వీకరణ
- కొన్ని అక్కడికక్కడే, మరికొన్ని నిర్ణీత గడువులోగా పరిష్కారం

నెల్లూరు (హరనాథపురం), డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : భూ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం అడుగులో వేస్తోంది. ఇందులోభాగంగా నేటినుంచి నెలరోజులపాటు రెవెన్యూ సదస్సుల నిర్వహణకు పూనుకుంది. ఈ మేరకు జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేసింది. ఇప్పటికే గ్రామసభలు నిర్వహించి గత వైసీపీ సర్కారు హయాంలో జరిగిన భూముల రీసర్వేలో తలెత్తిన సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టింది. జిల్లాలోని 329 గ్రామాలలో సభలు నిర్వహించగా వేలాదిగా రెవెన్యూ, సర్వే శాఖలకు ప్రజల నుంచి వినతులు అందాయి. గత వైసీపీ ప్రభుత్వ పాలనలో రెవెన్యూ సమస్యలు విపరీతంగా పెరిగిపోయాయి. వీటిపై ప్రజలు నెత్తినోరు మొత్తుకున్నా పాలకులు పట్టించుకోలేదు. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తరువాత నిర్వహించిన ప్రజావేదికలో భూ సమస్యలపైనే ప్రజలు భారీగా అర్జీలు సమర్పించారు. మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిలో వీటిపైనే అర్జీలు అందడంతో రెవెన్యూ సమస్యల పరిష్కారానికే ప్రత్యేకంగా సదస్సులు నిర్వహించాలని ప్రభుత్వం భావించింది. గ్రామ, గ్రామాన సదస్సులు నిర్వహించి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి అక్కడికక్కడే పరిష్కరించనున్నారు.

శుక్రవారం నుంచి జనవరి 8వ తేదీ వరకు రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తారు. ప్రతిరోజు ఉదయం 9 గంటలకు ఈ సదస్సులు ప్రారంభమవుతాయి.

- సర్వే నెంబర్లలో మార్పులు, భూ విస్తీర్ణంలో తేడాలు, ఈ సర్వేలో తప్పులు, కబ్జాలతో ప్రజలు కోల్పోయిన భూములు, అసైన్డ్, చుక్కల భూముల వంటి వాటిపై అధికారులు ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తారు.
- రీసర్వేపై వచ్చిన ఫిర్యాదులను నిబంధనల ప్రకారం గ్రామపెద్దలు, సర్పంచ్‌ల సమక్షంలో వివరించి పరిష్కరించనున్నారు.
- రైతులు, ప్రజల నుంచి అందిన ఫిర్యాదులను పీజీఆర్ఎస్‌లో నమోదు చేస్తారు.
- సదస్సుల నిర్వహణకు ప్రతి మండలానికి ఒక నోడల్ అధికారిని కలెక్టర్ ఆనంద్ నియమించారు.
- సదస్సులకు తహసీల్దారుపాటు భూముల విషయానికి సంబంధించిన రెవెన్యూ డీటీలు, ఆర్ఐలు, వీఆర్వోలు, సర్వేయర్లు, వక్ఫ్, అటవీ అధికారులు పాల్గొంటారు. అలాగే రెవెన్యూ బృందాలన్నీ ఈ సదస్సులకు హాజరవుతాయి.

సద్వినియోగం చేసుకోవాలి : జేసీ

భూ సమస్యలను పరిష్కరించడానికే ప్రభుత్వం రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తోందని జేసీ కార్తీక్ తెలిపారు. ప్రజలు, రైతులు ఈ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సదస్సులలో అందిన ఫిర్యాదులను పీజీఆర్ఎస్‌లో నమోదు చేసి పరిష్కరించగలిగినవి అక్కడికక్కడే పరిష్కరించడంతోపాటు, మిగిలినవి ప్రభుత్వం ఇచ్చిన గడువులోగా పరిష్కరించనున్నట్లు పేర్కొన్నారు.



విధులు భళా..
భత్యం డీలా!
6

నేడు హోంగార్డుల వ్యవస్థాపక దినోత్సవం



చెరువు కాదండోయ్.. నెల్లూరు : స్టోన్‌హౌస్‌పేటలోని ఆర్ఎస్ఆర్ స్కూలు మైదానంలో వర్షపునీరు



వీడని వాన

- పది రోజులుగా ఎడతెరిపి లేకుండా..
- పొంగి ప్రవహిస్తున్న వాగులు, వంకలు
- లోతట్టు ప్రాంతాలు జలమయం, దెబ్బతిన్న రోడ్లు
- ప్రాజెక్టులు, చెరువులకు జలకళ
- తాజాగా అల్పపీడన హెచ్చరికలతో గుబులు

నెల్లూరు (హరనాథపురం), డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి) : ఫెంగల్ తుఫాన్ ప్రభావంతో పది రోజులు వర్షం కురుస్తూనే ఉంది. గురువారం కూడా నెల్లూరు నగరంతోపాటు మెట్టప్రాంతంలో మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. జిల్లా సగటు వర్షపాతం 25.5 మిమీగా నమోదవగా, సంగంలో అత్యధికంగా 91.2 మిమీ, అత్యల్పంగా కావలి, గుడ్లూరులలో 2.2 మిమీ వర్షం పడింది. బుచ్చిలో 68.2 మి.మీ, మర్రిపాడులో 53.6, ఏఎస్‌పేటలో 50.8, నెల్లూరు అర్బన్‌లో 26.2, నెల్లూరు రూరల్‌లో 28.6 మి.మీ వర్షం పడింది. ఎడతెరిపిలేకుండా కురుస్తున్న వర్షాలకు జిల్లాలోని వాగులు వంకలు పొంగి ప్రవహిస్తున్నాయి. వాగులు, వంకలు ఉప్పొంగి ప్రవహిస్తుండటంతో ప్రధాన ప్రాజెక్టులతోపాటు చెరువులూ జలకళను సంతరించుకున్నాయి. మెట్టప్రాంతాల్లో కురిసిన వర్షాలకు పంటల సాగుకు అనుకూలంగా ఉంటుందని అన్నదాత ఆనందం వ్యక్తం చేస్తున్నాడు. అయితే, వర్షాల కారణంగా రోడ్లపై ఏర్పడిన గుంతల్లో నీరు నిలవడంతో వాహనదారులు అవస్థలు పడుతున్నారు. మట్టిరోడ్లన్నీ బురదమయంగా మారాయి. అయితే, బంగాళాఖాతంలో మరో వాయుగుండం ఏర్పడుతోందని, దీనిప్రభావంతో వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ తెలపడంతో అటు ప్రజలు, ఇటు రైతుల్లో ఆందోళన రేగుతోంది.



ఉదయగిరి రూరల్ : పిల్లాపేరు వాగులో వరద



లింగ సముద్రంలో రోడ్డుపై నిలిచిన నీరు

కందుకూరులో పొంగిన వాగులు



కందుకూరులో ఎర్రవాగు ఉధృతి

కందుకూరు (ఆంధ్రజ్యోతి) : బుధవారం రాత్రి, గురువారం ఉదయం భారీ వర్షం కురవడంతో పందివాగు, తూములేరు, మన్నేరులు ఉప్పొంగాయి. మోపాడు చెరువు పదిగేట్లు ఎత్తి నీటిని ఎర్రవాగుకు వదలడంతో కందుకూరు - కొండముడుసుపాలెం గ్రామాల మధ్య ఉగ్రరూపం దాల్చింది. దీంతో కందుకూరు నుంచి కావలి, తెట్టు, గుడ్లూరు మార్గంలో నడిచే ఆర్టీసీ బస్సులను మధ్యాహ్నం నుంచి ఆపేశారు. ఇతర వాహన రాకపోకలూ స్తంభించాయి. అలాగే కందుకూరు నుంచి చుట్టుగుంట, ఆత్మకూరు, ఉలవపాడు మార్గంలోనూ వాగులు పొంగడంతో రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. అలాగే కందుకూరు పట్టణంలోని వర్షపు నీరు వెళ్లే ఎర్రవాగు పొంగటంతో ఎక్కడినీరు అక్కడే నిలిచిపోయి లోతట్టు ప్రాంతాలలో మోకాటిలోతున నీరు చేరింది. కోటారెడ్డి నగర్, కేసరి గుంట, ఉప్పుచెరువు ప్రాంతాలతోపాటు ఆర్టీసీ బస్టాండ్‌లోనూ నీళ్లు ఆగిపోయాయి.

- లింగసముద్రం (ఆంధ్రజ్యోతి) : గురువారం మధ్యాహ్నం 12.30 నుంచి 1.30 గంట వరకు లింగసముద్రంలో భారీ వర్షం కురిసింది. దీంతో తిరుమణిశెట్టి కోటయ్య మందిరం నుంచి బస్టాండ్ సెంటర్ వరకు, అలాగే మీసేవా కేంద్రం నుంచి కల్యాణ మండపం వరకు నీళ్లు నిలబడ్డాయి. మండలంలోని పలు గ్రామాల్లో కూడా వర్షం కురిసి అంతర్గత రోడ్లు, మురుగు కాలువలు పొంగి పారాయి.

పెన్నా వద్దకు వెళ్లొద్దు : కలెక్టర్

నెల్లూరు (హరనాథపురం, ఆంధ్రజ్యోతి) : రానున్న రెండు రోజులు పెన్నా నది వద్దకు ప్రజలు ఎవరూ వెళ్లవద్దని కలెక్టర్ ఆనంద్ సూచించారు. సోమశిల ప్రాజెక్టులో నీటి నిల్వలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తున్నామని, ప్రస్తుతానికి ఎలాంటి ప్రమాదం లేదని స్పష్టం చేశారు. ఎగువ ప్రాంతం నుంచి వచ్చే వరద రాకను బట్టి నీటి విడుదల ఉంటుందన్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు సుమారు 2 వేల ఎకరాల్లో నీళ్లు నిలిచాయని తెలిపారు. ఆ నీటిని తొలగించి, నష్టం అంచనాలను తేలుస్తామన్నారు.

సంగంలో మునిగిన వరినాట్లు

సంగం (ఆంధ్రజ్యోతి): మండలంలో బుధవారం రాత్రి కురుసిన భారీ వర్షానికి దువ్వూరు చెరువు నిండి వంగల్లు వద్ద కలుజుపై నీళ్లు ప్రవహించాయి. వంగల్లు, మర్రిపాడు తదితర గ్రామాల్లో వరినాట్లు మునిగిపోయాయి. ఉదయం నుంచి వర్షం లేకపోవడంతో రైతులు ఊపిరి పీల్చుకున్నారు. ముంబయి హైవేపై అర్ధగంటపాటు నీటి ప్రవాహం తగ్గలేదు. ఎస్సీ బాలికల వసతి గృహం జలమయం



సంగంలో నీట మునిగిన వరినాట్లు

(మిగతా 6లో)

పండుగ వాతావరణంలో
పేరెంట్-టీచర్ సమావేశాలు

తల్లిదండ్రులు తప్పనిసరిగా హాజరు కావాలి

కలెక్టర్ ఆనంద్ పిలుపు

నెల్లూరు (హరనాథపురం), డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : జిల్లావ్యాప్తంగా శనివారం జరిగే పేరెంట్-టీచర్ సమావేశాలను ఓ పండుగ వాతావరణంలో నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ ఆనంద్ చెప్పారు. గురువారం కలెక్టరేట్‌లోని తిక్కన భవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. జిల్లాలోని 2,604 పాఠశాలల్లో జరిగే ఈ సమావేశాలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులందరూ తప్పనిసరిగా సమావేశాలకు హాజరు కావాలని కోరారు. అభ్యాసన వ్యవస్థలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశాలు ముఖ్య భాగమని, పిల్లల బలాలు, బలహీనతలపై చర్చించుకోవడానికి, తద్వారా వారి ఎదుగుదలకు ఉపాయోగపడతాయని చెప్పారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఒక షెడ్యూల్ ప్రకారం వివిధ కార్యక్రమాలు జరుగుతాయని చెప్పారు. ఇందుకోసం అన్ని పాఠశాలల్లో నిర్వహణ కమిటీలను నియమించామన్నారు. ప్రతి పాఠశాలలో జిల్లా, మండల, గ్రామ స్థాయి అధికారులు పాల్గొనున్నట్లు తెలిపారు. పిల్లల చదువుకు సంబంధించి ప్రోగ్రెస్‌కార్డులు ఇవ్వడంతోపాటు తల్లులకు ముగ్గుల పోటీలు, తండ్రులకు టగ్‌ఆఫ్ వార్ పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. గుర్తించిన 42 పాఠశాలల్లో ఆరోగ్యపరీక్షలు నిర్వహించి హెల్త్ కార్డు అందజేస్తామని పేర్కొన్నారు. అందరితో సహపంక్తి భోజనాలతో సమావేశాలు ముగుస్తాయన్నారు. ఈ కార్యక్రమ నిర్వహణకు రూ.48 లక్షలు కేటాయించామనీ, ప్రతి మండలానికి ప్రత్యేకాధికారిని నియమించినట్లు తెలిపారు.



- **కలెక్టరేట్‌లో కంట్రోల్ రూం**

ఈ సమావేశాలకు సంబంధించి వివిధ శాఖల సిబ్బందితో శనివారం కలెక్టరేట్‌లో ప్రత్యేకంగా కంట్రోల్ ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఈ కంట్రోల్ రూము నడుస్తుందని పేర్కొన్నారు. ఈ సమావేశంలో డీఈఓ ఆర్.బాలాజీరావు పాల్గొన్నారు.

54 మంది కాంట్రాక్టు
ఉద్యోగుల తొలగింపు

నెల్లూరు (వైద్యం), డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : వైద్య ఆరోగ్య శాఖలో మల్టీపర్పస్ హెల్త్ అసిస్టెంట్లను (పురుష) తొలగించాలన్న హైకోర్టు ఉత్తర్వులతో జిల్లాలో అధికారులు చర్యలకు ఉపక్రమించారు. మొత్తం 54 మంది కాంట్రాక్టు సిబ్బందిని తొలగిస్తూ డీఎంహెచ్‌వో పెంచలయ్య ఉత్తర్వులు జారీ చేశారు. దాదాపు 20 ఏళ్లుగా ఈ హెల్త్ అసిస్టెంట్లు వైద్య ఆరోగ్య శాఖలో పనిచేస్తున్నారు. 2002, 2006 సంవత్సరాలలో వీరంతా డీఎస్సీ (డిస్ట్రిక్ సెలక్షన్ కమిటీ) పరీక్ష రాసి 179 మంది ఉద్యోగాల్లో చేరారు. అయితే 2012లో జీవో (మిగతా 6లో)

ఎఫ్‌డీఆర్ పనుల్లో
కొనసాగుతున్న దోపిడీ

- మూడేళ్ల క్రితం పనులకు ఇంకా బిల్లులు
- ఇటీవల సంగంలో వెలుగుచూసిన బాగోతం
- తాజాగా కోవూరు సెక్షన్‌లో బట్టబయలు
- వైట్‌నర్‌తో క్యూసీ సర్టిఫికెట్ ట్యాంపరింగ్
- బిల్లు వెనక్కు పంపిన పీఏవో
- 'ఇరిగేషన్'లో ఇంకెన్ని ఉన్నాయో!?

నెల్లూరు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం మారినా ఎఫ్‌డీఆర్ (ఫ్లడ్ డ్యామేజ్ రిపేర్స్) పనుల్లో దోపిడీ మాత్రం ఆగడం లేదు. ఎప్పుడో మూడేళ్ల క్రితం ఎఫ్‌డీఆర్ ముసుగులో మొదలైన అక్రమాల పర్వం ఇంకా కొనసాగుతూనే ఉంది. లెక్కకు మించి నాడు అనుమతులు మంజూరు చేయడం మొదలు.. గడువు ముగిసినా బిల్లులు పెడుతుండడం వరకూ అడుగడుగునా ఉల్లంఘనలు జరుగుతున్నాయి. ఇరిగేషన్ అధికారులే ఇందులో కీలకంగా వ్యవహరించారు. ఈ విషయం వెలుగులోకి రావడంతో నాడు అధికారుల అక్రమ వ్యవహారాలు బట్టబయలయ్యాయి. అయితే తాజాగా కోవూరు సెక్షన్‌లో మారో వ్యవహారం వెలుగులోకి రావడంతో ఇరిగేషన్ శాఖలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. 2021-22 నాటి ఎఫ్‌డీఆర్ వర్కుకు ఇటీవల బిల్లు అప్‌లోడ్ చేశారు. ఇలా అప్‌లోడ్ చేయడమే పెద్ద తప్పయితే.. ఈ వర్కుకు ట్యాంపరింగ్ చేసిన క్వాలిటీ కంట్రోల్ సర్టిఫికెట్‌ను జత చేయడం మరో పెద్ద తప్పు. బుచ్చి సబ్ డివిజన్ నుంచి రూ.10 లక్షలు విలువ చేసే ఈ బిల్లు సెంట్రల్ డివిజన్‌కు రావడం.. అక్కడ పరిశీలించకనే అప్‌లోడ్ చేయడం జరిగిపోయాయి. అయితే ఈ బిల్లు పే అండ్ అకౌంట్స్ (పీఏవో) అధికారి వద్దకు వెళ్లాక బ్రేక్ పడింది. బిల్లు మంజూరు సమయంలో పీఏవో క్యూసీ సర్టిఫికెట్‌ను పరిశీలించగా అసలు బాగోతం బయటపడింది. నిబంధనల ప్రకారం క్యూసీ సర్టిఫికెట్‌లో కొట్టివేతలు, దిద్దుబాటులు ఉండకూడదు. కానీ ఈ బిల్లు విషయంలో ఏకంగా వైట్‌నర్‌తో చెరిపేసి దానిపైన కొత్తగా వర్కు, బిల్లు వివరాలు రాసి ఉన్నారు. ఒకసారి క్యూసీ అధికారులు ఒక వర్కుకు సర్టిఫికెట్ ఇచ్చాక, దానిని మార్చే అధికారం ఇతర అధికారులకు లేదు. కానీ వర్కు వివరాలు, అగ్రిమెంట్ వ్యాల్యూ, ఎస్టిమేషన్ వ్యాల్యూ, ఫైనల్ బిల్ కాలమ్స్ అన్నింటిలోనూ వైట్‌నర్‌తో చెరిపి వేసినట్లు స్పష్టంగా కనిపిస్తోంది. నిజంగా క్యూసీ అధికారులు ఆ సర్టిఫికెట్‌ను ఈ వర్కుకే ఇచ్చారా..? లేక మరో వర్కుకు ఇచ్చిన సర్టిఫికెట్‌ను ట్యాంపరింగ్ చేసి ఈ వర్కుకు ఉపయోగించారా..? అన్నది తేలాల్సి ఉంది. అన్నిటికన్నా ప్రధానంగా ఎప్పుడో మూడేళ్ల క్రితం వర్కుకు ఇప్పుడు బిల్లు ఎలా పెట్టారన్నది ప్రశ్నార్థకంగా మారింది. ఈ బిల్లు పీఏవో నుంచి రిటర్న్ అయ్యింది కాబట్టి బయటకొచ్చింది. మరి బయటకు రాని బిల్లులు ఇంకెన్ని ఉన్నాయోనన్న అనుమానాలు రేకెత్తుతున్నాయి.



వైట్‌నర్‌తో వివరాలు చెరిపేసి దానిపై మళ్లీ వివరాలు రాసిన క్యూసీ సర్టిఫికెట్

- **మొదటి నుంచీ దోపిడీనే!**

వైసీపీ ప్రభుత్వంలో ఎఫ్‌డీఆర్ ముసుగులో భారీ దోపిడీ జరిగింది. ఎప్పుడూ లేని విధంగా ఒక్క 2021-22లోనే సుమారు రూ.232 కోట్లు విలువైన వర్కులను ఎఫ్‌డీఆర్ కింద కలెక్టర్‌పై ఒత్తిడి తెచ్చి అప్పటి ఎమ్మెల్యేలు మంజూరు చేయించారు. వరదలు, వర్షాల మూలంగా దెబ్బతిన్న పనులకు మాత్రమే ఎఫ్‌డీఆర్ కింద అనుమతులు ఇవ్వాల్సి ఉంటుంది. కానీ ఇష్టమొచ్చినట్లు మంజూరు చేశారు. ఇందులో సింహభాగం మట్టి పనులే కావడం గమనార్హం. నిబంధనల ప్రకారం రూ.5 లక్షలు దాటితే టెండర్లు పిలవాల్సి ఉన్నా నాడు ఎమ్మెల్యేల ఒత్తిళ్లతో అధికారులు రూ.10 లక్షల చొప్పున వర్కులను విభజించి నామినేషన్ పద్ధతిలో వైసీపీ నేతలకు కట్టబెట్టారు. అయితే చాలా పనులు చేయకుండానే బిల్లులు పెట్టుకున్నారన్న ఆరోపణలు మొదటి నుంచీ వినిపిస్తున్నాయి. ఇదిలా ఉంటే అత్యవసరంగా చేయాల్సిన ఎఫ్‌డీఆర్ పనులను సంవత్సరాల తరబడి చేస్తూనే ఉన్నారు. నాడు మంజూరైన వర్కుల్లో సుమారు రూ.10 కోట్ల విలువైన వర్కులు చేయలేదు. అందులో ఒక్క బుచ్చి సబ్ డివిజన్ పరిధిలోనే సుమారు 6 కోట్ల వరకూ ఉంటాయని అంచనా. అయితే నాడు పనులు చేయని వర్కులకు అప్పట్లోనే పనులు చేసినట్లుగా చూపించి ఇప్పుడు బిల్లులు పెట్టుకునే ప్రయత్నాలు జరుగుతున్నట్లు ఇరిగేషన్ శాఖలో ప్రచారం జరుగుతోంది. కొందరు అధికారులు పాత తేదీలతో బిల్లులు రికార్డు చేసేందుకు సిద్ధమవుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇటీవల సంగంలో జరిగింది కూడా ఇదేనని చెప్పుకుంటున్నారు. తాజాగా కోవూరు సెక్షన్‌లో మరోసారి ఇటువంటి వ్యవహారం బయటపడడం చర్చనీయాంశంగా మారింది. కాగా దీనిపై సెంట్రల్ డివిజన్ ఈఈ నాగరాజును వివరణ కోరగా కోవూరు సెక్షన్‌లోని బిల్లును పీఏవో రిటర్న్ చేసిన మాట వాస్తవమేనని చెప్పారు. ఈ వర్కుకు సంబంధించిన క్యూసీ సర్టిఫికెట్‌లో కొట్టివేతలు ఉండడంతో మళ్లీ కొత్తగా క్యూసీ సర్టిఫికెట్ తీసుకుంటున్నట్లు చెప్పారు. అసలు ఈ నంబర్ కలిగిన క్యూసీ సర్టిఫికెట్ ఏ వర్కుకు ఇచ్చారన్న విషయాన్ని క్వాలిటీ కంట్రోల్ ఈఈ ధనుంజయ్‌ను అడగ్గా ఆయన సమాధానం కూడా ఇవ్వకపోవడం గమనార్హం.

పచ్చళ్ల తయారీలో శిక్షణ

ముత్తుకూరు, (ఆంధ్రజ్యోతి) : కృష్ణపట్నం గ్రామాల మహిళా సంఘాలకు అదానీ కృష్ణపట్నం పోర్టు లిమిటెడ్, అదానీ ఫౌండేషన్, కృష్ణపట్నం ఫార్మర్ ప్రొడ్యూసర్ కంపెనీ లిమిటెడ్, పోలేరమ్మ తల్లి, మహిళా సంఘం, తిరుమలేశ్ స్వయం సహాయక సంఘం ఆధ్వర్యంలో గురువారం మసాలా ప్యాకేజింగ్, మార్కెటింగ్ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అదానీ ఫౌండేషన్ హెడ్ రాజేష్ రంజన్ మాట్లాడుతూ ఈ శిక్షణ మహిళల ఆత్మవిశ్వాసాన్ని పెంచడంలో, ఆర్థిక అవకాశాలను అన్వేషించడంలో కీలక పాత్ర పోషిస్తుందన్నారు. శిక్షణ పొందిన మహిళల రోజువారీ జీవితాల్లో ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమం లో కృష్ణపట్నం పోర్టు లిమిటెడ్ కార్పొరేట్ ఎఫైర్స్ హెడ్ వేణు గోపాల్, అదాని స్కిల్ డెవలప్ మెంట్ సెంటర్ హెడ్ కల్యాణ్, కృష్ణపట్నం ఫార్మర్ ప్రొడ్యూసర్ కంపెనీ లిమిటెడ్ సీఈవో వెంకటేష్, అదాని ఫౌండేషన్ హెచ్ఓడీ రమేష్‌బాబు, కో ఆర్డినేటర్‌లు మురళీ, షాహుల్, హమీద్, అరుణ్ పాల్గొన్నారు.



క్రిస్మస్ సన్నాహాలు మొదలు

క్రిస్మస్ పండుగకు జిల్లాలో సన్నాహాలు మొదలయ్యాయి. ఏటా నవంబరు 25 నుంచి జనవరి 1వతేదీ వరకు జిల్లా అంతా క్రిస్మస్ వేడుకలు జరుపుకుంటారు. క్రైస్తవుల ఇళ్లు, చర్చిలు, ప్రార్థనా మందిరాల్లో వివిధ ఆకృతుల్లో చిన్నా, పెద్దా క్రిస్మస్ చెట్లు, నక్షత్రాలు ఏర్పాటు చేసి క్రీస్తు జననానికి స్వాగతం పలుకుతారు. నెల్లూరు నగరంలో పదేళ్లుగా ఐక్య సింహపురి క్రిస్మస్ వేడుకలు, సింహపురి క్యారెల్స్ నిర్వహిస్తున్నారు. చర్చిల్లో ప్రతీ రోజు ఒక గంట బైబిల్ పఠనం, ప్రార్థనలు చేస్తున్నారు. ఈ సందర్భంగా సామూహి కంగా భక్తిగీతాలాపన, నాటకాలు ప్రదర్శిస్తారు. పాస్టర్ల ఆధ్వర్యంలో క్రైస్తవుల ఇళ్లలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తారు. కాగా, క్రిస్మస్ సందర్భంగా దుకాణాల్లో వివిధ రంగుల స్టార్లు, క్రిస్మస్ ట్రీలు, బాల ఏసు జననం బొమ్మలు, అలంకరణ వస్తువులు అమ్మకానికి సిద్ధంగా ఉన్నాయి. అయితే వీటి ధరలు గతేడాదికన్నా దాదాపు 25శాతం పెరిగాయి.

- నెల్లూరు (సాంస్కృతికం, ఆంధ్రజ్యోతి)





కొండలను కమ్మేసిన మేఘాలు




పచ్చని అందం.. పరవశింపజేసే సోయగం!

ఆకాశాన్ని తాకినట్టు కనిపించే కొండలు. కనుచూపు మేర పచ్చదనం.. రాళ్ల మధ్య పారే సెలయేళ్ల సోయగం.. భూమిపైకి విహారానికి వచ్చినట్టు కనిపించే మేఘాల సమూహాలతో వెలుగొండ అందాలు చూపరులను ఆహ్లాద పరుస్తున్నాయి. వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు వెలుగొండ అడవులు పచ్చదనం సంతరించు కోవడంతోపాటు కొండకోనల్లో పారే సెలయేళ్లు, పక్షుల కిలకిల రావాలు, ఆహ్లాదకర వాతావరణంతో ప్రతిఒక్కరినీ మంత్రముగ్ధులను చేస్తున్నాయి. ఆయా దృశ్యాలను ప్రజలు కనులారా తిలకించి తమ సెల్‌ఫోన్లలో బందిస్తున్నారు.

- ఉదయగిరి రూరల్ (ఆంధ్రజ్యోతి)



వెలుగొండ అడవిలో సెలయేళ్ల సోయగం



దుర్గంపై జాలువారుతున్న సల్పాపేట్ జలపాతం

వీడని వాన

(5వ పేజీ తరువాయి)

కావడంతో విద్యార్థినులు అవస్థలు పడ్డారు.

● అనంతసాగరం (ఆంధ్రజ్యోతి): గురువారం సాయంత్రం భారీ వర్షం కురవడంతో వాగులు, వంకలు పొంగిప్రవహించాయి. పొలాల్లో వర్షపు నీరు చేరుతుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

● ఉదయగిరి రూరల్ (ఆంధ్రజ్యోతి): మండలంలోని దున్నపోతుల, పిల్లాపేరు వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. వాగుల ఉధృతితో ఆయా గ్రామాలకు రాకపోకలు కొంతమేర స్తంభించాయి. ఉదయగిరి ఆనకట్ట నిండుకుండలా మారి అలుగు పారుతోంది. వారం రోజులపాటు కురుస్తున్న వర్షాలకు గ్రామీణ రహదారులు బురదమయంగా మారడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు.

● సీతారామపురం (ఆంధ్రజ్యోతి) : రంగనాయుడు పల్లిలోని మర్రిఊట్ల రిజర్వాయర్ నిండి నిర్మాణంలో ఉన్న బ్రిడ్జి వైపు ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో వాహన రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. ఎంపీడీవో భాస్కర్, ఈవోపీ ఆర్డీ భార్గవి వాగును పరిశీలించి, ప్రజలను అప్రమత్తం చేశారు.

'సోమశిల'కు పెరిగిన ఇన్‌ఫ్లో

అనంతసాగరం, (ఆంధ్రజ్యోతి) : సోమశిల జలాశయానికి ఎగువ నుంచి వస్తున్న వరద ప్రవాహం పెరుగుతోంది. బుధవారం 9,578 క్యూసెక్కులు కొనసాగగా గురువారం నాటికి 13,313 క్యూసెక్కులు నమోదైనట్లు అధికారులు తెలిపారు. డ్యాంలో 71.761 టీఎంసీల నీరు నిల్వ ఉండగా, కండలేరుకు 2,000, ఉత్తర కాలువకు 600, దక్షిణ కాలువకు 150, డెల్టాకు 50 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు.

● రాళ్లపాడులో 19.2 అడుగులకు..

లింగసముద్రం (ఆంధ్రజ్యోతి) : రాళ్లపాడు ప్రాజెక్టులో నీటిమట్టం 19.2 అడుగులకు చేరింది. మన్నేరు నుంచి, సోమశిల ఉత్తర కాలువ నుంచి 200 క్యూసెక్కుల నీరు వస్తున్నట్టు అధికారులు తెలిపారు. మరో 10 అంగుళాల నీరు చేరితే ప్రాజెక్టు పూర్తి సామర్థ్యం 20 అడుగులకు చేరినట్టు అవుతుంది. ఎంపీపీ పెన్నా కృష్ణయ్య ప్రాజెక్టును సందర్శించారు.

● గండిపాళెంలో..

ఉదయగిరి రూరల్ (ఆంధ్రజ్యోతి) : గండిపాళెం జలాశయంలో నీటిమట్టం 16.5 అడుగులకు చేరినట్లు జలవనరుల శాఖ డీఈ కె.చంద్రమౌళి తెలిపారు. దున్నపోతుల, పిల్లాపేరు వాగులు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో జలాశయంలోకి 833 క్యూసెక్కుల వరద వస్తున్నట్లు ఆయన తెలిపారు.



కందుకూరు ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో నీరు



సంగం : వసతిగృహంలో వర్షపునీరు





కందుకూరు : మోపాడు చెరువు నుంచి పది గేట్లు ఎత్తడంతో ఉధృతంగా ప్రవహిస్తున్న వరద

సీతారామపురం : నిర్మాణంలో ఉన్న వంతెన వద్ద వరద ప్రవాహాన్ని పరిశీలిస్తున్న అధికారులు

విధులు భళా.. భత్యం డీలా!

- పోలీసులతో సమానంగా హోంగార్డుల సేవలు
- అయినా అన్నింటా చిన్నచూపే!
- ఆర్థిక భద్రత, పింఛన్ల కోసం ఎదురుచూపు
- నెరవేరని పాలకుల హామీలు
- వైసీపీ హయాంలో ఏకంగా అసోసియేషనే రద్దు
- నేడు 62వ హోంగార్డుల వ్యవస్థాపక దినోత్సవం

ఒంటిపై పోలీసు దుస్తులు ధరించి నేర నియంత్రణతోపాటు ప్రజలకు సేవ చేయాలన్న ఉత్సాహంతో ఎంతోమంది శ్రమిస్తారు. తమ లక్ష్యం నెరవేరని సమయంలో హోంగార్డు ఉద్యోగాల కోసం ప్రయత్నించి విజేతలుగా నిలిచి ఒంటిపై ఖాకీ యూనిఫాం వేసుకుంటారు. పోలీసులకు ధీటుగా సేవలందిస్తుంటారు. అయితే, వాస్తవరూపేణా హోంగార్డులు అంటే పోలీస్ శాఖలోనే కాదు.. సమాజంలోనే చిన్నచూపే ఎదురవుతోంది. ఏళ్ల తరబడి ప్రజలకు సేవలు అందించే హోంగార్డులు చివరకు ఉద్యోగ విరమణ సమయంలో ఆర్థిక భద్రత లేకుండా, పింఛను సౌకర్యం లేకనే వెను తిరుగుతున్నారు. తమ సమస్యల పరిష్కారంపై పాలకులు ఉత్తుత్తి హామీలు ఇచ్చి చేతులు దులుపుకో వడం తప్ప చేసేందేమీ లేదని హోంగార్డులే అసహనం వ్యక్తం చేస్తున్నారు. శుక్రవారం 62వ హోంగార్డుల వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం.

- నెల్లూరు (క్రైం, ఆంధ్రజ్యోతి)

బ్రిటిష్ పాలన నుంచి దేశం విముక్తి పొందుతున్న సమయం లో 1946 డిసెంబరు 6వ తేదీన సమా జంలో అలజడులను శాంతియుతంగా అదుపు చేసేందుకు, ఇతర సేవలు అందిం చేందుకు స్వచ్ఛంద సమూహంగా ఓ వ్యవస్థ ఏర్ప డింది. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత కూడా ఇలాంటి బృందాలు దేశంలోని అనేక ప్రాంతాల్లో పని చేశాయి. దేశంలో పెరిగిన సమస్యలు, పోలీసులకు పెరిగిన భారం వల్ల స్వచ్ఛంధ సేవ చేస్తున్న బృందాలపై ప్రభుత్వం దృష్టి సారిం చింది. 1962 చైనా యుద్ధం తర్వాత సమాజంలో శాంతి భద్రతలను కాపాడటంలో పోలీసు శాఖకు పని భారం పెరిగిన నేపథ్యంలో స్వచ్ఛందంగా సేవలు అందిస్తున్న బృందాలను హోంగార్డులుగా గుర్తించాలని కేంద్ర ప్రభుత్వం ఆదేశిం చింది. అలా 1963లో హోంగార్డు వ్యవస్థ ఆవిర్భవించింది.

● 8 మంది మృత్యువాత

ఈ సంవత్సరం విధులు నిర్వహిస్తూ 8మంది హోంగార్డులు మృతి చెందారు. మార్చి 31వ తేదీన వేదాయపాలెం పోలీసు స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న వి వెంకటేశ్వర్లు, మే 20వ తేదీన ఆత్మకూరు స్టేషన్‌లో జి హరిప్రసాద్, జూన్ 22న వెంకటగిరి స్టేషన్‌లో టి సురేష్, సెప్టెంబరు 6న బిడి టీమ్‌కు చెందిన పి బాల సుబ్రహ్మణ్యం, అదే నెల 8న ఇందుకూరుపేట స్టేషన్‌లో పనిచేసే షేక్ తాజుద్దీన్, 11న ఎస్ఆర్ పురం స్టేషన్‌లో పనిచేసే షఫ్రక్ అబ్దుల్ ఖాదర్, అక్టోబరు 27న బుచ్చి స్టేషన్‌లో తాల్లూరు లక్ష్మయ్య, అదే నెలలో 28వ తేదీన బాలాజీనగర్ పోలీసు స్టేషన్‌లో పనిచేసే వి నాగేంద్ర ప్రసాద్ మృతి చెందారు.

● వైసీపీ పాలనలో నిర్లక్ష్యం

గత వైసీపీ ప్రభుత్వంలో పోస్టులు భర్తీ జరగకపోగా హోమ్‌గార్డుల సమస్యల పరిష్కారంపై ప్రశ్నిస్తున్నారని ఆ అసోసియేషన్‌నే రద్దు చేశారు. వేతనంతో కూడిన రెండు రోజుల సెలవులు అంటున్నా జిల్లాలో అవి పెద్దగా అమలు కావడం లేదు. గత ప్రభుత్వంలో ఉద్యోగ భద్రత, ఆరోగ్య భద్రత తదితర సమస్యలపై అనేకమార్లు వినతిపత్రాలు అందజేసినా ఏ ఒక్కటీ అమలుకు నోచు కోలేదు. టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ పాదయాత్ర చేసిన సమ యంలో హోమ్‌గార్డులు ఆయన్ను కలిసి తమ సమస్యలపై వినతిపత్రం అందజేశారు. వీటిపై లోకేష్ సానుకూ లంగా స్పందించడంతో ప్రస్తుత కూటమి ప్రభుత్వంపై హోంగా ర్డులు ఎన్నో ఆశలు పెట్టుకుని ఉన్నారు. కాగా, హోంగార్డు వ్యవ స్థాపక దినోత్స వం సందర్భంగా శుక్రవారం నెల్లూరు లోని పోలీస్ కవాతు మైదానంలో విడుకల నిర్వహణకు విస్తృత ఏర్పాట్లు చేశారు.

జిల్లాలో 721 మంది...

జిల్లాలో 721 మంది హోంగార్డులు విధులు నిర్వహిస్తున్నారు. 587 మంది పోలీస్ విభాగంలో ఉండగా, వీరిలో 72 మంది మహిళలు ఉన్నారు. 134 మంది డిప్యూ టేషన్‌పై మెరైన్ పోలీసు అంతర్గత భద్రత, జెన్‌కో, ఎఫ్‌సీఐ, జైలు, ఆర్టీవో, అగ్నిమాపక దళంలో విధులు నిర్వహిస్తు న్నారు. పోలీసులతో సమానంగా మన్ననలు పొందుతూ విధులు నిర్వహిస్తు న్నారు. అగ్ని ప్రమాదాలు, వరదలు, అంటువ్యాధుల వంటి అత్యవసర పరిస్థితులు, మత సామరస్యాన్ని కాపాడటం, ఆర్థిక, సామాజిక, సంక్షేమ కార్యక్రమాల్లో పాలు పంచుకోవడం వంటి విధులను హోంగార్డులు నిర్వహిస్తున్నారు.



అందుతున్న సంక్షేమాలివే!

- హోంగార్డులు మరణించిన సమయంలో జిల్లాలో ఉన్న హోంగార్డులందరూ ఒకరోజు వేతనాన్ని బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందిస్తున్నారు. ఈ విధానం తొలుత మన జిల్లా నుంచి ఆరంభమై ఆ తర్వాత రాష్ట్రవ్యాప్తంగా అమలవుతోంది.
- ప్రమాదవశాత్తు హోంగార్డు మృతి చెందితే రాష్ట్ర ప్రభుత్వం రూ. 5లక్షల ఎక్స్‌గ్రేషియా అందిస్తోంది.
- విధులో ఉండి చనిపోయిన హోంగార్డుల కుటుంబ సభ్యులలో ఒకరికి ఉద్యోగం ఇస్తారు.
- హోంగార్డులందరికీ యాక్సిస్ బ్యాంక్‌లో ఖాతాలు ఓపెన్ చేయించారు. ఈ అకౌంట్ తీసుకొన్న వారు ప్రమాదంలో మరణించి సమయంలో రూ.30 లక్షల ఇన్సూరెన్స్ వస్తుంది.
- హోంగార్డులకు రోజుకు రూ.710 చొప్పున నెలకు రూ. 21,300 జీతంగా అందుతోంది.

ఆస్ట్రాలజీలో అవార్డుల పంట!

- జ్యోతిష్యంలో డాక్టరేట్, ముహూర్త శాస్త్రంలో ఎంఏ
- వాస్తు, జ్యోతిష్యంలో మరో పీజీ
- ఎన్నో అవార్డులు ప్రశంసలు లక్ష్మీశ్రీనివాసశర్మ సొంతం

ఎంతటి పెద్దంటి పెళ్లి సంబంధం అదృష్టంగా లభించిన జాతాకాలతో కూడిన జ్యోతిష్యం చూడకుండా ముందడుగు వేయలేం. రూపాయి రూపాయి కష్టపడి సంపాదిం చుకుని నిర్మించాలనుకున్న అందాల భవనాన్ని వాస్తులేకుండా కట్టుకోలేం. నిత్య జీవితంలో ఏ పని మొదలు పెట్టాలన్న ముహూర్తం చూశాకే అడుగు ముందు కేస్తాం. ఈ మూడు విషయాలలో ఎంతటి వారైన శాస్త్రోక్తంగా వెళ్లాల్సిందే. జ్యోతిష్యం, ముహూర్త శాస్త్రంలో డాక్టరేట్, పీజీ చేసిన రామచంద్రుని లక్ష్మీ శ్రీనివాసశర్మ దేశవ్యాప్తంగా అనేక సంస్థల నుంచి అవార్డులు, ప్రశంసలు అందుకు న్నారు. నెల్లూరురూరల్ మండలం అల్లీపురం ఆంజనేయస్వామి ఆలయంలో సామాన్య పూజారిగా పని చేస్తూ అటు అర్చక, ఇటు పౌరహిత్యంలో రాణిస్తున్నారు.

- నెల్లూరు రూరల్, (ఆంధ్రజ్యోతి)



పొట్టిశ్రీరాములు తెలుగు యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ అందుకుంటున్న లక్ష్మీ శ్రీనివాసశర్మ

ప్రకాశం జిల్లా బొట్లగూడూరుకు చెందిన శ్రీనివాసశర్మ ప్రాథమిక విద్య అనంతరం బుచ్చిరెడ్డి పాళెంకు తల్లిదండ్రులతో కలిసి వృత్తిరీత్యా పౌరోహిత్యం చేస్తూ అల్లీపురం వద్దనున్న ఆంజనేయ స్వామి ఆలయంలో పూజారిగా కొనసాగుతున్నారు. హైదరాబాద్‌లోని శ్రీ పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో జ్యోతిష్య శాస్త్రంలో పీహెచ్‌డీ పూర్తి చేశారు. 2019లో డాక్టరేట్ కూడా అందుకున్నారు. ముహూర్త శాస్త్రంలో ఎంఏ, వాస్తు, జ్యోతిష్య శాస్త్రంలో పీజీ కూడా పూర్తి చేశారు. బహిరంగ వేదికలపై మహామహులతో తలపడి అనేక సంస్థల నుంచి అవార్డులు, ప్రశంసలు అందుకున్నారు. 2016లో తిరుగురు వారుల్ జ్యోతిష్య వెల్ఫేర్ అసోసియోషన్ వారు చిత్తూరులో అందించిన 'జ్యోతిష్య మమణి', 'జ్యోతిష్య మణి' అవార్డు లను అందుకున్నారు. 2023లో పినాకినీ యూత్ వెల్ఫేర్ అసోసియోషన్ సత్యసాయి సేవ పురస్కారం, ఈ ఏడాది అదే సంస్థ 'విశిష్ట సేవరత్న' అవార్డు ప్రదానం చేసింది.

● రామకృష్ణ శాస్త్రీ చేతులుమీదుగా...

2022లో హైదరాబాద్‌లో జ్యోతిష్య భారతం మహా సమ్మేళనం పేరుతో గ్లోబల్ అకాడమి ఆఫ్ ఆస్ట్రాల జికల్ సైన్స్, పరాశర అకాడమీ ఆఫ్ ఆస్ట్రాలజికల్ సైన్స్ సంస్థలు సంయుక్తంగా త్యాగరాయ గాన సభ వేదికపై శృంగేరి శారద పీఠం ఆస్థాన సిద్ధాంతి డాక్టర్ శంకరమంచి రామకృష్ణ శాస్త్రీ చేతులు మీదుగా 'జ్యోతిష్య శిరోమణి' అవార్డు అందుకున్నారు. విదేశాలలో నిర్వహించిన ఇంటర్నేషనల్ ఆస్ట్రాలజికల్ ఫెడరేషన్ వారు లైఫ్ టైం మెంబర్ షిప్‌ను గౌరవార్థం అందచేశారు. ఇక స్థానికంగా అనేక సంస్థలు, ప్రముఖుల నుంచి లక్ష్మీశ్రీనివాసశర్మ ప్రశంసలు అందుకున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విడిపోయాక శ్రీ పొట్టిశ్రీరాములు తెలుగు యూనివర్సిటీ నుంచి జ్యోతిష్య విభాగంలో రాష్ట్రంలోని తొలిగా లక్ష్మీశ్రీనివాసశర్మ డాక్టరేట్ పొందారు.

వ్యాపార ఉద్దేశమే లేదు

నేను నేర్చుకున్న వృత్తిని వీలైనంత వరకు సమాజానికి ఉపయోగపెట్టడమే నా లక్ష్యం. జ్యోతిష్యం, వాస్తు, ముహూర్త శాస్త్రాలకు మంచి గిరాకీ ఉన్నా నాకు వ్యాపారం చేయడం ఇష్టంలేదు. వీలైనంత వరకు అందరికీ మంచి జరగాలన్నదే నా ఉద్దేశం.

- డాక్టర్ రామచంద్రుని లక్ష్మీశ్రీనివాసశర్మ

54 మంది కాంట్రాక్టు ఉద్యోగుల తొలగింపు

(5వ పేజీ తరువాయి)

నెం.273 ప్రకారం 125 మంది మాత్రమే వైద్య ఆరోగ్య శాఖలో హెల్త్ అసిస్టెంట్లుగా ఉండాలని మిగిలిన వాళ్లను తొలగించాలని అప్పటి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో 54 మంది తమను విధుల్లోకి తీసుకోవాలని కోరుతూ 2013లో హైకోర్టును ఆశ్రయించారు. వీరిని తాత్కాలికంగా విధుల్లో తీసుకోవాలని తెలంగాణ హైకోర్టు ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేసింది. అనేక వాయిదాల అనంతరం హైకోర్టు తాజా ఆదేశాలు జారీ చేస్తూ నిబంధనల మేరకు ఎక్కువగా ఉన్న హెల్త్ అసిస్టెంట్లను విధుల తొలగించాలని ఉత్తర్వులు విడుదల చేసింది. దీంతో 54 మందిని తొలగిస్తూ వైద్య ఆరోగ్య శాఖ ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్ర కుటుంబ ఆరోగ్య సంక్షేమ శాఖ డైరెక్టర్ ఆదేశాల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు డీఎంహెచ్‌వో పెంచలయ్య తెలిపారు.



కొమ్మపై ఇలా వాలి..



కాసేపు సేద తీరి..



ఆ తర్వాత తుర్రుమంది!

దూరం నుంచి చూస్తే కోకిలలా. దగ్గర నుంచి చూస్తే అచ్చం కాకిలా కనిపించే జెముడు కాకి ఇది. దట్టమైన అడవి, నిర్మానుష్య ప్రాంతాల్లో తిరిగే ఈ జెముడు కాకులు కోవూరు సమీపంలోని షుగర్ ఫ్యాక్టరీ వద్ద హల్‌చల్ చేశాయి. వాటిని 'ఆంధ్రజ్యోతి' తన కెమెరాలో బంధించింది.

- స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నెల్లూరు

బొట్టు పెట్టి.. ఆహ్వానం పలికి..!



'మీ అబ్బాయి చదువుతున్న బడిలో 7వ తేదీన జరిగే పేరెంట్స్-టీచర్ల మీటింగ్‌కు రండి. బడి అభివృద్ధికి, ఉత్తీర్ణత శాతం పెరుగుదలకు మీ అమూల్యమైన సలహాలు, సూచనలు ఇవ్వండి.' అంటూ ఉపాధ్యాయినులు విద్యార్థులతో కలిసి తల్లిదండ్రుల ఇళ్లకు వెళుతున్నారు. మహిళల నుదుటున బొట్టు పెట్టి తోబుట్టువులా సమావేశానికి ఆహ్వానిస్తున్నారు. మనుబోలు మండలం మడమనూరు గ్రామంలోని ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థినులతో కలిసి గురువారం ప్రజాప్రతినిధులు, తల్లిదండ్రుల ఇళ్లకు వెళ్లి ఆహ్వాన లేఖలు అందించారు. రాజకీయాలకు అతీతంగా సమావేశానికి అందరూ తప్పకుండా హాజరుకావాలని విజ్ఞప్తి చేశారు.

- మనుబోలు, (ఆంధ్రజ్యోతి)

రేకులషెడ్డులో విద్యాబోధన

- విద్యార్థుల అవస్థలు



రేకులషెడ్డులో విద్యార్థులకు విద్యాబోధన చేస్తున్న సీఆర్పీ

దుత్తలూరు (ఉదయగిరి రూరల్), డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వ అస్తవ్యస్త నిర్ణయాలతో అన్నివర్గాల ప్రజలే కాదు.. పాఠశాల విద్యార్థులు కూడా అవస్థలు పడుతున్నారు. నాడు-నేడు పథకం కింద బడులను అద్భుతంగా తీర్చిదిద్దేస్తున్నామని, పాఠశాలల రూపురేఖలను పూర్తిగా మార్చేస్తున్నామని గత పాలకులు సభలు, సమావేశాల్లో ఊదరగొట్టారు. కానీ వాస్తవ పరిస్థితి దానికి భిన్నంగా ఉందనడానికి నిదర్శనమే విద్యార్థులకు రేకులషెడ్డులో విద్యాభ్యాసం చేయడం. మండలంలోని బోడవారిపల్లి ఎస్సీ కాలనీ ప్రాథమిక పాఠశాల దశాబ్దాల క్రితం నిర్మించింది కావడంతో పూర్తిగా శిథిలావస్థకు చేరింది. గత ప్రభుత్వంలో పాఠశాల మరమ్మతులకైనా నిధులు మంజూరు చేయాలని అధికారులు పంపిన ప్రతిపాదనలు బుట్టదాఖలయ్యాయి. ఇటీవల కురుస్తున్న వర్షాలకు భవనం ఉరుస్తుండడంతో ఎప్పుడు కూలి ఎలాంటి ప్రమాదం సంభవిస్తుందోనని భయపడి గురువారం విధుల్లో ఉన్న సీఆర్పీ ప్రసాద్ పాఠశాలలో ఉన్న పది మంది విద్యార్థులకు అక్కడే ఉన్న రేకులషెడ్డులో నేలపై కూర్చొని విద్యాబోధన చేపట్టారు. పాఠశాల తరగతి గది పూర్తిగా శిథిలావస్థకు చేరినా పట్టించుకోకపోవడంపై గ్రామస్థులు మండిపడుతున్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వమైనా తరగతి గదిని మంజూరు చేయాలని కోరుతున్నారు. సమాచారం అందుకున్న తహసీల్దారు వై నాగరాజు, ఎంఈవో వెంగయ్య పాఠశాలకు చేరుకొని విద్యార్థుల తల్లిదండ్రులతో చర్చించారు. పాఠశాలలో ఆవరణను చదును చేయించడంతోపాటు భవనం మరమ్మతుల విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతానని హామీ ఇచ్చారు. .

హత్య కేసులో నిందితుడి కోసం గాలింపు



కుటుంబ సభ్యులను వివరాలు అడిగి తెలుసుకుంటున్న కావలి డీఎస్పీ శ్రీధర్

ఉదయగిరి రూరల్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): హత్య కేసులో నిందితుడైన మస్తాన్ కోసం ప్రత్యేక బృందాలచే గాలింపు చర్యలు ముమ్మరం చేసినట్లు కావలి డీఎస్పీ శ్రీధర్ పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని కావలి మార్గంలో మస్తాన్ తన భార్య ఇందిరను కత్తితో పొడిచి హత్య చేసిన ప్రదేశాన్ని పరిశీలించడంతోపాటు ఇరువురి కుటుంబ సభ్యులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా స్థానిక సర్కిల్ కార్యాలయంలో ఆయన విలేఖరులతో మాట్లాడుతూ సీఐ, ఎస్ఐలు బృందాలుగా ఏర్పడి నిందితుడి మస్తాన్ కోసం బంధువులు, స్నేహితుల నివాసాలతోపాటు ఇతర ప్రదేశాల్లో ముమ్మర గాలింపు చేస్తున్నామన్నారు. అనంతరం సంబంధిత రికార్డుల కోసం తనిఖీ చేసి సిబ్బందికి తగు సూచనలు, సలహాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సీఐ ఎన్ వెంకట్రావు, ఎస్ఐలు కర్నాటి ఇంద్రసేనారెడ్డి, ఏ శ్రీనివాసులు, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పడుగుపాడులో నగల అపహరణ



ఘటనాస్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ రంగనాథ్ గౌడ్

కోవూరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): పడుగుపాడు శ్రీనివాస బృందావనకాలనీలోని ఖాజారసూల్ ఇంట్లో బుధవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చొరబడ్డారు. ఈ సందర్భంగా ఇంట్లో దాచుకున్న 12సవర్ల నగలు, 400గ్రాముల వెండి ఆభరణాలు, రూ.1.30లక్షల నగదును అపహరించారు. వారంరోజులుగా ఖాజారసూల్ కుటుంబ సభ్యులతో నెల్లూరు నగరంలోని ఇంటికి వెళ్లి ఉండటాన్ని గమనించిన వ్యక్తులు తలుపులు పగుల గొట్టి బీరువాలో దాచుకున్న నగలు, నగదు అపహరించుకు వెళ్లినట్లు బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అదే కాలనీలోని నెల్లూరు కృష్ణారెడ్డి ఇంటి తలుపులు పగులగొట్టి అపహరణకు ప్రయత్నించినట్లు తెలిసింది. ఎస్ఐ రంగనాథ్‌గౌడ్ ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు.

బావమరిదిపై బావ దాడి

లింగసముద్రం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): వీఆర్ కోట ఎస్టీ కాలనీకి చెందిన కొమరిగిరి నరసింహం అతని బావమరిది పోట్లూరి గణేష్‌పై కత్తితో దాడికి పాల్పడ్డారు. ఈ దాడిలో తలవెనుక భాగంలో రక్త గాయాలయ్యాయి. గణేష్‌ను బంధువులు అతన్ని చికిత్స నిమిత్తం కందుకూరు ఏరియా వైద్యశాలలో చేర్పించారు. భార్యాభర్తలు గొడవ పడుతుండగా వద్దని వారించినందుకు ఈ దాడికి పాల్పడినట్లు బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ షేక్ మహబూబ్ సుబానీ తెలిపారు.

విద్యార్థిని అదృశ్యంపై కేసు

నెల్లూరు(క్రైం), డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థిని అదృశ్యమైన ఘటనపై వేదాయపాళెం పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు... తిరుపతి జిల్లా వెంకటగిరి పట్టణానికి చెందిన చిన్నాకు భార్య, ఇద్దరు పిల్లలున్నారు. ఆయన కుమార్తె నెల్లూరు బీవీ నగర్‌లోని ఓ ప్రైవేటు జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతూ కళాశాల హాస్టల్‌లోనే ఉంటోంది. కుమార్తెను చూసేందుకు చిన్నా ఈ నెల 4వతేదీ కళాశాలకు వచ్చారు. అయితే కాలేజీలోగానీ, హాస్టల్‌లోగానీ కుమార్తె కనిపించకపోవడంతో గురువారం వేదాయపాళెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	103
లేయర్ లైవ్	110
స్కిన్ చికెన్	196
స్కిన్‌లెస్	216
లేయర్	187

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ.7344
వెండి కిలో ధర	రూ. 93,800
వెండి ఒక గ్రాము	రూ.96.80

చౌక బియ్యం తరలిపోతోంది

- కార్డుదారుల నుంచి ఎండీయూ వాహనాల సిబ్బంది కొనుగోలు
- కిలోకు రూ.10 నుంచి 12 చెల్లింపు

- పెద్ద మొత్తంలో నిల్వ ● ఆ తర్వాత అక్రమ రవాణా ● రేషన్ కందిపప్పూ బ్లాక్ మార్కెట్‌కు...

నెల్లూరు(హరనాథపురం), డిసెంబరు 4 (ఆంధ్ర జ్యోతి) : రేషన్ బియ్యం పెద్ద మొత్తంలో జిల్లా నుంచి అక్రమంగా తరలిపోతోంది. ముఖ్యంగా నెల్లూరు నగరం, రూరల్ ప్రాంతాల్లో ఈ అక్రమ వ్యాపారం భారీగా సాగుతోంది. వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత ఇంటి వద్దకే రేషన్ సరుకులు అనే నినాదంతో ఎండీయూ వాహనాలను ప్రవేశపెట్టింది. డీలర్లు ఎంఎల్ఎస్ పాయింట్ల నుంచి రేషన్ షాపులకు సరుకులు తీసుకుని వచ్చి, ఎండీయూ వాహనాల వారికి ప్రతిరోజూ ఇవ్వడానికే పరిమితమయ్యారు. అయితే ఎండీయూ వాహనాల వారు కొందరు విచ్చలవిడిగా బియ్యం అక్రమ తరలింపునకు పూనుకున్నారు. కార్డుదారుల నుంచి కిలో బియ్యాన్ని రూ. 10 నుంచి రూ.12లకు కొనుగోలు చేస్తున్నారు. ఇలా సేకరించిన బియ్యాన్నంతా ఒకచోట నిల్వ చేసి ఆ తర్వాత ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. నెల్లూరు నగరంలోని ఎన్టీఆర్ నగర్ ప్రాంతంలో ఇలాంటి డంపింగ్ కేంద్రాలు ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది.

అమ్మేస్తున్న కార్డుదారులు

జిల్లాలో 1510 రేషన్ షాపులు, 450 ఎండీయూ వాహనాలు ఉన్నాయి. ఈ షాపుల పరిధిలో 7,33,771 బియ్యం కార్డులు ఉన్నాయి. కార్డులోని ఒక్కో సభ్యునికి 5 కిలోల చొప్పున బియ్యాన్ని ఉచితంగా అందజేస్తారు. అలాగే, కార్డుకు అరకేజీ చక్కెరను రూ.17కు, కేజీ కందిపప్పును రూ.67కు విక్రయిస్తున్నారు. అయితే పట్టణాల్లో చాలా మంది కార్డుదారులు రేషన్ బియ్యాన్ని తీసుకోవడం లేదు. ప్రభుత్వం ఉచితంగా ఇచ్చే బియ్యానికి కిలో రూ.10 నుంచి 12 వరకు వస్తోందని ఎండీయూ వాహనాల వారికే అమ్మేస్తున్నారు. ఈ పరిస్థితిని అక్రమార్కులు అవకాశంగా మలుచుకున్నారు. ఎండీయూ వాహనాల సిబ్బందిలో కొందరు రైస్ మిల్లర్లతో కుమ్మక్కై, సేకరించిన రేషన్ బియ్యాన్ని రైస్ మిల్లులకు తరలిస్తున్నారు. అక్కడ వాటిని



కావలిలో రేషన్ బియ్యం తరలిస్తుండగా అధికారులు స్వాధీనం చేసుకున్న లారీ

రీసైక్లింగ్ చేసి బహిరంగ మార్కెట్‌లో విక్రయించే బియ్యంలో కలిపేస్తున్నారన్న ఆరోపణలున్నాయి.

కందిపప్పు కూడా బ్లాక్ మార్కెట్‌కు...

కందిపప్పుకు బహిరంగ మార్కెట్‌లో అధిక ధర ఉండటంతో ప్రభుత్వం కిలో రూ.67కే రేషన్‌కార్డుదారులకు అందచేస్తోంది. అయితే కొందరు కార్డుదా రుల నుంచి ఎండీయూ వాహనాల సిబ్బంది కిలో కందిపప్పును రూ.90కు కొనుగోలు చేసి బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తున్నట్లు సమాచారం. బియ్యం ఉచితం అయినప్పటికీ, కందిపప్పు, చక్కెరకు ఎండీయూ వాహనాల వారు డీలర్లకు డబ్బు చెల్లించాల్సి ఉంది. కానీ, కొంత మంది ఎండీయూ వాహనాల వారు డీలర్లకు రూ.20 వేల నుంచి రూ. 50వేల వరకు చెల్లించకుండా కాలయాపన చేస్తున్నట్లు తెలిసింది. దీంతో డీలర్లు ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లడానికి సిద్ధమవుతున్నట్లు సమాచారం. జిల్లాలో రేషన్ బియ్యం, కందిపప్పు అక్రమ వ్యాపారం జోరుగా సాగుతున్నప్పటికీ అరికట్ట డంలో అధికారులు విఫలమవుతున్నారు. దీంతో ప్రభుత్వ లక్ష్యానికి తూట్లు పడుతున్నాయి.

డెకరేషన్ సామాన్ల గోదాములో అగ్నిప్రమాదం



మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

నెల్లూరు(క్రైం), డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరులోని కొండాయపాలెంలో పూల డెకరేషన్‌కు ఉపయోగించే ఫైబర్స్ గోదాములో అగ్ని ప్రమాదం సంభవించింది. గురువారం తెల్లవారు జామున విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగాయి. యజమాని రవికుమార్ ఫిర్యాదుతో అగ్నిమాపక సిబ్బంది అక్కడికి చేరుకుని మంటలను అదుపు చేశారు. డీఎఫ్‌వో వాకా శ్రీనివాసులు రెడ్డి, నెల్లూరు స్టేషన్ ఫైర్ అధికారి వేణుగోపాల్‌రావు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. రూ.25 లక్షలకుపైగా నష్టం వాటిల్లినట్లు బాధితుడు తెలిపారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

నెల్లూరు రూరల్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలపాలై చికిత్స పొందుతున్న నెల్లూరు జగదీష్ (20) అనే యువకుడు గురువారం మృతి చెందినట్లు రూరల్ సీఐ వేణు తెలిపారు. నెల్లూరు రూరల్‌లోని గుడిపల్లిపాడుకు చెందిన జగదీష్ బుధవారం నారాయణ రెడ్డిపేట నుంచి నెల్లూరుకు బైక్‌పై వస్తుండగా రోడ్డుపై గేదె అడ్డంరావడంతో ప్రమాదానికి గురై గాయపడ్డాడు. నెల్లూరులోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించాడని, కేసు దర్యాప్తు చేస్తున్నామని సీఐ వెల్లడించారు.

వ్యాపారంలో వాటా పేరుతో రూ.1.60 కోట్లకు మోసం

నెల్లూరు(క్రైం), డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : ప్రముఖ కంపెనీలో షేర్లు, వ్యాపారాల్లో భాగస్వామ్యం ఇప్పిస్తానని పలువురిని నమ్మించి మోసం చేసిన వ్యక్తిపై బాలాజీనగర్ పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు... నెల్లూరులోని రాంజీనగర్‌కు చెందిన ప్రసాద్ పలు వ్యాపారాలు చేస్తున్నారు. ఆయన ప్రముఖ కంపెనీలో షేర్లు, వ్యాపారాల్లో భాగస్వామ్యం ఇప్పిస్తామని చిల్డ్రన్స్‌పార్కు ప్రాంతానికి చెందిన శ్రావణ్‌కుమార్ నుంచి రూ.1.60 కోట్లు తీసుకుని మోసగించారు. బాధితుడు గురువారం బాలాజీనగర్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు దర్యాప్తు చేస్తున్నామని ఇన్‌స్పెక్టర్ కే సాంబశివరావు తెలిపారు. ప్రసాద్ ఇదే తరహాలో మరో పదిమందిని మోసగించినట్లు సమాచారం.

ఎస్ఈఐఎల్ ఎనర్జీకి ప్రతిష్ఠాత్మక అవార్డు

- గ్రేట్ ప్లేస్ టు వర్క్‌గా గుర్తింపు



ఎస్ఈఐఎల్ సంస్థ ఉద్యోగులతో సీఈవో రాఘవ్ త్రివేది

ముత్తుకూరు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : స్వతంత్ర విద్యుత్ ఉత్పత్తిదారులుగా ఉన్న ఎస్ఈఐఎల్ ఎనర్జీ ఇండియా లిమిటెడ్ సంస్థకు అత్యంత ప్రతిష్ఠాత్మక గ్రేట్ ప్లేస్ టు వర్క్ సర్టిఫైడ్ గుర్తింపు లభించింది. ఈ ప్రతిష్ఠాత్మక గుర్తింపు సానుకూల, సహాయక పని వాతావరణం కల్పించడంతోపాటు ఉద్యోగుల వృద్ధికి తోడ్పాటు అందించడం వంటి అంశాల్లో ఎస్ఈఐఎల్ ఎనర్జీ నిబద్ధతకు నిదర్శనం. గ్రేట్ ప్లేస్ టు వర్క్ అనేది వర్క్ ప్లేస్ కల్చర్‌పై గ్లోబల్ అథారిటీ. 1992 నుంచి ప్రపంచ వ్యాప్తంగా 100 మిలియన్ల కంటే ఎక్కువ మంది ఉద్యోగులను గొప్ప పని ప్రదేశాన్ని నిర్వచించడానికి ఆ లోతైన విశ్లేషణలు ఉపయోగించి సర్వే చేసి సర్టిఫికేషన్ అందజేస్తున్నారు. ఎస్ఈఐఎల్ ఎనర్జీ ఇండియా జిల్లాలోని పైనంపురం వద్ద 2.64 జీడబ్ల్యూ సూపర్ క్రిటికల్ థర్మల్ పవర్ జనరేషన్ కాంప్లెక్స్‌ను కలిగి ఉంది. బలమైన నాయకత్వ బృందం నేతృత్వంలో ఎస్ఈఐఎల్ ఈ ప్రాంతం పురోగతిలో దీర్ఘకాలిక భాగస్వామి, ఉపఖండం అంతటా వినియోగదారులకు నమ్మకమైన, స్థిరమైన విద్యుత్‌ను అందిస్తోంది. భారతదేశ ఇంధన భద్రత, అభివృద్ధి లక్ష్యాలకు మద్దతుగా 4/660 మెగా వాట్ల కార్యాచరణ యూనిట్లతో రాష్ట్ర ఇంధన అవసరాలను తీర్చడానికి అత్యుత్తమ పరిష్కారాలను అందజేస్తోంది. ఈ గుర్తింపు దక్కించుకున్న సందర్భంగా గురువారం ప్లాంట్‌లో నిర్వహించిన అభినందన సమావేశంలో కంపెనీ సీఈవో రాఘవ్ త్రివేది మాట్లాడుతూ పని చేయడానికి గొప్ప ప్రదేశంగా గుర్తించినందుకు సంతోషిస్తున్నట్లు చెప్పారు. తమ సంస్థ ఉద్యోగులను గొప్ప ఆస్తిగా నమ్ముతామని, వారి వృద్ధి, శ్రేయస్సు కోసం పెట్టుబడులు కొనసాగిస్తామన్నారు. ఉద్యోగుల అభిప్రాయం. నిజ సమయ రిపోర్టింగ్, వ్యూహాత్మక నిర్ణయాలు తీసుకోవడానికి అవసరమైన విశ్లేషణలకు అవకాశం కల్పిస్తుందన్నారు. గ్రేట్ ప్లేట్ టు వర్క్ సర్టిఫికేషన్ ద్వారా ఉద్యోగుల అభిప్రాయం, సర్వేలు, సాంస్కృతిక తనిఖీలతో సహా ఎస్ఈఐఎల్ ఎనర్జీ దక్కించుకున్న గుర్తింపు ప్రపంచంలో అత్యంత గౌరవనీయమైనదన్నారు.

ఎస్సీ వర్గీకరణ నివేదికను నెలలోగా ఇవ్వాలి



సమావేశంలో మాట్లాడుతున్న మున్నంగి నాగరాజు

నెల్లూరు(హరనాథపురం), డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : ఎస్సీ వర్గీకరణకు సంబంధించి నియమించిన ఏకసభ్య కమిషన్ నివేదికను నెలలోగా ఇవ్వాలని ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు మున్నంగి నాగరాజు మాదిగ డిమాండ్ చేశారు. గురువారం నెల్లూరులోని జగ్జీవన్‌రామ్ భవన్‌లో ఎమ్మార్పీస్ అనుబంధ సంఘాల సమా వేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ నివేదిక అందచేస్తే రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణ ఫలాలు మాదిగలకు అందే అవకాశం ఉంటుందన్నారు. ఎస్సీ వర్గీకరణకు మాలలు అడ్డంకులు కల్పిస్తున్నప్పటికీ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సహకారంతో త్వరలో వర్గీకరణ సాధిం చుకుంటామనే నమ్మకం ఉందన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు రుద్రపోగు సురేష్ మాదిగ, ఎంఎస్‌పీ జాతీయ నేత సొట్ట నరేం ద్రబాబు మాదిగ, జిల్లా అధ్యక్షుడు పందిటి అంబేడ్కర్ మాదిగ, దుడ్డు రామకృష్ణ, గొల్లపల్లి శ్రీనివాస్ మాదిగ, మంద పెంచలయ్య మాదిగ తదితరులు పాల్గొన్నారు.

వ్యాపారాలపై కొనసాగుతున్న విజి'లెన్స్'

- గుట్కా వ్యాపారులపై ప్రత్యేక దృష్టి
- అజ్ఞాతంలోకి పలువురు...

నెల్లూరు(క్రైం), డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : నకిలీ వే బిల్లులు, నకిలీ జీఎస్టీ నెంబర్లతో ప్రభుత్వానికి పన్నులు ఎగవేస్తున్న వ్యాపారులపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు లోతుగా విచారణ చేస్తున్నారు. బుధవారం నెల్లూరు నగరంలోని ఎన్టీఆర్ నగర్‌లో మహేంద్ర అనే వ్యాపారికి చెందిన గోదాముపై దాడులు చేసి గుట్కా, పాన్‌మసాలాలను స్వాధీనం చేసుకున్న విషయం తెలిసిందే. వాటికి జీఎస్టీ చెల్లించకపోవడంతో గురువారం లోతుగా విచారణ చేపట్టారు. వ్యాపారి గుట్కాలను ఎక్కడ నుంచి ఎంతకు కొనుగోలు చేశారు?, ఎవరెవరికి విక్రయిస్తున్నారు?, దాని తాలూకు జీఎస్టీ, వే బిల్లుల పూర్తి వివరాలపై ఆరా తీస్తున్నారు. ఇదే క్రమంలో జిల్లాలోని గుట్కా వ్యాపారులపై కూడా దృష్టి సారించినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో పలువురు వ్యాపారులు దుకాణాలు, గోదాముల ను మూసివేసి అజ్ఞాతంలోకి వెళ్లారని తెలిసింది.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

వెంకటాచలం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తిక్కవరప్పాడు పంచాయతీ జోసఫ్‌పేట సమీపంలో ఉన్న సర్వేపల్లి రిజర్వాయర్ వద్ద గత కొంతకాలంగా జరుగుతున్న పేకాట స్థావరంపై గురువారం సాయంత్రం పోలీసులు దాడులు నిర్వహించారు. సీఐ సుబ్బారావు, ఎస్ఐ ఆంజనేయులు వారి సిబ్బందితో కలిసి పేకాట స్థావరంపై చేసి ఆరుగురు పేకాటరాయుళ్లను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.2270 రుపాయల నగదు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ సుబ్బారావు తెలిపారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

బుచ్చిరెడ్డిపాళెం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): కట్టుబడిపాళెంకు చెందిన తిరునగర్ శ్రీనివాసులు (39) ఆత్మహత్యాయత్నంకు పాల్పడి చికిత్స పొందుతూ కోలుకోలేక గురువారం మృతి చెందినట్లు బుచ్చి పోలీసులు తెలిపారు. మనస్తాపానికి గురైన ఆయన బుధవారం ఉదయం క్రిమిసంహారక మందుతాగాడు. గమనించిన బంధువులు నెల్లూరు ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

8న పురుషుల హ్యాండ్‌బాల్ జిల్లా జట్టు ఎంపిక

నెల్లూరు(విద్య), డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 8వతేదీన క్రీడాకారుల ఎంపికలు నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ అధ్యక్షకార్యదర్శులు జీ అమర్, డీ శ్రీరేష్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. చిల్లకూరులోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులం క్రీడా మైదానంలో ఈ ఎంపికలు జరుగుతాయని తెలిపారు. ఉమ్మడి నెల్లూరు జిల్లాకు చెందిన క్రీడాకారులు వారి ఆధార్‌కార్డుతో సంబంధిత తేదీలో మధ్యాహ్నం 2 గంటలకు హాజరు కావాలన్నారు. ఎంపికైన క్రీడాకారులు అనంతపురం జిల్లా కళ్యాణదుర్గంలో ఈనెల 13 నుంచి 15వతేదీ వరకు జరిగే రాష్ట్ర పోటీలకు జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు.

చంద్రబాబు పాలనలో ప్రగతి పథంలో రాష్ట్రం

● టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి చెంచలబాబు యాదవ్



విలేకరులతో మాట్లాడుతున్న చెంచలబాబు

ఉదయగిరి రూరల్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పాలనలో రాష్ట్రం అన్నిరంగాల్లో ప్రగతి పథంలో నడుస్తోందని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పొన్నెబోయిన చెంచలబాబు యాదవ్ అన్నారు. గురువారం స్థానిక చెంచురామయ్య అతిథిగృహంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడిన అతి తక్కువ కాలంలోనే పరిశ్రమల ఏర్పాటుకు రూ.4.87 లక్షల కోట్ల పెట్టుబడులు తీసుకొచ్చిన ఘనత చంద్రబాబుకే దక్కుతుందన్నారు. పరిశ్రమల స్థాపనతో నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగాలేకపోయినా ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నారన్నారు. ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి సహకారంతో ఉదయగిరి నియోజకవర్గాన్ని పారిశ్రామికవాడగా అభివృద్ధి చేసి వలసల నివారణకు ఎమ్మెల్యే కాకర్ల సురేష్ అన్ని చర్యలు తీసుకుంటున్నారన్నారు. సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని పూర్తి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ కన్వీనర్ బయ్యన్న, టీడీపీ నాయకులు రియాజ్, బొజ్జా నరసింహులు, సందానీ, ఉప్పుటూరి పెదవెంకటయ్య, మస్తాన్, కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదలకు భూములు పంచకపోతే ఉద్యమిస్తాం

● సీపీఐ జిల్లా నేత దామా



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి దామా అంకయ్య

కావలి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక రియల్ ఎస్టేట్ వారి ఆక్రమణలో 120ఎకరాలు ప్రభుత్వ భూమి ఉందని అధికారులు చెబుతున్న దానికన్నా అదనంగానే ఉందని ఆభూమిని సంక్రాంతిలోపు స్వాధీనం చేసుకుని అర్హులైన పేదలకు పంపిణీచేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి దామా అంకయ్య డిమాండ్ చేశారు. ఈ విషయంపై గురువారం ఆయన కావలి జర్నలిస్ట్ క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఆక్రమించుకున్న భూములను పేదలకు పంపిణీ చేయకపోతే సీపీఐ ఆధ్వ ర్యంలో పేదలతో కలిసి ఉద్యమిస్తామని హెచ్చరించారు. కూటమి ప్రభుత్వం అధికారం లోకి వస్తే పట్టణాలలో రెండు సెంట్లు, గ్రామాలలో మూడు సెంట్లు నివాసస్థలాలు ఇస్తామని చెప్పారని తెలిపారు. ఇళ్లు నిర్మించు కునేందుకు ప్రభుత్వం ఒక్కో ఇంటికి రూ. 5లక్షలు మంజూరు చేసి ఇసుక, సిమెంటు, ఐరన్‌ను రాయితీ ధరలకు అందించాలని కోరారు. అర్హులైన పేదలు సచివాలయాలలో నివాస స్థలాల కోసం దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. సమావేశంలో సీపీఐ నాయకులు బలిజేపల్లి వెంకటేశ్వర్లు, కే. నాగరాజు, చేవూరు కొడయ్య తదితరులు పాల్గొన్నారు.

నర్సరీలకు 50శాతం సబ్సిడీ

కలువాయి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): చిన్నపాటి నర్సరీలు ఏర్పాటు చేసుకునే రైతులకు యూనిట్ విలువలో 50శాతం ప్రభుత్వం ఉద్యానవన శాఖ ద్వారా సబ్సిడీ అందించనున్నట్లు కలువాయి మండల ఉద్యానవన శాఖ అధికారి మిథిలా తెలిపారు. రూ. 15లక్షలు యూనిట్ విలువ గల నర్సరీని రైతులు ఏర్పాటుచేసుకుంటే దానికి రూ.7.5లక్షలు సబ్సిడీ వస్తుందని చెప్పారు. అలాగే 60అడుగుల పొడవు, 40అడుగుల వెడల్పుతో కలెక్షన్ సెంటర్ నిర్మించుకునే రైతులకు రూ.6లక్షలు, సోలార్ కోల్డ్ రూం ఏర్పాటు చేసుకునే వారికి రూ.5.25లక్షలు సబ్సిడీ ఉంటుందని ఆమె వివరించారు. అవసరమైన రైతులు వివరాలకు కార్యాలయంలో సంప్రదించాలని ఆమె కోరారు.

● సంగం : రక్షిత వ్యవసాయ పథకం కింద షెడ్‌నెట్, పాలిహౌస్‌ల నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం 50 శాతం రాయితీ ఇస్తుందని, కావలసిన రైతులు దరఖాస్తు చేసుకోవచ్చునని హార్టికల్చర్ అధికారి లక్ష్మి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. షెడ్‌నెట్ నిర్మాణానికి ఎకరాకు రూ. 38.4 లక్షలు, పాలి హౌస్ నిర్మాణానికి రూ. 37.4 లక్షల నిధులు మంజూరవుతాయన్నారు. అందులో 50 శాతం రాయితీ ఉద్యానశాఖ ద్వారా ఇవ్వడం జరుగుతుందని కావలసిన రైతులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

మెగా పీటీఎం సమావేశం విజయవంతం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో

ఆత్మకూరు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీ, మండలంలోని ప్రతి పాఠశాలలో ఈ నెల 7వ తేదీన జరిగే మెగా తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశం విజయంతం చేయాలని ఎంపీడీవో కోరారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో పాఠశాలలకు నోడల్ అధికారులుగా నియమించబడ్డ మండలస్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శుల, డిజిటల్ అసిస్టెంట్‌తో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల పనితీరును మరింత మెరుగుపరచడానికి ప్రజల భాగస్వామ్యం కల్పించి పేరెంట్స్, టీచర్స్ మీటింగ్ నిర్వహించడం జరుగుతోందని, పిల్లల భవిష్యత్తును తీర్చిదిద్దే విధంగా తగు ప్రణాళికలు రూపొందించనున్నట్లు తెలిపారు. నోడల్ అధికారులుగా నియమించబడ్డ మండలస్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్‌లు తప్పక హాజరు కావాలని ఆదేశించారు. అదేవిధంగా పాఠశాల ఆవరణలో క్లాప్ మిత్రుల ద్వారా శానిటేషన్ కార్యక్రమాన్ని పర్యవేక్షించాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఈవో శ్రీనివాస రావు, పాఠశాల నోడల్ అధికారులు, కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

నిషేధిత జాబితా నుంచి భూముల తొలగింపుపై హర్షం

లింగసముద్రం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక గ్రామ సర్వే నంబరు 79లోని ఏ 18.80 సెంట్ల గ్రామ కంఠం భూములను 22-బి నిషేధిత భూముల జాబితా నుండి తొలగించడంపై ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావుకు టీడీపీ నాయకులు అడపా రంగయ్య, జి ప్రసాద్, చిన కొండయ్య, ముసలయ్యలు గురువారం ఒక ప్రకటనలో ధన్యవాదాలు తెలిపారు. గ్రామ కంఠం కింద ఈ భూములను ఏడేళ్ల కిందట అధికారులు, సిబ్బంది 22-బిలో చేర్చడంతో ఈ సర్వే నంబరులోని నివాసాల వారు స్థలాలు, ఇళ్లు రిజిస్ట్రేషన్లు జరగక పోవడంతో అమ్ముకోలేక, కొనలేక ఇబ్బందులు పడ్డారని చెప్పారు. దీంతో ఎమ్మెల్యే నాగేశ్వరరావు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని ఈ భూములకు విముక్తి కలిగిండంతో గ్రామ ప్రజలు కృతజ్ఞతలు చెబుతున్నారని వారు తెలిపారు.

ఫసల్‌బీమాపై రైతులకు అవగాహన



వలేటివారిపాలెం: మాట్లాడుతున్న ఏఓ హేమంత్‌భరత్‌కుమార్

వలేటివారిపాలెం, డిసెబరు 5 (ఆంధ్రజ్యోతి): పోకూరు రామాలయంలో గురు వారం ఏఓ హేమంత్ భరత్‌కుమార్ ఫస ల్‌బీమాపై రైతులకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఏఓ హేమత్ భరత్‌కుమార్ మాట్లాడారు. పంటలకు బీమా చేయించుకుంటే తుఫాను, కరువు, అకాల వర్షాలతో కలిగే ప్రకృతి వైపరీత్యాలతో పంట దిగుబడి నష్టపోయిన రైతులకు ఇన్సూరెన్స్ కంపెనీ ద్వారా ఆర్థిక సాయం అందుతుందన్నారు. కౌలు రైతు లకు కూడా ఈ బీమా సౌకర్యం వర్తిస్తుం దన్నారు. ఈనెల 15వ తేదీలోపు బీమా చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో టాటా ఏఐజి ఇన్సూరెన్స్ కంపెనీ ప్రతినిధి రామరాజు, ఉద్యానవన సహాయకులు భాషా పాల్గొన్నారు.

సస్యరక్షణ చర్యలపై శిక్షణ

● ఉలవపాడు : మామిడిలో పూతదశలో చేపట్టాల్సిన సస్యరక్షణ చర్యలపై గురువారం ఉలవపాడు రైతుసేవా కేంద్రంలో రైతులకు శిక్షణ ఇచ్చినట్లు మండల ఉద్యాన అధికారి జ్యోతి తెలిపారు. డిసెంబర్ మూడోవారం నుంచి పూతలు వచ్చే అవకాశం ఉన్నందున తేమతో కూడిన వాతావరణంలో మామిడిలో బూడిద తెగులు వచ్చే అవకాశం ఉన్నందున ఒక లీటర్ నీటికి 5గ్రామల పోగిటాషియం బై కార్బొనేట్ కలిపి పిచికారి చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఐసీ ఇన్సూరెన్స్ కంపెనీ ప్రతినిధి వెంకట్రావు, ఉద్యాన సహాయకులు కే శ్రీనివాసులు, స్థానిక మామిడి రైతులు పాల్గొన్నారు.

శిథిలావస్థలో తరగతి గదులు

భయం గుప్పెట్లో విద్యార్థులు, ఉపాధ్యాయులు



శిథిలావస్థలో తరగతి గదులు

ఉదయగిరి రూరల్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కురుస్తున్న వర్షాలకు స్థానిక ఉన్నత పాఠశాలలో విద్యార్థులు, ఉపాధ్యాయులు భయం గుప్పెట్లో కాలం వెళ్లదీస్తున్నారు. దశాబ్దాల క్రితం నిర్మించిన భవనాలు కావడంతో తరగతి గదులు పూర్తిగా శిథిలావస్థకు చేరాయి. ఉపాధ్యాయులు విశ్రాంతి తీసుకునే గదులు సైతం పురాతమైనవి కావడంతో ఎప్పుడు కూలుతాయో తెలియని పరిస్థితి. దీనికితోడు పాఠశాలలో 498 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. వారికి తగ్గట్టుగా గదులు లేకపోవడంతో ఒకే గదిలో పదుల సంఖ్యలో విద్యార్థులు కూర్చోవాల్సిన పరిస్థితి. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు ఎప్పుడు ఎలాంటి ప్రమాదం సంభవిస్తుందోనని అటు విద్యార్థులు, ఇటు ఉపాధ్యాయులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పాఠశాల దుస్థితిని చూసి గత ప్రభుత్వం నాడు-నేడు పథకంలో భాగంగా రూ.1.50 కోట్లతో అదనపు తరగతి గదులు నిర్మాణానికి చర్యలు చేపట్టింది. అయితే ఆ గదుల నిర్మాణం నిధుల లేమితో అసంపూర్తిగా మిగిలిపోవడంతో శిథిల భవనాల్లోనే భయం నీడన బిక్కుబిక్కుమంటూ ఉండాల్సి వస్తోందని వాపోతున్నారు.

ఉపాధ్యాయుడి కుటుంబానికి న్యాయం చేయాలి : ఫ్యాప్టో



ఆత్మకూరులో నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

ఆత్మకూరు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల దాడిలో మృతి చెందిన రాయచోటి పట్టణంలో కొత్తపల్లి ఉర్దూ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడి కుటుంబానికి న్యాయం చేయాలని ఫ్యాప్టో ఉపాధ్యాయ సంఘం డిమాండ్ చేసింది. గురువారం ఆత్మకూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరిగిన హెచ్‌ఎంల సమావేశంలో ఫ్యాప్టో ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు ఆందోళన చేశారు. ఈ సందర్భంగా ఫ్యాప్టో నెల్లూరు జిల్లా శాఖ చైర్మన్ సురేంద్రరెడ్డి మాట్లాడుతూ పాఠశాలల పరిసరాలలో గుట్కా, గంజాయి వంటి విష సంస్కృతిని ప్రభుత్వం అరికట్టాలని, బాధిత ఉపాధ్యాయ కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఫ్యాప్టో కార్యవర్గ సభ్యుడు శివప్రసాద్ మాట్లాడుతూ ఉపాధ్యాయులకు రక్షణ కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఫ్యాప్టో ప్రతినిధులు అంకయ్య, ఖాదర్‌బాషా, నరేంద్రరెడ్డి, హరికృష్ణ, సుధాకర్, కొండయ్య, శివకుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

●అనంతసాగరం: మండలంలోని ఫ్యాప్టో ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు గురువారం నిరసన చేపట్టారు. రాయచోటిలో విద్యార్థుల దాడిలో మరణించిన ఉపాధ్యాయుని మృతికి సంతాపం తెలిపి విచారం వ్యక్తం చేశారు. బాధ్యులపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని మండల విద్యా శాఖాధికారి 2 ప్రభాకర్‌రెడ్డికి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘం నాయకులు పాల్గొన్నారు.

కష్టమైనా ఇష్టంగా చదివితేనే భవిష్యత్తు : ఎమ్మెల్యే దగుమాటి

● రుద్రకోట పాలిటెక్నిక్ కళాశాలలో పాలీ టెక్‌ఫెస్ట్ ప్రారంభం



విద్యార్థుల ప్రదర్శనలను తిలకిస్తున్న ఎమ్మెల్యే దగుమాటి

కావలి రూరల్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): కష్టమైనా ఇష్టంగా చదువుకుంటేనే విద్యార్థులకు మంచి భవిష్యత్తు ఉంటుందని ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి తెలిపారు. స్థానిక రుద్రకోట ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో గురువారం ఎమ్మెల్యే క్రిష్ణారెడ్డి చేతులు మీదుగా పాలీ టెక్‌ఫెస్ట్‌ను ప్రారంభించారు. ప్రిన్సిపాల్ సుశీల్‌కుమార్ ప్రియ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే క్రిష్ణారెడ్డి, పాలిటెక్నిక్ కళాశాలల రీజనల్ జాయింట్ డైరక్టర్ నిర్మల్ కుమార్ ప్రియ పాల్గొన్నారు. అనంతరం - ఆర్‌జేడీ నిర్మల్ కుమార్ ప్రియ మాట్లాడారు. విద్యార్థులు ఇలాంటి ప్రాజెక్టులు చేయడం వలన ఉద్యోగ అవకాశాల కల్పనకు దోహద పడతాయన్నారు. పాలిటెక్నిక్ కళాశాలల ప్రిన్సిపాల్‌లు, లెక్చరర్లు ఇలాంటి కార్యక్రమాలతో ప్రొత్సాహం అందించాలన్నారు. అనంతరం మెకానికల్, సివిల్, కంప్యూటర్ ఇంజనీర్ మొదలైన వివిధ ప్రభుత్వ, ప్రయివేటు కళాశాలల నుండి పాల్గొన్న 170 మంది విద్యార్థులు 56 విన్నూతన ప్రాజెక్టులు ప్రదర్శనలో ఉంచారు. కార్యక్రమంలో విభాగాధిపతులు, టీడీపీ నాయకుడు గుంటుపల్లి రాజ్‌కుమార్ చౌదరి వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొనారు.

వెంగమాంబకు పల్లకీ సేవ



పల్లకీ సేవ నిర్వహిస్తున్న అర్చకులు

దుత్తలూరు(ఉదయగిరి రూరల్), డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నర్రవాడలో ఉన్న శ్రీవెంగమాంబ పేరంటాలమ్మ అమ్మవారికి పల్లకీ సేవను గురువారం ఆలయ వ్యవస్థాపక ధర్మకర్తల ఆధ్వర్యంలో అర్చకులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు అమ్మవారికి అభిషేకాలు, ప్రత్యేక చందన అలంకారం, కుంకుమార్చన కార్యక్రమాలు నిర్వహించి అనంతరం పల్లకీసేవ కార్యక్రమాన్ని చేపట్టారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

ఉపాధ్యాయుల నిరసన



ఎంఈవో-2కు మెమోరాండం అందిస్తున్న యూటీఎఫ్ నాయకులు, ఉపాధ్యాయులు.

కలువాయి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): యూటీఎఫ్ రాష్ట్రశాఖ పిలుపుమేరకు కలువాయిలో గురువారం పాఠశాలల పనివేళల పెంపు, 100రోజుల యాక్షన్ ప్లాన్, అపార్ నమోదు, 10శాతం సెలవుల నిర్ణయాలపై ఉపాధ్యాయులు నిరసన వ్యక్తం చేశారు. ఎంఈవో-2 శేషగిరిరావుకు మెమోరాండం అందజేశారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దివ్యాంగుల దినోత్సవం

చేజర్ల, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన చేజర్లలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలోని భవిత కేంద్రంలో గురువారం ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంఈవో మస్తానయ్య, కాంప్లెక్ ప్రధానోపాధ్యాయురాలు హైమావతి పాల్గొని మాట్లాడుతూ భవిత సెంటర్లను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అంద జేశారు. ఈ కార్యక్రమంలో ఐఈఆర్టి మస్తాన్ వలి, ప్రభుత్వ కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

కోడి పందేల స్థావరంపై దాడి

కావలి రూరల్, డిసెంబరు5 (ఆంధ్రజ్యోతి): అన్నగారిపాలెం అటవీ ప్రాంతంలోని కోడి పందేల స్థావరంపై గురువారం సీఐ రాజేశ్వరరావు ఆదేశాలతో ఎస్‌ఐలు బాజీబాబు, తిరుమల రెడ్డి, బాలక్రిష్ణ దాడులు నిర్వహించి నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుండి రూ.7,250 నగదు, 5 కోడి పుంజులు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

సీఎం చంద్రబాబును కలిసిన ఎమ్మెల్యే క్రిష్ణారెడ్డి

కావలి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి బుధవారం ఉండవల్లిలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్‌ను కలిశారు. ఈ సందర్భంగా అక్కడే ఉన్న మంత్రాలయ శ్రీగురురాఘవేంద్రస్వామి మఠం పీఠాధిపతి సుబుదేంద్ర తీర్థులతో కలిశారు. ఈ సందర్భంగా పీఠాధిపతి సీఎం చంద్రబాబును ఆశీర్వదించి రాజధాని నిర్మాణానికి రూ.50లక్షలు విరాళం అందజేశారు. ఎమ్మెల్యే క్రిష్ణారెడ్డి పీఠాధిపతికి కృతజ్ఞతలు తెలిపారు.

టీవీఎస్ ట్రస్ట్ క్యాలెండర్ ఆవిష్కరణ

● కావలి టౌన్: టీవీఎస్ చారిటబుల్ ట్రస్ట్ క్యాలెండర్‌ను గురువారం ఎమ్మెల్యే కృష్ణారెడ్డి ఆవిష్కరించారు. ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు తోట వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యేను ట్రస్ట్ సభ్యులు సత్కరించి పూలమొక్కను బహూకరించారు. కార్యక్రమంలో ట్రస్ట్ సెక్రటరీ గాదిరెడ్డి హరనాథ్, కోశాధికారి వేములపాటి మాధవ, పాల్గొన్నారు.

వంటేరు కుటుంబానికి పరామర్శ

● బిట్రగుంట : ముంగమూరు టీడీపీ నాయకుడు యన్నాబత్తిన్న వెంకటేశ్వర్లు బావ వంటేరు శ్రీనివాసులు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. వీరి కుటుంబ సభ్యులను గురువారం ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి పరామర్శించారు. కార్యక్రమంలో మాజీ ఏఎంసీ చైర్మన్ దేవరాళ్ల సుబ్రమణ్యం యాదవ్, స్థానిక టీడీపీ నేతలు మాలేపాటి నాగే శ్వరావు, ముంతాల వెంకటేశ్వర్లు, ఎల్.సుధీరబాబు, వెంకటేశ్వర్లురెడ్డి, గుంటుపల్లి రాజ్‌కుమార్ చౌదరి, తిరివీధి ప్రసాద్, డాకా శ్రీనివాసులురెడ్డి ఉన్నారు.

సురేంద్ర మృతి బాధాకరం : బొల్లినేని

కలిగిరి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): టీడీపీ రాష్ట్ర రైతు ఉపాధ్యక్షుడు బీవీ రామారావు రెండో కుమారుడు, టీఎన్ఎస్ఎఫ్ నాయకుడు బొల్లినేని సురేంద్ర ఆకస్మిక మృతి తమను దిగ్భ్రాంతికి గురిచేసిందని తెలుగుదేశం జాతీయ ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే బొల్లినేని వెంకటరామారావు తెలిపారు. పెద్దపాడులో గురువారం సురేంద్ర చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. సురేంద్ర కుటుంబసభ్యులను పరామర్శించారు. పార్టీ పిలునిచ్చిన కార్యక్రమాల్లో సురేంద్ర చురుగా పాల్గొనేవాడన్నారు. కార్యక్రమంలో మాజీ మండలాధ్యక్షుడు ఎంవీ రామిరెడ్డి, ఊసా మాల్యాద్రి, మహేష్, మొక్కా హజరత్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

హాస్టళ్ల తనిఖీ



హాస్టల్‌లో భోజనం పరిశీలిస్తున్న ఎంపీడీవో

సీతారామపురం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఏపీ మోడల్ స్కూల్ బాలికల హాస్టల్, బీసీ బాలుర హాస్టల్‌ని గురువారం ఎంపీడీవో భాస్కర్, ఈఓపీఆర్డీ భార్గవి తనిఖీ చేశారు. హాస్టళ్లలో మధ్యాహ్న భోజనం నాణ్యతను పరిశీలించారు. అనంతరం హాస్టల్ రికార్డులను పరిశీలించారు. మరుగుదొడ్లను పరిశీలించి వార్డెన్‌లకు సూచనలు చేశారు. అనంతరం సింగారెడ్డిపల్లి సచివాలయాన్ని తనిఖీ చేసి రికార్డులను పరిశీలించి, సమయపాలన పాటించాలని వారిని హెచ్చరించారు. అలాగే మండల స్థాయిలో జరుగుతున్న హౌస్ హోల్డ్ జియో ట్యాగింగ్ తదితర అంశాలపై సచివాలయ సిబ్బందికి సూచనలు చేశారు.

ఆరోగ్యవంతమైన నేలతోనే ఆహార ఉత్పత్తి సాధ్యం

ఉదయగిరి రూరల్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): మనిషి జీవనానికి మట్టి మూలాధారమని, ఆరోగ్యవంతైన నేల ఉన్నప్పుడే ప్రపంచ వ్యాప్తంగా జనాభాను పోషించడానికి కావల్సిన ఆహార ఉత్పత్తి సాధ్యమవుతుందని కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ జీ కృష్ణారెడ్డి పేర్కొన్నారు. గురువారం స్థానిక మేకపాటి గౌతంరెడ్డి ప్రభుత్వ వ్యవసాయ కళాశాలలో ప్రపంచ మృత్తిక దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన నేల సంరక్షణ-పర్యవేక్షణ అనే అంశంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. నేలపై పొర దెబ్బ తింటుందని, ఇది ఆహార భద్రతపై ప్రమాద ఘంటికలు మోగిస్తుందన్నారు. నేల మనకు స్వచ్ఛమైన నీటిని, జీవవైవిద్యాన్ని అందిస్తుందని, దానిని కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు సూర్య, గోపికృష్ణ, సునీత, రమేష్, దుర్గాప్రసాద్, కిషన్‌తేజ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ముళ్లపొదల్లోకి దూసుకెళ్లిన కారు

● తప్పిన ప్రమాదం



దుత్తలూరు(ఉదయగిరి రూరల్), డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నందిపాడు గ్రామ సమీపంలో ఓ కారు అదుపుతప్పి ముళ్లపొదల్లోకి దూసుకెళ్లిన సంఘటన గురువారం చోటుచేసుకొంది. వివరాల మేరకు.. కారులో ఉదయగిరి నుంచి ఆత్మకూరు వెళుతుండగా నందిపాడు గ్రామ సమీపానికి రాగానే ఎదురుగా వస్తున్న మోటార్‌బైక్‌ను తప్పించబోయి కారు రోడ్డు మార్జిన్ దిగి ముళ్లపొదల్లోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదు.

ఆటపాటలతో కూడిన విద్యాబోధన చేయాలి

ఉదయగిరి రూరల్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు ఆటపాటలతో కూడిన విద్యాబోధన చేయాలని ఎంఈవోలు మస్తాన్‌వలి, శ్రీనివాసులు పేర్కొన్నారు. గురువారం మండలంలోని దుర్గంపల్లి, స్థానిక ఎన్‌బీ ప్రాథమిక పాఠశాలను సందర్శించి విద్యార్థుల పఠనా సామర్థ్యాలను పరీక్షించారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని రుచి చూసి రిజిస్టర్లు పరిశీలించారు.

సమయపాలన పాటించాలి

దుత్తలూరు(ఉదయగిరి రూరల్), డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులకు ఆటపాటలతో విద్యాబోధన చేయాలని సూపర్‌వైజర్ షేక్ షాను సూచించారు. గురువారం మండలంలోని రెడ్డదిన్నె ఎస్సీ కాలనీలో అంగన్‌వాడీ కార్యకర్తలకు అవగాహన కల్పించారు. కార్యకర్తలు చార్టులను ప్రదర్శిస్తూ ఆటపాటలతో విద్యాబోధన చేయడంతోపాటు కేంద్రాల నిర్వాహణలో సమయపాలన పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు కె జయమ్మ భోగ్యం సరస్వతి, జీ ప్రమీల, కె ప్రభావతి, పీ అన్నపూర్ణ, డీ సుభాషిణి, కె విజయమ్మ, ఆయాలు తదితరులు పాల్గొన్నారు.

పరివర్తన సేవలకు ప్రశంసలు

కావలి టౌన్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన పరివర్తన స్వచ్ఛంద సేవాసంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు మొహమ్మద్ రహమాన్‌కు నెహ్రూ యువకేంద్రం సభ్యులు గురువారం ప్రశంసాపత్రంతో సత్కరించారు. నెల్లూరులోని నెహ్రూ యువకేంద్ర కార్యాలయంలో ప్రపంచ వాలీంటీర్ల దినోత్సవం పురస్కరించుకుని జరిగిన కార్యక్రమంలో కేంద్రం జిల్లా యువజన అధికారి మహేంద్ర రెడ్డి, యువజన సర్వీసుల శాఖ ఇన్‌చార్జ్ సీఈవో శ్రీనివాసరావు, సూపరింటిండెంట్ అహ్మద్ గయాజ్ పాల్గొన్నారు.

ఇంటి, కుళాయి పన్నుల డిజిటలైజేషన్

● రాధామాధవి, డివిజనల్ పంచాయతీ అధికారి



కావలి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): పంచాయతీలో కూడా ఇంటి, కొళాయి పన్నులను డిజిటలైజేషన్ చేస్తున్నట్లు కావలి డివిజన్ పంచాయతీ అధికారిణి రాధామాధవి తెలిపారు. ఇలా చేయడం వల్ల పంచా యతీ పన్నులు అన్నీ ఆన్‌లైన్‌లో నమోదు అవుతాయని ఎలాంటి అవక తవకలకు ఆస్కారం ఉండద న్నారు. జమా ఖర్చులు ఖచ్చితంగా ఉండేందుకు ఆస్కారం ఉంటుందన్నారు. ఇంటి పన్నులతో పాటు, 15వ ఆర్థిక సంఘం నిధులను పంచాయతీల అభివృద్ధికి వినియోగించుకునేందుకు అవకాశం ఉందన్నారు.

? ఇంటి పన్నుల డిజిటలైజేషన్ పనులు ఎంత వరకు చేపట్టారు.

! డివిజన్‌లోని 10 మండ లాల్లోని పంచాయతీల్లో 92 శాతం వరకు డిజిటలైజేషన్ పూర్తిచేశాం.

? ఇంటి పన్నుల డిజిటలైజేషన్‌లో కొందరు జాప్యం చేస్తున్నారనే విమర్శలు ఉన్నాయి.

! పన్నులు డిజిటలైజేషన్‌లో కొందరు జాప్యం చేయడంతో కావలి, వింజమూరు, దగదర్తి మండలాల ఈవోపీఆర్డీలకు మెమోలు ఇచ్చాం.

? మెమోలు ఇచ్చిన తర్వాత పనుల్లో వేగం పెరిగిందా.

! మెమోలు ఇవ్వగానే వారు పంచాయతీ కార్యదర్శులపై ఒత్తిడి తెచ్చి పనుల్లో వేగం పెంచారు.

న్యూస్ బాక్స్

డ్రైనేజీ పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న ఎంపీడీవో

గుడ్లూరు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : పొట్లూరులో జరుగుతున్న పైప్‌లైన్, డ్రైనేజి పనులను గురువారం ఎంపీడీఓ వెంకటేశ్వర రావు పరిశీలించారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ కార్యదర్శి సీహెచ్ లక్ష్మిలత, వెల్‌ఫేర్ అసిస్టెంట్ రాజేష్ సిబ్బంది పాల్గొన్నారు.

13 మద్యం సీసాల స్వాధీనం

బిట్రగుంట, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : అనధికారంగా మద్యం విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని కావలి ప్రొహిబిషన్, ఎక్సైజ్ సీఐ శ్రీనివాసులు గురువారం తెలిపారు. గురువారం ఆయన సుందరగిరివారి కండ్రికలో పెనుమాల మహేశ్వరి, భర్త మాల్యాద్రి ఇంట్లో 13మద్యం బాటిళ్లను గుర్తించామన్నారు. మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని మహిళను అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. దాడులో ఎక్సైజ్ ఎస్ఐ ఎం.దేవిక, స్టేషన్ సిబ్బంది ఉన్నారు.

క్రీడా పరికరాల వితరణ

ఏఎస్ పేట, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): కావలి ఎడవల్లి గ్రామంలోని జడ్పి హైస్కూల్‌కు పూర్వ విద్యార్థులు గురువారం క్రీడా పరికరాలను బహూకరించారు. పాఠశాల పూర్వ విద్యార్థులు మద్దూరి తిరుపతయ్య, గోశ్న వెంకటేశ్వర్లు, నాగినేని మస్తానయ్య, వివేకానంద, మన్నం మురళి తదితరులు విద్యార్థులకు క్రీడా పరికరాలను అందించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి హెచ్‌ఎం శ్రీనివాసులు, గ్రామ సర్పంచ్ ముప్పూరి ధనమ్మ, గ్రామస్థులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

సంగం, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని సిద్దీపురం, మర్రిపాడు 11 కేవి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో ఆర్‌డీఏస్ఎస్ నూతన లైన్ పనులు చేస్తున్నందున శుక్రవారం ఉదయం 9-15 నుంచి 2-15 గంటల వరకు విద్యాత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని డిస్కం ఏఈ మన్మధరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. దీనివల్ల రైతులకు త్రీఫేస్ వ్యవసాయం కరెంట్ ఉదయం 4-15 నుంచి 9-15 గంటల వరకు, మధ్యాహ్నం 2-15 నుంచి 6-15 గంటల వరకు ఇవ్వనున్నట్లు తెలిపారు. రైతులు, వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఇళ్లలోకి వర్షపు నీరు

వలేటివారిపాలెం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు పోకూరు చెరువు నిండి అలుగు పారి దిగువనున్న ఎస్సీ కాలనీలోని ఇళ్లలోకి వర్షం నీరు వచ్చి చేరుతుందని కాలనీ వాసులు వాపోతున్నారు. ఎగువ నుండి వరద ఉధృతి తగ్గేవరకూ ఇళ్ల ముందు నిలబడిన వరద నీరు పోయేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రిన్స్ యూత్ సేవలకు ప్రశంసలు

దగదర్తి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): దగదర్తి మండలం శ్రీరామాపురం పంచాయతీకి చెందిన ప్రిన్స్ యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు ఇండ్ల కృష్ణయ్య సేవలను గుర్తిస్తూ నెల్లూరు నెహ్రూ యువ కేంద్రం జిల్లా ఆఫీసర్ మహీంద్రరెడ్డి గురువారం ప్రశంసా పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కృష్ణయ్య మాట్లాడారు. ప్రపంచ వాలంటీర్ల దినోత్సవం సందర్భంగా చేపట్టిన ఈ కార్యక్రమం చేపట్టారు.

నెల్లూరు సిటీ

రూరల్, కోవూరు, సర్వేపల్లి

నాశిరకం.. నత్తనడక



దర్గామిట్టలోని టీటీడీ కల్యాణ మండపం

నగరంలోని తిరుమల తిరుపతి దేవస్థాన కల్యాణ మండపం ఆధునికీకరణ పనులు నాశి రకంగా, నత్తనడకన జరుగుతున్నాయి. కాంట్రాక్టరు తక్కువ మంది కార్మికు లతో పనులు చేయిస్తుండటంతో దాదాపు రెండేళ్లుగా ఈ పనులు సా...గుతున్నాయి. ఇప్పటి వరకు 50 శాతం కూడా పనులు పూర్తి కాలేదు. పైగా నాణ్యతపై ఆరోపణలు వినిపిస్తున్నాయి. పనుల తీరుమీద టీటీడీ ఇంజనీర్ల పర్యవేక్షణ కొరవడింది. దీంతో పేద, మధ్య తరగతి ప్రజల వివాహాలు, శుభ కార్యాలకు వీలు లేకుండా పోయింది.

- అధ్వానంగా టీటీడీ కల్యాణ మండప ఆధునికీకరణ
- రెండేళ్లుగా సా....గుతున్న పనులు
- మరమ్మతుల తీరుపై ఆరోపణలు
- ఇంజనీర్ల పర్యవేక్షణ కరువు
- గత ప్రభుత్వంలో నిలిచిపోయిన ధార్మిక కార్యక్రమాలు

పాలకుల స్పందన అవసరం

నెల్లూరు (సాంస్కృతికం), నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని దర్గామిట్ట ప్రాంతంలో 1976 మార్చి 14న టీటీడీ కల్యాణ మండప నిర్మాణానికి నాటి ముఖ్యమంత్రి జలగం వెంగళరావు పునాది రాయి వేశారు. నిర్మాణానంతరం 1979 డిసెంబరులో అప్పటి ముఖ్యమంత్రి డాక్టర్ మర్రి చెన్నారెడ్డి, రెవెన్యూ శాఖ మంత్రి నేదురుమల్లి జనార్దన్ రెడ్డి దీనిని ప్రారంభించారు. శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవేంకటేశ్వరస్వామి విగ్రహాలను ఏర్పాటు చేసి నిత్యపూజలు, శ్రవణ నక్షత్రం రోజున ప్రత్యేక పూజలు, తిరు మంజన సేవలు నిర్వహిస్తుండేవారు.



కల్యాణ మండపంలో నాశిరకంగా జరుగుతున్న పనులు

ఎంతోమంది పేద, మధ్య తరగతి ప్రజలు తక్కువ ఖర్చుతో ఇక్కడ వివాహాలు చేసుకునేవారు. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చాక ఇక్కడ ధార్మిక కార్యక్రమాలు, వివాహాలు జోరు గా జరిగాయి. ధర్మప్రచార పరిషత్ జిల్లా కమిటీల ద్వారా వేంకటేశ్వరస్వామి వైభవాన్ని జిల్లాలో ప్రచారం చేసేవారు. ప్రతినెల శ్రవణ నక్షత్రం రోజున శ్రీవారి కల్యాణం నిర్వహించేవారు. ఈ కల్యాణోత్సవానికి పెద్ద సంఖ్యలో భక్తులు హాజరయ్యేవారు. అలాగే భక్తుల కోరిక మేరకు ధర్మప్రచార పరిషత్ కమిటీ కృషితో తిరుమల శ్రీవారి లడ్డూలు, క్యాలెంటర్లు, డైరీల విక్రయాలు జరిగేవి. ఆ తర్వాత వివిధ ఆరోపణలతో లడ్డూల విక్రయం నిలిచిపోయింది.

గత ప్రభుత్వంలో నిర్వీర్యం

టీటీడీ కల్యాణ మండప ప్రాంగణంలో కొన్నేళ్ల క్రితం నిర్మించిన ఆధ్యాత్మిక లైబ్రరీ నిరుపయోగంగా మారింది. గత ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వంలో ధర్మప్రచార కమిటీల నియామకం, భజన మండళ్లకు ప్రోత్సాహకాలు, మన గుడి, సామూహిక కల్యాణాలు వంటి కార్యక్రమాలకు జిల్లావాసులు దూరమయ్యారు. అంతేకాదు, గతంలో టీటీడీ కల్యాణ మండపంలో శ్రీదేవి, భూదేవి, శ్రీనివాసుని ఉత్సవ మూర్తులు ఉండేవి. మారుమూల పల్లెలు, కాలనీల్లో వేంకటేశ్వర కల్యాణం జరిపించుకోవాలనుకునే వారికి ఆ ఉత్సవ మూర్తులను ఇచ్చేవారు. అయితే, ప్రస్తుత మరమ్మతుల కారణంగా ఆ విగ్రహాలను అందుబాటులో లేకుండా చేశారనే ఆరోపణలున్నాయి. ఈ కల్యాణ మండపం నిర్వహణను గతంలో మేనేజర్ స్థాయి అధికారి చూసేవారు. అయితే ప్రస్తుతం గుమాస్తాలే తప్ప మేనేజర్ లేరని తెలిసింది. నెల్లూరులోని ప్రజా ప్రతినిధులు, టీటీడీ పాలకులు ప్రత్యేక శ్రద్ధ చూపి కల్యాణ మండపానికి పూర్వ వైభవం తీసుకురావాలని శ్రీవారి భక్తులు కోరుతున్నారు.



భక్తులకు ఉపయోగపడని గ్రంథాలయం

చంద్రన్న బీమా కుటుంబానికి ధీమా

● కార్మిక శాఖ ఉపకమిషనర్ వెంకటేశ్వరరావు



నెల్లూరు(సాంస్కృతికం), డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న చంద్రన్న బీమా పథకంతో పేదల కుటుంబానికి భరోసా లభిస్తుందని కార్మిక శాఖ ఉప కమిషనర్ ఎం వెంకటేశ్వరరావు తెలిపారు. కార్మిక శాఖకు సంబంధించిన పలు పథకాల గురించి ఆయన ఆంధ్రజ్యోతితో ప్రత్యేకంగా సంభాషించారు.

ఇంటర్వ్యూ...

? 'చంద్రన్న బీమా' వివరాలు తెలపండి

! చంద్రన్న బీమా పథకం కుటుంబానికి ధీమానిస్తుంది. గత ఐదేళ్లలో ఈ పథకం అమలు కాలేదు. ప్రస్తుత ప్రభుత్వం ఈ పథకానికి సవరణలు చేసింది. గతంలో కుటుంబ పెద్ద అకాల మరణం చెందితే రూ.5లక్షలు పరిహారంగా ఇచ్చేవారు. ఆ మొత్తాన్ని ఇప్పుడు రూ.10లక్షలకు పెంచింది. కుటుంబ పెద్దేకాకుండా కుటుంబంలో ఎవరు మరణించినా రూ.10లక్షలు పరిహారంగా ఆ ఆకుటుంబానికి లభిస్తుంది. త్వరలో ఈ పథకం విధివిధానాలను ప్రభుత్వం ప్రకటిస్తుంది.

? భవన నిర్మాణ కార్మికులు సంక్షేమ పథకం ఎలా ఉంది.

! ఈ పథకాన్ని కూడా గత ప్రభుత్వంలో నిలిపివేశారు. అయినా మా శాఖ తరపున భవన నిర్మాణ కార్మికుల వివరాలు నమోదు చేస్తూనే ఉన్నాం. ఇప్పటికి 1.20 లక్షల మంది కార్మికులు నమోదు చేసుకున్నారు. 2019 నుంచి 2024 వరకు గత ప్రభుత్వం కార్మికులకు పరిహారం చెల్లించలేదు. ప్రస్తుత కూటమి ప్రభుత్వానికి ఈ విషయాన్ని కార్మిక శాఖ తెలియజేసింది. కేంద్ర ప్రభుత్వ పథకం ఈ-శ్రమ్ కింద జిల్లాలో 4లక్షల మంది కార్మికులు నమోదు చేసుకుని కార్డు పొందారు. వీరికి ప్రమాద బీమా కింద పరిహారం లభిస్తుంది.

? జిల్లాలో బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు.

! ఇది నిరంతర ప్రక్రియ. 14 ఏళ్లలోపు పిల్లల్ని పనిలో పెట్టుకున్న యజమానులకు జరిమానాతోపాటు బాలకార్మికులకు నష్టపరిహారం ఇప్పిస్తున్నాం. ప్రమాదకర పరిశ్రమల్లో బాలలు పనిచేస్తుంటే యజమానికి రూ.10 వేలకుపైగా జరిమానా విధిస్తున్నాం. 2020 జనవరి నుంచి ఇప్పటి వరకు 70 మంది బాలకార్మికులకు గుర్తించి యజమానులపై చర్యలు తీసుకున్నాం.

అధికారులూ.. స్పందించరూ..!

● దెబ్బతిన్న జొన్నవాడ వంతెన ● పొంచి ఉన్న ప్రమాదం

బుచ్చిరెడ్డిపాళెం, డిసెంబరు 5: జొన్నవాడ సమీపంలోని పెన్నానదిపైన వున్న (బాక్స్ టైపు..బేరింగ్ సిస్టం) బ్రిడ్జి పలు చోట్ల దెబ్బతిని ప్రమాదకరంగా ఉన్నాయి. బ్రిడ్జిలోని ఇనుప చువ్వలు విరిగిపోయి అరడుగు మేర లోతుతో గోతులు దర్శనమిస్తున్నాయి. నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగించే జొన్నవాడ బ్రిడ్జిపైన ఆర్అండ్‌బీ అధికారులు దృష్టి సారించి కూలకముందే మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. ఈ బ్రిడ్జి మీద కడప వైపు నుంచి బుచ్చి జొన్నవాడ మీదుగా నెల్లూరు, చెన్నై వరకు, నెల్లూరు నుంచి బుచ్చి మీదుగా కడపవైపు, రాజుపాళెం, దగదర్తి మార్గాల వైపు, నరసింహపురం, సౌత్‌మోపూరు మీదుగా పొదలకూరు వైపు వాహనాలు రాకపోకలు కొనసాగుతుంటాయి. జొన్నవాడ ఆలయానికి నిత్యం వందలాదిమంది, శుక్రవారాలు, ముఖ్యమైన రోజుల్లో వేలాదిగా భక్తులు మల్లికార్జునస్వామి, కామాక్షితాయివారి దర్శనార్థం తరలి వస్తుంటారు. అన్ని విధాల ఎంతో సౌలభ్యంగా వుండే ఈ బ్రిడ్జి 6ఏళ్లుగా ఇసుక రవాణా ధాటికి దెబ్బతినింది. పూర్తిగా దెబ్బతినేలోపు సంబంధిత అధికారులు తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.





జొన్నవాడ బ్రిడ్జిపైన దెబ్బతిని ప్రమాదకరంగా గోతులు, బయటపడిన కమ్ములు

పెనుబల్లిలో కోళ్ల వ్యర్థాల వాహనం



బురదలో ఇరుక్కుపోయిన కోళ్ల వ్యర్థాల లారీ

బుచ్చిరెడ్డిపాళెం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెనుబల్లి రైస్ మిల్లు ఎదురుగా వున్న లేఅవుట్ పరిసరాలలోని చేపలగుంతల వద్దకు పాండిచ్చేరి నుంచి వచ్చిన వేస్టేజ్ లారీ వెళుతుండగా ఓ చోట బురుదలో కూరుకుపోయింది. విషయం తెలుసుకున్న ఎస్ఐ సంతోష్‌రెడ్డి అక్కడికి చేరుకుని వాహనాన్ని పోలీస్ స్టేషన్‌కు తరలించాలని సిబ్బందికి తెలిపారు. ఇరుకున్న వాహనం ఎంతకీ బయటకు రాకపోవడంతో 14 బ్యారల్స్‌ను వేరే లారీలోకి మార్చారు. మరోలారీలోకి మార్చిన 14బ్యారల్స్‌కు 50వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ససేమిరా అనడంతో వాహనంపైన కూడా కేసు పెడతాం అన్నారు. దీంతో వేస్టేజ్ రవాణా దారుడు చేసేదిలేక రూ.30వేలు ఇచ్చాడు. ఆ నగదును తీసుకుని 14 బ్యారల్స్ లారీని వదిలిపెట్టారు. మిగతా 40 బ్యారల్స్ వున్న లారీని అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. వేస్టేజ్ వాహనాలను పట్టుకుని కేసులు పెట్టి చర్యలు తీసుకోవాల్సిన అధికారులే ఇలా అక్రమ దందాలకు పాల్పడుతున్నారు. ఉన్నతాధికారులు విచారించి చర్యలు చేపట్టాల్సి వుంది. ఈ విషయంపై రవాణాదారుడు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని తెలిపారు.

'వీఆర్‌సీలో బీఈడీ కోర్సుని పునఃప్రారంభించాలి'

నెల్లూరు(హరనాథపురం), డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి) : నగరంలోని వీఆర్ కళాశాలలో 2024-25 విద్యా సంవత్సరం నుంచి బీఈడీ కోర్సును పునఃప్రారంభించాలని ఎంపీ వేమి రెడ్డి ప్రభాకర్‌రెడ్డి కేంద్ర విద్యాశాఖామంత్రి ధర్మేంద్ర ప్రదాన్‌కు గురువారం ఢిల్లీలో విన్నవించారు. ఇందుకు కేంద్రమంత్రి సానుకూలంగా స్పందించారు. కాగా, రాష్ట్రంలో డిజీ యాత్ర సేవలు అమలులో ఉన్న విమానాశ్రయాల వివరాలు తెలపాలని పార్లమెంటులో వేమిరెడ్డి కోరారు. పౌరవిమానయాన శాఖ సహాయ మంత్రి మురళీధర్ సమాధానమి స్తూ విజయవాడ, విశాఖపట్నం విమానాశ్రయాల్లో ఆ సేవలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

విద్యార్థినులు నైపుణ్యాలను పెంచుకోవాలి : ఆర్ఐవో



విద్యార్థినులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న ఆర్ఐవో

నెల్లూరు(విద్య), డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థినులు విద్యతో పాటు ఇతర అంశాల్లో కూడా నైపుణ్యాలను పెంచుకోవాలని ఇంటర్ బోర్డు ఆర్ఐవో డాక్టర్ ఏ శ్రీనివాసులు సూచించారు. నగరంలోని డీకే ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో గురువారం జ్యూట్ బ్యాగుల శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ప్రపంచంలో సాంకేతికంగా విప్లవాత్మక మార్పులు వస్తున్న నేపథ్యంలో విద్యార్థినులు కంప్యూటర్ పరిజ్ఞానం పెంచుకోవాలని సూచించారు. కళాశాలలో కంప్యూ టర్ ఫండమెంటల్స్ ఎమ్మెస్ ఆఫీస్ విభాగాల్లో 45 రోజుల శిక్షణ కార్యక్రమాన్ని ప్రారం భించారు. భవిష్యత్తులో ఏ రంగంలోనైనా ఎదిగేలా విద్యార్థినులు సంసిద్ధం కావాలన్నారు. నేహా సంస్థ ఆధ్వర్యంలో శిక్షణ పూర్తి చేసుకున్న 27మందికి సర్టిఫికెట్లు, బ్యాగులు బహూ కరించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ కొండయ్య, విశ్రాంత అధ్యాపకురాలు కే కుసుమకుమారి, కల్యాణి, కృష్ణతులసి పాల్గొన్నారు.

బీఈడీ కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు

నెల్లూరు(విద్య), డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరులోని ప్రభుత్వ బీఈడీ కళాశాలలో వివిధ సబ్జెక్టులలో నిలిచిపోయిన సీట్లకు స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం వేణుగోపాల్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఎడ్‌సెట్-2024 లో అర్హత సాధించి, ఎక్కడా ప్రవేశం పొందని విద్యార్థులు నేరుగా కళాశాలలో ఈ నెల 9 నుంచి 13వతేదీ వరకు జరిగే స్పాట్ అడ్మిషన్ కౌన్సెలింగ్‌కు హాజరు కావచ్చని తెలిపారు. ఆసక్తి కలిగిన వారు రిజిస్ట్రేషన్ ఫీజు రూ.1000తోపాటు అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలన్నారు.

30 మందికి ప్రశంసా పత్రాలు



ప్రశంసా పత్రాలు అందుకున్న స్వచ్ఛంద సేవకులు

నెల్లూరు (వైద్యం), డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : అంతర్జాతీయ సేవా దినోత్సవం సందర్భంగా నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో గురువారం 30 మందికి ప్రశంసా పత్రాలు అందించారు. స్వచ్ఛంద సేవాసంస్థలు, యువజన సంఘాలు, మహిళా సంఘాల ప్రతినిధులకు నెహ్రూ యువ కేంద్రం కార్యాలయంలో ఈ ప్రశంసా పత్రాలను అందజేశారు. జిల్లా యువజన అధికారి మహేంద్రరెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరు సేవా దృక్పథాన్ని కలిగి ఉండాలని కోరారు. సమాజాభివృద్ధికి స్వచ్ఛంద సేవకులు అవసరమని చెప్పారు. ఈ కార్యక్రమంలో సెట్నల్ సీఈవో శ్రీనివాసులు, మహమ్మద్ గయాజ్ తదితరులు పాల్గొన్నారు.

భారీ మెజార్టీతో మరింత బాధ్యత

● 'గడప గడప'లో టీడీపీ నేత గిరిధర్‌రెడ్డి



స్థానికులకు అభివాదం చేస్తున్న గిరిధర్‌రెడ్డి

నెల్లూరు రూరల్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు రూరల్ నియోజకవర్గం నుంచి వరుసగా మూడవ సారి భారీ మెజార్టీతో తన సోదరుడు శ్రీధర్‌రెడ్డి ఎమ్మెల్యేగా గెలవడంతో తమ కుటుంబానికి బాధ్యత మరింత పెరిగిందని టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి అన్నారు. ఆయన చేపట్టిన గడప గడపకు కార్యక్రమంలో రెండవ రోజు గురువారం నగరంలోని 19వ డివిజన్ ముత్యాలపాళెంలో పర్యటించారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ మారంరెడ్డి జ్యోతిప్రియ, నాయకుడు మదన్‌కుమార్‌రెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు. కాగా, నూర్ బాషా ముస్లిం సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు షేక్ కాలేషా, సంఘం నాయకులు గురువారం రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డిని, గిరిధర్‌రెడ్డిని మార్యదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు.

దివ్యాంగ విద్యార్థులకు ప్రోత్సాహం అందించాలి

ముత్తుకూరు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగ విద్యార్థులకు ప్రోత్సాహం అందించాలని ఎంఈవో హేమ సుందర్ తెలిపారు. గురువారం మండల వనరుల కేంద్రంలోని భవిత పాఠశాలలో ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దివ్యాంగులలోని ఆసక్తి, సృజనాత్మకతను గుర్తించి ప్రోత్సహిస్తే వారు ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారన్నారు. ప్రభుత్వం దివ్యాంగ విద్యార్థుల కోసం కల్పిస్తున్న వసతులు, ప్రత్యేక అలవెన్స్‌ల గురించి వివరించారు. భవిత పాఠశాలలో ఉపాధ్యాయులతోపాటు తల్లిదండ్రులు వారి పట్ల శ్రద్ధ వహించాలన్నారు. అనంతరం దివ్యాంగ విద్యార్థులకు వీల్ చైర్‌లు, వినికిడి యంత్రాలు, వాకర్లు, ఎంఆర్ కిట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో భవిత పాఠశాల ఉపాధ్యాయులు కిరణ్‌కుమార్, హేమంత్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

8న 'అంతర్గత వీక్షణం'

నెల్లూరు (సాంస్కృతికం), డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : ఈనెల 8న పురమందిరంలో ఉదయం 10గంటలకు అంతరంగ వీక్షణం పరిచయ వేదిక జరుగుతుందని చిన్ని నారాయణరావు ఫౌండేషన్ అధ్యక్షుడు నారాయణరావు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సమాజం మీద సోషల్ మీడియా ప్రభావం అనే అంశంపై కవి సమ్మేళనం, కవితల పోటీ జరుగుతుందని తెలిపారు. ప్రముఖ కవి కొమ్మవరపు విల్సన్ రావుతో ముఖాముఖి జరుగుతుందన్నారు.

వావిలేటిపాడులో గిరిజనులకు అన్నదానం

నెల్లూరు రూరల్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు రూరల్లోని 12వ డివిజన్ విస్తా వావిలేటిపాడులో గురువారం గిరిజనులకు అన్నదానం చేశారు. స్థానికుడు సాయికుమార్ రెడ్డి తన పట్టినరోజు సందర్భంగా అల్తూరి ఆదిశేషయ్య ఫౌండేషన్ ద్వారా ఈ కార్యక్రమం నిర్వహించారు. జన్మదిన వేడుకలకు ఖర్చు చేసే సొమ్ముతో ఇలా పేదలకు అన్నదానం చేయడం వల్ల కొందరి ఆకలైన తీరుతుందని ఆయన పేర్కొన్నారు.

దేశాభివృద్ధికి పరిశోధనలు ఎంతో కీలకం

● వీఎస్‌యూ వీసీ ప్రొఫెసర్ విజయభాస్కర్‌రావు

వెంకటాచలం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : పరిశోధనలు దేశాభివృద్ధికి ఎంతో కీలకమని వీఎస్‌యూ వీసీ ప్రొఫెసర్ సారంగం విజయభాస్కర్‌రావు అన్నారు. స్థానిక వీఎస్‌యూలో గురువారం ఇంటర్నల్ క్వాలిటీ అస్యూరెన్స్ విభాగం ఆధ్వర్యంలో నిధుల అవకాశాలు, పరిశోధన ప్రతిపాదనల సూత్రీకరణ, పీహెచ్‌డీ థీసిస్ తయారీ అనే అంశంపై ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా వీసీ హాజరై మాట్లాడుతూ పరిశోధనల పట్ల విద్యార్థుల్లో ఆసక్తి పెంచేందుకు వీఎస్‌యూ వినూత్నమైన కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ కే సునీత, విశ్రాంత శాస్త్రవేత్త డాక్టర్ పీ సంజీవరావు, ప్రొఫెసర్ అందె ప్రసాద్, వర్సిటీ కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ డాక్టర్ హనుమారెడ్డి, డాక్టర్ సీహెచ్ వెంకటరాయులు, డాక్టర్ ఎం ఉస్సేనయ్య, ప్రొఫెసర్ సుజాఎస్ నాయర్ తదితరులున్నారు.



మాట్లాడుతున్న వీఎస్‌యూ వీసీ ప్రొఫెసర్ విజయభాస్కర్‌రావు

విద్యుత్ అదాలత్‌కు 9 వినతులు



ప్రత్యేక విద్యుత్ అదాలత్‌లో పాల్గొన్న అధికారులు

బుచ్చిరెడ్డిపాళెం, డిసెంబరు 5: స్థానిక ఎస్ఎస్ గ్రాండ్‌హాల్లో ఏపీ దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ కోవూరు వారి ఆధ్వర్యంలో గురువారం జరిగిన విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక, ప్రత్యేక విద్యుత్ అదాలత్‌కు 9వినతులు వచ్చా యి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ప్రత్యేక విద్యుత్ అదాలత్ చైర్‌పర్సన్ విశ్రాంత న్యాయమూర్తి వి.శ్రీనివాస ఆంజనేయమూర్తి, ఆర్థికసభ్యులు రామ్మోహన్ రావు, సాంకేతిక సభ్యులు ఎస్ఎల్ అంజనీకుమార్‌లు పాల్గొన్నారు. కోవూరు డివిజన్ పరిధిలోని మొత్తం 4 సబ్ డివిజన్లు, సంగం మండలం నుంచి కూడా వచ్చిన 9 సమస్యలను నమోదు చేసుకున్నారు. శాఖపరమైన పరిశీలనలు అనంతరం నెలరోజుల లోపు సమస్య పరిష్కరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో కోవూరు డివిజన్ ఈఈ. రమేష్ చౌదరి బుచ్చి సబ్‌డివిజన్ సీహెచ్ సతీష్, కోవూరు ఏడీఈ మధుసూదన్‌రెడ్డి, నార్త్‌రాజుపాళెం ఏడీఈ వెంకటేశ్వర్లు, ఇందుకూరుపేట ఏడీఈ సురేంద్ర, ఆయా సబ్ డివిజన్ల పరిధిలోని ఏఈఈలు, సిబ్బంది పాల్గొన్నారు.

నేల బాగుంటే మనం బాగుంటాం

● మృత్తిక దినోత్సవంలో అధికారులు



భూసార పరీక్ష ఫలితాల పత్రాన్ని రైతుకు అందచేస్తున్న ఏడీ కన్నయ్య

నెల్లూరు రూరల్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : నేలను రైతులు ఎంత ఆరోగ్యంగా ఉంచితే అంతగా ఆ నేల ఆశించిన ఫలితాలను అందిస్తుందని అంతర్జాతీయ మృత్తిక దినోత్సవంలో వ్యవసాయ శాఖ అధికారులు తెలిపారు. గురువారం మండలంలోని ఆమంచర్ల గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆత్మ పీడీ శివన్నారాయణ, భూసార పరీక్షల కేంద్రం ఏడీ కన్నయ్య, కేవీకే కోఆర్డినేటర్ లలిత జ్యోతి మాట్లాడారు. అధిక దిగుబడులు పొందాలన్న ఉద్దేశంతో పంటల సాగులో మితిమీరిన రసాయనాలు వాడుతు న్నారని ఆందోళన వ్యక్తం చేశారు. దీని వల్ల నేల సహజత్వాన్ని కోల్పోతుం దని, తద్వారా పంటలకు చీడ, పీడలను తట్టుకునే శక్తి నశిస్తుందని తెలిపా రు. అనంతరం రైతులకు భూసార పరీక్షల ఫలితాల పత్రాలను అందించారు.

నూతన పరిశ్రమల వివరాలు సేకరించండి : ఏడీసీ



సమావేశంలో ఏడీసీ నందన్, అధికారులు

నెల్లూరు(సిటీ), డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : నూతన పరిశ్రమల ఏర్పాటు, పారిశ్రామికవేత్తల ప్రయోజనాల కోసం రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన యాప్‌లలో వివరాలు నమోదు చేయాలని ఏడీసీ నందన్ సూచించారు. గురువారం కార్పొరేషన్ కార్యాలయంలో సచివాలయాల కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలను ఏర్పాటు చేసేందుకు ఆశావహుల వివరాలు యాప్‌లో నిక్షిప్తం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బాలకృష్ణ, శామ్యూల్ పాల్గొన్నారు.

పడకేసిన పారిశుధ్యం

● వ్యాధుల బారిన జనం

రాపూరు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : రాపూరు పట్టణంలో పారిశుధ్యం పడకేయడంతో వ్యాదులకు గురికావల్సి వస్తోందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. వీధుల్లో చెత్తచెదారం, సైడు కాలువల్లో పేరుకుపోయిన మురుగు తొలగించకపోవడంతో దోమలు పెరిగి వ్యాధులు ప్రబలుతున్నాయి, రోగులతో ఆసుపత్రులు నిండిపోతున్నాయి. పంచాయతీ అధికారులు పారిశుధ్యంపై దృష్టి పెట్టకపోవడంతో ఎక్కడి చెత్త అక్కడ పేరుకుపోయి దుర్గంధం వెదజల్లుతోందని ప్రజలు వాపోతున్నారు. ప్రభుత్వం తుఫాన్ హెచ్చరికలు చేసినప్పటికీ ముందస్తు చర్యలు చేపట్టకపోవడం వలన సైడు కాలువల ద్వారా వెళ్లవలసిన మురుగునీరు, వర్షపు నీరు నిల్వ ఉండడం వలన దోమలు పెరిగి వ్యాధులతో అల్లాడుతున్నామని, ఇప్పటికైనా అధికారులు స్పందించి పారిశుధ్యం మెరుగుపర్చాలని పట్టణవాసులు కోరుతున్నారు.



రోడ్డు పక్కన పేరుకున్న వ్యర్థాలు




మురుగు నీటితో నిండిన వీధి

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



తిరుపతి

జిల్లా వార్తలు

శుక్రవారం 6 డిసెంబరు 2024




నిప్పులు చెరుగుతూ నింగిలోకి..



ప్రయోగంలో రెండో దశ



మూడో దశ



నాలుగో దశలో రాకెట్ నుంచి విడిపోతున్న ఉపగ్రహం



ప్రయోగాన్ని వీక్షిస్తున్న ఇస్రో చైర్మన్ సోమనాథ్



విదేశీ శాస్త్రవేత్తలు

గఘన విజయం

- పీఎస్ఎల్వీ-సీ 59 ప్రయోగ విజయంతో షార్‌లో సంబరాలు
- వాణిజ్యపరమైన ప్రయోగాల్లో మరోసారి సత్తా చాటిన ఇస్రో

గురువారం సాయంత్రం 4.04 గంటలు. షార్‌లోని మొదటి ప్రయోగ వేదిక నుంచి నిప్పులు చెరుగుతూ పీఎస్ఎల్వీ-సీ 59 రాకెట్ నింగికెగిసింది. నాలుగో దశలో రాకెట్ నుంచి విడిపోయిన ప్రోబా-3 ఉపగ్రహం.. నిర్ణీత కక్ష్యలోకి చేరింది. దీనికి పట్టిన సమయం 18.40 నిమిషాలు. అప్పటి వరకు ఉత్కంఠగా చూస్తున్న శాస్త్రవేత్తల్లో ఆనందానికి అవధుల్లేకుండా పోయింది. షార్‌లో సంబరాలు అంబరాన్నంటాయి. సహచర శాస్త్రవేత్తలను ఇస్రో చైర్మన్ సోమనాథ్ అభినందించారు. ఈ విజయంతో వాణిజ్య పరమైన ప్రయోగాల్లో ఇస్రో మరోసారి సత్తా చాటింది. ఆదిత్య-ఎల్1 తరహాలోనే విదేశానికి చెందిన ప్రోబా-3 ఉపగ్రహన్ని సూర్యుడి బాహ్యవలయం కరోనాపై పరిశోధనలు చేసేందుకు విజయవంతంగా ఇస్రో ప్రయోగించింది. బుధవారం సాయంత్రం జరగాల్సిన ఈ ప్రయోగం ఉపగ్రహంలో సాంకేతిక లోపంతో చివరి గంటలో వాయిదా పడింది. దీనిని సరిచేసి గురువారం సాయంత్రం పీఎస్ఎల్వీ-సీ 59 వాహక నౌకను విజయవంతంగా ప్రయోగించారు.

- సూళ్లూరుపేట, ఆంధ్రజ్యోతి

ఆకాశమే హద్దుగా..

వాణిజ్యపరమైన ప్రయోగాల్లో ఆకాశమే హద్దుగా ఇస్రో దూసుకెళ్తోంది. శ్రీహరికోట రాకెట్ కేంద్రం భూమధ్యరేఖకు 13 డిగ్రీల అక్షాంశంలో ఉండటంతో గ్రావిటీ పవర్ తక్కువగా ఉంటోంది. అందుకే ఇక్కడ వాణజ్యపరమైన ప్రయోగాలకు తక్కువ ఖర్చవుతోంది. దీంతో చాలా దేశాలు న్యూస్పేస్ ఇండియాతో ఒప్పందాలు చేసుకుంటున్నాయి. రెండు టన్నులకు మించి బరువున్న ఉపగ్రహాలను ఫ్రాన్స్, రష్యా అంతరిక్ష కేంద్రాల నుంచి పంపుతున్నారు. అతిచిన్న విదేశీ ఉపగ్రహాలను పీఎస్ఎల్వీ ద్వారా పంపడం ద్వారా వాణిజ్యపర ప్రయోగాలకు ఇస్రో కేరాఫ్ అడ్రస్‌గా నిలుస్తోంది. ఇప్పటి దాకా 61 పీఎస్ఎల్వీ ప్రయోగాలు చేపట్టి అత్యధిక విదేశీ ఉపగ్రహాలు ప్రయోగించి ప్రపంచ దృష్టిని ఆకర్షించింది. మరో 8 దేశాల ఉపగ్రహాలను ప్రయోగించేందుకు ఎంవోయూ చేసుకొంది. దీంతో ఏడాదికి రూ.వెయ్యి కోట్లకు పైగా వాణిజ్యపరంగా ఆదయాన్ని ఆర్జిస్తోంది. తాజాగా యూరోపియన్ స్పేస్ ఏజెన్సీకి చెందిన ప్రోబా-3 ఉపగ్రహాన్ని పీఎస్ఎల్వీ-సీ 59 ద్వారా ప్రయోగించి మరో విజయాన్ని సొంతం చేసుకొంది.

పుత్తూరు-అత్తిపట్టు హార్బర్‌కు కొత్త రైల్వేలైన్

- 189 హెక్టార్ల భూసేకరణ పనులకు అనుమతి

పుత్తూరు, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): పుత్తూరు నుంచి తమిళనాడులోని అత్తిపట్టుకు కొత్త రైల్వే మార్గం కోసం భూసేకరణకు రైల్వేశాఖ అనుమతిచ్చింది. 88 కిలోమీటర్ల దూరానికి 189 హెక్టార్లను సేకరించాల్సి వుంది. 2024-25 ఆర్థిక సంవత్సరానికి చెన్నై రైల్వేజోన్‌లో పుత్తూరు-అత్తిపట్టుతో పాటు 185 కిలోమీటర్ల దిండివనం-తిరువణ్ణామలై, 36కిలోమీటర్ల మోరంపూర్-ధర్మపురి, 41 కిలోమీటర్ల మన్నార్‌గుడి-పట్టుకోట్టై, 52 కిలోమీటర్ల తంజావూరు- పట్టుకోట్టై లైన్ల భూసేకరణ పనులకు రైల్వే శాఖ అనుమతిచ్చింది. చెన్నై హార్బర్‌లో ఎగుమతులు, దిగుమతుల ఒత్తిడి ఎక్కువ కావడంతో ప్రత్యామ్నాయంగా అత్తిపట్టు హార్బర్‌ను కేంద్రం ఎంపిక చేసింది. బళ్లారి నుంచి ఎగుమతయ్యే ఇనుప ఖనిజాన్ని భవిష్యత్తులో అత్తిపట్టు హార్బర్‌కు మళ్లిస్తారు. ఈ కొత్త రైల్వే మార్గం నారాయణవనం, పిచ్చాటూరు, నాగలాపురం మండలాల మీదుగా అట్టిపట్టుకు చేరుతుంది. ఇప్పటివరకూ ఈ ప్రాంత ప్రజలు పుత్తూరు స్టేషనుకు చేరుకుని రైలు ఎక్కుతున్నారు.

శ్రీకాళహస్తీశ్వరాలయంలో పోటు ఇన్‌చార్జి సస్పెన్షన్

శ్రీకాళహస్తి, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలోని ప్రసాదం తయారీ పోటులో గోల్‌మాల్ జరిగినట్లు ఈవో బాపిరెడ్డి గుర్తించారు. ఇన్‌చార్జిగా పనిచేసే జూనియర్ అసిస్టెంట్ సురేష్‌రెడ్డిని సస్పెండు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. పోటులో జిలేబీ, లడ్డూ, వడతో పాటు పులిహోర ప్రసాదాలను తయారు చేసి కౌంటర్లకు తరలిస్తుంటారు. పులిహోర అన్నంతో తయారు చేసే పదార్థం కావడంతో బియ్యం ఉడికిన తరువాత కొంత బరువు పెరుగుతుంది. స్టోర్ నుంచి కొలత ప్రకారం స్వీకరించిన పదార్థాల ప్రకారం అదే లెక్కతో ప్రసాదాల కౌంటర్‌కు తరలించాలి. గురువారం ఈవో బాపిరెడ్డి పోటును తనిఖీ చేశారు. అక్కడ నిల్వ ఉన్న సరుకు, రిజిస్టర్‌లో నమోదుకు తేడాలను గుర్తించారు. పోటు నుంచి కౌంటర్‌కు తరలించిన పులిహోర మోతాదులో పెద్ద ఎత్తున వ్యత్యాసం ఉన్నట్లు ఆయన ఆధారాలతో పట్టుకున్నారు. పోటు ఇన్‌చార్జిగా పనిచేస్తున్న జూనియర్ అసిస్టెంట్ సురేష్‌రెడ్డిపై సస్పెన్షన్ వేటు వేశారు. కాగా, ప్రసాదాల తయారీనుంచి కౌంటర్లలో విక్రయాల వరకు చాలామంది కుమ్మక్కు అయితేనే ఈ అక్రమం జరిగే అవకాశం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు. దీని వెనుక అసలు పాత్రధారులు, సూత్రధారులు ఎవరన్నది లోతుగా దర్యాప్తు చేసి నిగ్గు తేల్చాల్సి ఉంది.

తిరుపతి నుంచి సింగపూర్‌కు..

- నేడు అంతర్జాతీయ విమాన సర్వీసు ట్రయల్ రన్

రేణిగుంట, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): తిరుపతి విమానాశ్రయం నుంచి అంతర్జాతీయ విమాన సర్వీసులను ప్రారంభించడానికి సన్నాహాలు చేపట్టారు. శుక్రవారం ఉదయం 5గంటలకు తిరుపతి నుంచి సింగపూర్‌కు మొదటి అంతర్జాతీయ విమాన సర్వీసు ట్రయల్ రన్ నిర్వహిస్తున్నట్టు విమానాశ్రయ డైరెక్టర్ శ్రీనివాసరావు చెప్పారు. లక్స్ ఏవియేషన్ సాన్ మారినో జీఎల్ఈఎక్స్ విమానం ఒక ప్రయాణికుడు, నలుగురు సిబ్బందితో ఉదయం బయలు దేరుతుందన్నారు.

పోలీసులకు చిక్కిన గంజాయి బ్యాచ్

- 17 మంది అంతర్రాష్ట్ర ముఠా అరెస్టు
- 32 కిలోలు స్వాధీనం



శ్రీకాళహస్తి పోలీసులు పట్టుకున్న గంజాయిని చూపుతున్న ఎస్పీ

తిరుపతి(నేరవిభాగం), డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): తమిళనాడు, కర్నాటక, కేరళ రాష్ట్రాలకు గంజాయి సరఫరా చేస్తున్న ముఠాను శ్రీకాళహస్తి పోలీసులు పట్టుకున్నారు. వారి నుంచి 32 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. నాలుగు సెల్ ఫోన్లు సీజ్ చేశారు. ఈ వివరాలను గురువారం తిరుపతిలో ఎస్పీ సుబ్బరాయుడు మీడియాకు వెల్లడించారు. ఆయన తెలిపిన ప్రకారం.. వెంకటగిరికి చెందిన సాయిసందీప్, వెల్లంపాలెంకు చెందిన పి.జశ్వంత్, శ్రీకాళహస్తికి చెందిన గాది గణేష్, షేక్ నసీమ్, ఎలిరి హేమంత్, కోటంబెటి రాజా, పెనమల రాజు, బత్తిని కుమార్‌రాజా, ఆవల ఆకాష్, కారణి సాయికుమార్, కుప్పం శశి, శివ, చెరుకుట్టి వంశీ, ముత్తరాశిపాలెంకు చెందిన ఇసకమట్ల మనోజ్‌కుమార్, జెట్టిపాళేనికి చెందిన కుంచాల నాగరాజు, పాడేరు జిల్లా అరకువాసి సొంగుల అనంతరాము, తుమ్మలగుంటలో ఉంటున్న తేజ ముఠాగా ఏర్పడ్డారు. సులభంగా డబ్బు సంపాదించాలని గంజాయి రవాణాకు ప్రయత్నించారు. వీరికి అరకుకు చెందిన అనంతరాముతో పరిచయాలు ఏర్పడ్డాయి. కొన్నేళ్లుగా అరకు, పాడేరు నుంచి రైళ్లు, ట్రాన్స్‌పోర్టు వాహనాల ద్వారా జిల్లాకు గంజాయి తెచ్చేవారు. శ్రీకాళహస్తి కేంద్రంగా తమిళనాడు, కేరళ, కర్ణాటక ప్రాంతాలకు తరలించి.. అక్కడ పొడి చేసి చిన్న, చిన్న ప్యాకెట్లుగా విక్రయిస్తున్నారు. కొన్నేళ్లుగా వీరి కదలికలపై శ్రీకాళహస్తి పోలీసులు నిఘా పెట్టారు. శ్రీకాళహస్తి, తిరుపతి అడ్డాగా పలు రాష్ట్రాలకు గంజాయి అక్రమంగా తరలిస్తున్న 17 మందిని గుర్తించారు. వీరిని పట్టుకునేందుకు జిల్లా అదనపు ఎస్పీ రవిమనోహరాచ్చారి నేతృత్వంలో శ్రీకాళహస్తి డీఎస్పీ నరసింహమూర్తి, సీఐలు గోపి, వెంకటేష్, ఎం.రవినాయక్, తిమ్మయ్య, ఎస్ఐ సుధాకరరెడ్డి, సిబ్బంది కలసి వలపన్నారు. శ్రీకాళహస్తిలోని బృందమ్మకాలనీ, పనసకోనమండపం, తొట్టంబేడు పరిధిలోని స్వర్ణముఖి బ్రిడ్జి కింద బ్యాచ్‌లుగా ఉన్న 17 మందిని పట్టుకున్నారు. వీరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్పీ చెప్పారు. ఈ కేసులో ప్రతిభ చూపిన పోలీసు అధికారులు, సిబ్బందిని ఎస్పీ అభినందించారు.





అశ్వవాహనంపై అఖిలాండనాయకి

గురువారం రాత్రి ఏడు గంటలకు అశ్వవాహనంపై మహారాణి అలంకారంలో అమ్మవారు భక్తులను కటాక్షించారు. గజతురగ, వృషభాలు ముందు నడవగా, మంగళవాయిద్యాలు, భజన బృందాలు, భక్తుల కోలాటాలు, జీయ్యర్ స్వాముల పరివారం ప్రబంధ పారాయణం నడుమ అశ్వవాహనంపై అమ్మవారు మాడవీధుల్లో ఊరేగారు. హరి పట్టపురాణి అలమేలు మంగమ్మను అశ్వవాహనంపై దర్శించుకుంటే కలిదోషాలు తొలగుతాయనేది భక్తుల నమ్మకం. దీంతో ఎక్కువ సంఖ్యలో భక్తులు హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. - తిరుచానూరు, ఆంధ్రజ్యోతి

శ్రీకాళహస్తీశ్వరస్వామివారి దేవస్థానము

శ్రీకాళహస్తి :: తిరుపతి జిల్లా - 517 644

బహిరంగ వేలము ప్రకటన

ఆర్.సి.నెం. Rev 59-సి1/4/2024, **తేది: 04-12-2024**

శ్రీకాళహస్తీశ్వర స్వామి వారి దేవస్థానం హక్కు భుక్తములలో గల ఈ క్రింది తెల్పిన గ్రామాలలో ఉన్న దేవస్థానం భూములను (3) సంవత్సరముల కాలమునకు సాగు చేసుకొనుటకు బహిరంగ వేలము నిర్వహించుట. ఆసక్తి గల రైతులు డిపాజిట్ చెల్లించి బహిరంగ వేలములో పాల్గొనవచ్చును.

తిరుపతి జిల్లా

వ. సం	గ్రామం పేరు	విస్తీర్ణం	ధరావత్తు డిపాజిట్	తేది & సమయము
1.	బోడిరెడ్డి కండ్రిగ (మహాదేవపురం)	ఎ.1.05సెం	రూ.2000/-	తేది:17-12-2024 ఉ: 10.00గం.
2.	సుబ్బనాయుడు కండ్రిగ గ్రామం (శ్రీకాళహస్తి మం)	ఎ.7.23సెం	రూ.10000/-	తేది:16-12-2024 ఉ: 10.00గం.
3.	చొక్కసంపాలెం	ఎ.1.02సెం	రూ.2000/-	తేది:16-12-2024 ఉ: 11.00 గం.
6.	చుక్కలనిడిగల్లు	ఎ.8.55సెం	రూ.10000/-	తేది:16-12-2024 ఉ: 12.30గం.
7	పాతగుంట	ఎ.3.72సెం	రూ. 5000/-	తేది:17-12-2024 మ: 3.00గం.
8	కాపుగున్నేరి గ్రామం	ఎ.2.29సెం ఎ.0.96సెం ఎ.0.49సెం	రూ. 5000/- రూ. 2000/- రూ. 1000/-	తేది:16-12-2024 మ: 3.00గం.

ఇతర వివరముల కొరకై సెల్ నెం. **70130 14433 / 99126 52553 / 98664 56141 / 99660 13456** ఫోన్ నెంబర్లను సంప్రదించగలరు.

సం/- కార్యనిర్వహణాధికారి

నేడే పంచమి తీర్థం

- మధ్యాహ్నం 12.15 గంటలకు చక్రస్నానం
- తిరుచానూరుకు చేరుకున్న భక్తజనం

తిరుచానూరు, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): తిరుచానూరు పద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాల్లో చివరి రోజైన శుక్రవారం పంచమితీర్థం జరగనుంది. మధ్యాహ్నం 12.15 గంటలకు అభిజిత్ లగ్నంలో చక్రత్తాళ్వార్‌కు చక్రస్నానం నిర్వహించనున్నారు. ఆ తర్వాత భక్తులు పుష్కరిణిలో స్నానాలు ఆచరించనున్నారు. దీనికోసం గురువారం రాత్రికే తమిళనాడు, వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తిరుచానూరుకు చేరుకున్నారు. వీరందరినీ జడ్పీ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన హోల్డింగ్ పాయింట్‌కు తరలించారు. రాత్రి పదిన్నర గంటలకే ఈ హోల్డింగ్ పాయింట్ నిండిపోయింది. కొందరు క్యూలైన్లలో పడుకున్నారు. ఇలా ఏర్పాటు చేసిన మూడు హోల్డింగ్ పాయింట్లనుంచి భక్తులను శుక్రవారం ఉదయం 9 గంటలపైన పుష్కరిణిలోకి అనుమతించనున్నారు. పుష్కరిణి నుంచి వెలుపలికి వచ్చిన భక్తులు అమ్మవారి దర్శనానికి వెళ్లడానికి ప్రత్యేక క్యూలైన్‌లు ఏర్పాటు చేశారు. ఒక గేటు వద్ద డీఎస్పీ స్థాయి అధికారి ఇన్‌చార్జిగా ఉంటూ తొక్కిసలాట లేకుండా చూసే బాధ్యతను పోలీసు యంత్రాంగం తీసుకుంది. చక్రస్నానం జరిగే ప్రాంతంలో భక్తులు దూసుకురాకుండా ఉండేందుకు గ్రిల్స్ ఏర్పాటు చేశారు. వీవీఐపీలకు, వీఐపీలకు, టీటీడీ ఉద్యోగులకు, మీడియాకు ప్రత్యేక గ్యాలరీలు ఏర్పాటు చేశారు. పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. విలువైన ఆభరణాలు ధరించి రావద్దని భక్తులకు సూచించారు. ఉదయం అమ్మవారికి సారె ఊరేగింపు సందర్భంగా గజరాజులు బెదరకుండా సింధు జంక్షన్ నుంచి ఆలయ ముఖద్వారం వరకు రోడ్డు డివైడర్‌కు ఇనుప కంచె ఏర్పాటు చేశారు. భక్తులను ఒకే మార్గంలోనే అనుమతించనున్నారు. మరోవైపు గురువారం రాత్రి నుంచి శుక్రవారం సాయంత్రం 4గంటల వరకు తిరుచానూరులోకి వాహనాలను నిషేధించారు.

హోల్డింగ్ పాయింట్లకు ఇలా..

పుత్తూరు వైపు నుంచి వచ్చే వారికి తిరుచానూరు గోశాల వద్ద, జడ్పీ ఉన్నత పాఠశాల.. తిరుపతి, చంద్రగిరి, రేణిగుంట వైపు నుంచి వచ్చే భక్తులు నవజీవన్ ఆస్పత్రి వద్ద హోల్డింగ్ పాయింట్లకు చేరుకోవాలి.

అమ్మవారి జన్మదినమే..

కార్తీకమాస శుక్లపక్ష పంచమి ఉత్తరాషాడ నక్షత్ర యుక్త అభిజిత్ లగ్నం శుక్రవారం రోజున పద్మావతిగా స్వర్ణకమలం మధ్యలో అమ్మవారు ఆవిర్భవించారని పురాణోక్తి. ఆ జన్మదినాన్ని పంచమి తీర్థంగా వ్యవహరిస్తారు. బ్రహ్మోత్సవాల్లో పంచమితీర్థం నిర్వహిస్తారు. ఈ ఉత్సవానికి వివిధ రాష్ట్రాల నుంచి భక్తులు తరలి వచ్చి పద్మసరోవరంలో స్నానాలు ఆచరిస్తారు.





చక్రస్నానం కోసం గురువారం రాత్రే తిరుచానూరుకు చేరుకుని హోల్డింగ్ పాయింట్‌లో సేదతీరుతున్న భక్తులు - పుష్కరిణిలోకి వెళ్లే క్యూలైన్లలో నిద్రిస్తున్న భక్తులు

120 సీసీ కెమెరాలు, డ్రోన్లతో నిఘా

తిరుపతి(నేరవిభాగం), డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): తిరుచానూరులో శుక్రవారం జరిగే పంచమి తీర్థానికి 120 సీసీ కెమెరాలు, ఆరు డ్రోన్లతో పోలీసులు నిఘా ఉంచారు. పుష్కరిణిలోని ప్రతి గేటు వద్ద సీసీ కెమెరా అమర్చారు. ఆకతాయిలు అల్లరి చేష్టలకు పాల్పడితే వెంటనే అదుపులోకి తీసుకుంటారు. చైన్ స్నాచింగ్‌లు, జేబు దొంగతనాలకు తావు లేకుండా చూస్తున్నారు. 22 గేట్ల ద్వారా పుష్కరిణిలోకి... వెలుపలకు భక్తులను అనుమతిస్తారు. ఒకేసారి 1500 మంది పుష్కరిణిలో స్నానం ఆచరించేలా చర్యలు తీసుకున్నారు. వైద్య శిబిరాలతో పాటు 108, టీటీడీ అంబులెన్సులను అందుబాటులో ఉంచారు. పోలీసు శాఖ ఆధ్వర్యంలో దాదాపు 1400 మంది, టీటీడీ సెక్యూరిటీ మరో 600 మందితో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. టీటీడీ సీవీఎస్వో శ్రీధర్, జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు అమ్మవారి ఆలయం చుట్టూ తనిఖీ చేశారు. బందోబస్తు పర్యవేక్షించారు.

పార్కింగ్ ప్రదేశాలు ఇవే

మ్యాంగో గార్డెన్, అర్బన్ హట్, పూడి క్రాస్, నారాయణాద్రి క్రాస్ రోడ్డు వద్ద పార్కింగ్ ప్రదేశాలు ఏర్పాటు చేసి, సూచిక బోర్డులు పెట్టారు. పోలీసులను నియమించారు. ఆయా ప్రాంతాల్లో వచ్చే వాహనాలను ఈ పార్కింగ్ ప్రదేశాల్లో ఉంచి భక్తులు నడుచుకుంటూ హోల్డింగ్ పాయింట్లకు చేరుకోవాలి.

హెచ్చరిక

ఇందు మూలముగా యావత్తు ప్రజానికానికి తెలియజేయడం ఏమనగా, మా కక్షిదారుడు అయిన ఎస్. **ఖాదర్ భాషా, 10వ అదనపు జిల్లా జడ్జి కోర్టుయందు O.S. 77/2024** అను దావా ఇ.మునిరత్నం నాయుడు వగైరాల పయిన రూ.**5,21,89,182/-** (అక్షరాలా ఐదు **కోట్ల ఇరవై ఒక్క లక్షల ఎనభై తొమ్మిది వేల నూట ఎనభై రెండు రూపాయలు మాత్రమే) తిరిగి పొందుటకు** గాను దావా **వేసియున్నారు.** సదరు దావా యందు **I.A.No. 257/2024** అను పిటీషన్ వేసి, క్రింద కనపరచిన షెడ్యూల్ దాఖలా ఆస్థి ఎ. **1.03½** సెంట్లు భూమిని జప్తు చేయమని కోరడం అయినది. కావున సదరు ఇ. **మునిరత్నం నాయుడు** వగైరాలతో క్రింద కనబరచిన షెడ్యూల్ ఆస్థి నిమిత్తం ఎటువంటి లావాదేవీలు జరిపిన చెల్లనేరవు మరియు అట్టి వారిపై మా కక్షిదారుడు తీసుకొను సివిల్, క్రిమినల్ చర్యలకు బాధ్యులు అవుదురు.

షెడ్యూలు : తిరుపతి జిల్లా, తిరుపతి, చంద్రగిరి ఉపజిల్లా, తిరుపతి రూరల్ మండలం, చెర్లోపల్లి గ్రామ పంచాయతి మరియు గ్రామ లెక్కదాఖలా 54, **S.No.224**, ప్రస్తుత ఆన్‌లైన్ **S.No.224/B** మొత్తం విస్తీర్ణం **ఎ.1.03½** సెంట్లులో వేయబడిన ప్లాట్ నెం.లు 1 నుండి 12 వరకు ఇందుకు హద్దులు. **తూర్పు :** రోడ్డు, **పడమర :** ఎ. చెంచయ్య వగైరాలు అమ్మిన భూమి, **దక్షిణం :** ఇ. ఆంజనేయుల నాయుడు వగైరాల భూమి, **ఉత్తరం :** ఇ. సర్వేనెంబర్‌లో మిగిలిన భూమి.

ప్లాటు కొలతలు : ప్లాట్ నెం. 1) 34.33 , 2) 35.41, 3) 36.28, 4) 30, 5) 46.77, 6) 48.54, 7) 50.20, 8) 51.66, 9) 52.70, 10) 53.125, 11) 54.58, 12) 93.75 మొత్తం విస్తీర్ణం : 587.345 అంకణాలు.

షెడ్యూలు బీ : అయిటెమ్ నెం.1 : తిరుపతి జిల్లా, తిరుపతి రూరల్ మండలం, పుదిపట్ల గ్రామలెక్కదాఖలా, చంద్రగిరి **SRO**, ఎ. 0.43 సెంట్లు, **S.No.** 171/1, **అయిటెమ్ నెం.2 :** తిరుపతి జిల్లా, తిరుపతి రూరల్ మండలం, పుదిపట్ల గ్రామ లెక్కదాఖల, చంద్రగిరి **SRO**, ఎ. 1.45 సెంట్లు, **S.No.** 517/బి, **అయిటెమ్ నెం.3 :** తిరుపతి జిల్లా, తిరుపతి రూరల్ మండలం, పుదిపట్ల గ్రామ లెక్కదాఖల, చంద్రగిరి **SRO**, ఎ. 0.52 సెంటు, **S.No.** 543/2.

ఇట్లు : **జి.శ్రీనివాసులు గౌడ్, జి.జ్యోత్స్న,**

న్యాయవాదులు, తిరుపతి. సెల్ : **99669 88228**

రథమెక్కి... భక్తులను కటాక్షించి..!





● వైభవంగా అమ్మవారి రథోత్సవం









బ్రహ్మోత్సవాల్లో నేడు

- ఉదయం 7 గంటలకు పల్లకీ ఉత్సవం
- 10 గంటలకు పంచమి తీర్థం మండపంలో చక్రత్తాళ్వారు, ఉత్సవమూర్తికి స్నపన తిరుమంజనం
- మధ్యాహ్నం 12.15 గంటలకు పద్మసరోవరంలో చక్రస్నానం
- రాత్రి 7.30 గంటలకు బంగారు తిరుచ్చి ఉత్సవం
- 9.30 గంటలకు ధ్వజావరోహణంతో బ్రహ్మోత్సవాలు పరిసమాప్తం

తిరుచానూరు పద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాల్లో ఎనిమిదో రోజైన గురువారం ఉదయం రథోత్సవం వైభవంగా జరిగింది. ముత్యపు కవచపు అలంకారంలో అమ్మవారు సర్వస్వతంత్ర వీరలక్ష్మిగా రథంపై కొలువుదీరారు. ఉదయం 8 గంటలకు ధనుర్లగ్నంలో ప్రారంభమైన రథోత్సవం 10.15 గంటల వరకు మాడవీధుల్లో సాగింది. భక్తులు గోవిందా... గోవిందా అంటూ రథాన్ని లాగారు. రథంపై మిరియాలు, ఉప్పు చల్లి భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. మధ్యాహ్నం 12 గంటలకు రథం మండపంలో అమ్మవారికి స్నపన తిరుమంజనం, సాయంత్రం ఆస్థాన మండపంలో ఊంజల్‌సేవ జరిగాయి. రాత్రి ఏడు గంటలకు అశ్వవాహనంపై కల్కిరూపంలో అమ్మవారు భక్తులను కటాక్షించారు. ఆయా కార్యక్రమాల్లో టీటీడీ ఈవో శ్యామలరావు, జేఈవో వీరబ్రహ్మం, ఆలయ డిప్యూటీ ఈవో గోవిందరాజన్, ఏఈవో దేవరాజులు, ఏవీఎస్వో సతీష్‌కుమార్, అర్చకులు శ్రీనివాసాచార్యులు, బాబుస్వామి, మణికంఠస్వామి, సూపరింటెండెంట్లు రమేష్, శ్రీవాణి, సుందరరత్నం, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, సుబ్బరాయుడు, సుభాస్కర్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు. ఇక, గురువారం రాత్రితో వాహనసేవలు ముగిశాయి. ఈ ఎనిమిది రోజులు.. 16 వాహనాలపై అమ్మవారు వివిధ రూపాల్లో ఊరేగారు.

- తిరుచానూరు, ఆంధ్రజ్యోతి



జిల్లాలో మోస్తరు వర్షం

తిరుపతి(కలెక్టరేట్), డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో బుధవారం రాత్రి నుంచి గురువారం ఉదయం వరకు మోస్తరు వర్షం కురిసింది. నాయుడుపేట 75.6మి.మీ, దొరవారిసత్రం72.2, శ్రీకాళహస్తి 54.2, తొట్టంబేడు 49, డక్కిలి 47.8, తిరుపతి అర్బన్ 40.8, వెంకటగిరి 39.6, వడమాలపేట 39, బాలాయపల్లి 38.6, సత్యవేడు 36.4, వరదయ్యపాలెం 34.8, ఏర్పేడు, తిరుపతి రూరల్ 30.8, బుచ్చినాయుడు కండ్రిగ 30.4, పెళ్లకూరు 28.8మి.మీ చొప్పున వర్షపాతం నమోదైంది.

శ్రీవారి దర్శనానికి 16 గంటలు

తిరుమల, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 16 గంటల సమయం పడుతోంది. గురువారం సాయంత్రం 5 గంటల వరకు.. వైకుంఠం క్యూకాంప్లెక్స్-2లోని 29 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్-1లోని 5 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు. మంగళవారం భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ బుధవారం లెక్కించింది. రూ.3.27 కోట్లు ఆదాయం లభించినట్టు గురువారం ప్రకటించింది. బుధవారం 65,265 మంది శ్రీవారిని దర్శించుకోగా, 21,384 మంది తలనీలాలు సమర్పించారు

భూఆక్రమణలకు పాల్పడితే కఠిన చర్యలు



ప్రజాప్రతినిధులతో కలిసి మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి(కలెక్టరేట్), డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): భూ ఆక్రమణలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ వెంకటేశ్వర్ హెచ్చరించారు. గురువారం జిల్లా కలెక్టరేట్లో ప్రజాప్రతినిధులు, రైతు సంఘాల ప్రతినిధులు, ఎన్జీవో తదితరులకు రెవెన్యూ సదస్సులపై అవగాహన కల్పించారు. ఈ సమావేశంలో జేసీ శుభం బన్సల్, వెంకటగిరి, సూళ్లూరుపేట, సత్యవేడు ఎమ్మెల్యేలు కురుగొండ్ల రామకృష్ణ, నెలవల విజయశ్రీ, కోనేటి ఆదిమూలం, యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహయాదవ్ తదితరులు పాల్గొన్నారు. అన్ని రెవెన్యూ గ్రామాల్లో శుక్రవారం నుంచి జనవరి 8వ తేదీ వరకు రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ చెప్పారు. ప్రతి రెవెన్యూ గ్రామాన్ని అధికారుల బృందం సందర్శించి ఫ్రీహోల్డ్, సెక్షన్ 22ఏ తదితర రెవెన్యూ సమస్యలను పరిష్కరించే దిశగా చర్యలు చేపడతారన్నారు. రెవెన్యూశాఖలో పలుఖాళీల భర్తీ, శ్మశాన వాటికలకు స్థలాలు, దారివంటి సమస్యలు, 22ఏ కేసుల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యేలు కోరారు. ఈ సమావేశంలో డీఆర్వో నరసింహులు, ప్రజాప్రతినిధులు, రైతు సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోండి

రెవెన్యూ గ్రామాల్లో నిర్వహించే సదస్సులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ వెంకటేశ్వర్ కోరారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. గ్రామాల్లో రెవెన్యూ, భూ సమస్యలు, కుల, ఆదాయ ధ్రువీకరణ, సర్వే సమస్యలను పరిష్కరించే దిశగా నిర్దేశిత ప్రణాళికతో రెవెన్యూ సదస్సుల నిర్వహణకు షెడ్యూల్ తయారు చేశామన్నారు. శ్మశాన వాటికలకు స్థలాలు, దారి సమస్యలు, 22ఏ కేసుల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. శనివారం జరిగే రెవెన్యూ సదస్సుల్లో ఇన్‌చార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్ పాల్గొంటారని చెప్పారు. దేశంలోనే మొదటిగా శనివారం అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ నిర్వహించబోతున్నామన్నారు. ఈ సమావేశంలో జేసీ శుభం బన్సల్, డీఆర్వో నరసింహులు, డీఈవో కుమార్, జిల్లా సర్వే అధికారి అరుణ్‌కుమార్ పాల్గొన్నారు.

'గోగర్భం' డ్యామ్‌కు జలహారతి





డ్యామ్ వద్ద టీటీడీ చైర్మన్, అదనపు ఈవో.. జలహారతి ఇస్తున్న అర్చకులు

తిరుమల, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో నిండిన గోగర్భం డ్యాం వద్ద గురువారం టీటీడీ పూజలు నిర్వహించింది. టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, అదనపు ఈవో వెంకయ్య చౌదరి పూజలు నిర్వహించి జల హారతి సమర్పించారు. వర్షాలు సమృద్ధిగా కురవడంతో గోగర్భం, ఆకాశగంగ, పాపవినాశనం డ్యాములు పూర్తిగా నిండాయని అదనపు ఈవో తెలిపారు. మరోసారి వర్షం పడితే కుమారధార, పసుపుధార డ్యాములు నిండిపోతాయన్నారు. ప్రస్తుతం రోజుకు 50 లక్షల గ్యాలన్ల నీరు వినియోగమవుతోందన్నారు. తిరుపతి కల్యాణి డ్యాం సహా ప్రస్తుత నీటి నిల్వలు 300 రోజులకు సరిపోతాయన్నారు. ఈ కార్యక్రమంలో బోర్డు సభ్యులు శాంతారామ్, డిప్యూటీ ఈవో లోకనాథం, వాటర్‌వర్క్స్ ఈఈ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

గురువారం సాయంత్రం 4 గంటలకు నీటి నిల్వలిలా

డ్యాములు	సామర్థ్యం	ప్రస్తుతం
పాపవినాశనం	5,240 (లక్షల గ్యాలన్లు)	5,208
కుమారధార	4,258	3,724
పసుపుధార	1,287	966
గోగర్భం	2,833	2,833
ఆకాశగంగ	685	685



ఒప్పంద పత్రాలతో ఇరు సంస్థల అధికారులు

ఎస్వీయూతో ఎస్వీ మెడికల్ కాలేజీ ఎంవోయూ

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఎస్వీయూతో ఎస్వీ మెడికల్ కాలేజీ అవగాహనా ఒప్పందం కుదుర్చుకుంది. వైద్య పరిశోధనలు చేపట్టే లక్ష్యంతో ఇరు సంస్థల అధికారులు గురువారం ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. ఎస్వీయూ ఇన్‌చార్జి వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు, ఎస్వీ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ చంద్రశేఖరన్ మాట్లాడుతూ.. ఇరు సంస్థల్లోని ల్యాబ్‌లలో చేపట్టే పరిశోధనా ఫలితాలు రోగుల ఆరోగ్యం మెరుగుపరచడానికి ఉపయోగ పడతాయన్నారు. రుయా సూపరింటెండెంట్ రవి, మెటర్నిటీ హాస్పిటల్ సూపరింటెండెంట్ పార్థసారథిరెడ్డి పాల్గొన్నారు.

ఏ మొహం పెట్టుకుని పోరుబాట చేస్తారు?

● జగన్‌కు శాప్ చైర్మన్ ప్రశ్న



మీడియాతో మాట్లాడుతున్న రవినాయుడు

తిరుపతి(లీలామహల్), డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతి దీవెన, స్కాలర్‌షిప్‌లకు సంబంధించి రూ.3,500 కోట్లు బకాయి పెట్టిన మాజీ సీఎం జగన్.. ఇప్పుడు ఏ మొహంపెట్టుకుని కూటమి ప్రభుత్వంపై పోరుబాటకు సిద్ధమవుతున్నారో చెప్పాలని శాప్ చైర్మన్ రవినాయుడు ప్రశ్నించారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. 'కరోనా సమయంలో కళాశాలలు నడపలేదని, ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వనని చెప్పారు. ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై ప్రైవేటు కళాశాలల యాజమాన్యాలు కోర్టుకు వెళితే వారిని తాడేపల్లికి పిలిపించి బెదిరింపులకు పాల్పడలేదా? వైసీపీ ప్రభుత్వంలో ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల వల్ల రెండు లక్షల మందికిపైగా విద్యార్థుల సర్టిఫికెట్లు యాజమాన్యాల వద్దే ఉన్నాయి. నాడు సీఎంగా విద్యార్థులకు అన్యాయం చేసిన జగన్.. ఇప్పుడు పోరుబాట పట్టడం హాస్యాస్పదంగా ఉంది' అని అన్నారు. ఆ రూ.3,500 కోట్ల బకాయిలను విడతల వారీగా అందజేయడంతో పాటు ఈ ఏడాది ఫీజు చెల్లించడానికి సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ సమీక్షించారన్నారు. ఈ సమావేశంలో టీఎన్ఎస్ఎఫ్ పార్లమెంటు అధ్యక్షుడు కొట్టే హేమంత్‌రాయల్, రాష్ట్ర కార్యదర్శి ఆర్కే నాయుడు, బషీర్, రాజు, గంగాధర్ పాల్గొన్నారు.

శ్రీరంగం శ్రీవైష్ణవులకు సన్మానం



శ్రీరంగం శ్రీవైష్ణవులను సత్కరిస్తున్న టీటీడీ ఈవో శ్యామలరావు

తిరుచానూరు, డిసెంబరు5(ఆంధ్రజ్యోతి): పద్మావతి అమ్మవారి బ్రహ్మోత్సవాల్లో ఉదయం, సాయంత్రం వాహనాలను మోస్తున్న శ్రీరంగం శ్రీవైష్ణవులను గురువారం రాత్రి టీటీడీ ఈవో శ్యామలరావు సన్మానించారు. 10 గ్రాముల శ్రీవారి వెండి డాలరు, స్వామివారి ప్రసాదాలు అందజేశారు. 32 ఏళ్లుగా వీరు విశేష సేవలు అందిస్తున్నారన్నారు. ఒక్కో వాహనం 2.5 టన్నులకుపైగా బరువు ఉంటుందన్నారు. దాదాపు మూడు గంటలపాటు బరువును మోస్తూ వాహన బ్యారర్లు తమ భక్తి భావాన్ని చూపారని కొనియాడారు. వాహన బేరర్లలో కొందరు చెన్నై, బెంగళూరు, హైదరాబాదు తదితర ప్రాంతాల్లో ఐటీ, రైల్వే, బ్యాంకు, ప్రభుత్వ ఉద్యోగులుగా పని చేస్తున్నారని, మరికొందరు విద్యార్థులు కూడా ఉన్నట్లు వివరించారు.

రోజంతా శుభ ఘడియలు

పంచమి తీర్థానికి విచ్చేసే భక్తులకు అంకిత భావంతో సేవలందించాలని టీటీడీ ఈవో శ్యామలరావు పిలుపునిచ్చారు. తిరుచానూరు ఆస్థాన మండపంలో గురువారం సాయంత్రం టీటీడీ సిబ్బంది, శ్రీవారి సేవకులతో ఆయన సమావేశమయ్యారు. శుభ ఘడియలు రోజంతా ఉంటాయని, భక్తులు తోపులాటలకు గురికాకుండా సాయంత్రం వరకు పుష్కరిణిలో స్నానం ఆచరించవచ్చన్నారు. భక్తులకు శ్రీవారి సేవకులు అందిస్తున్న సేవల వల్ల టీటీడీకి మంచి పేరు వచ్చిందన్నారు. టీటీడీ ఉద్యోగులు మరింత బాధ్యతతో సేవలు అందించాలని సూచించారు. పంచమితీర్థం రోజున 1000 మంది శ్రీవారి సేవకులతో అన్నప్రసాదం, తాగునీరు పంపిణీ చేయనున్నట్లు ఈవో తెలిపారు. ఆయా కార్యక్రమాల్లో జేఈవో వీరబ్రహ్మం, సీవీఎస్వో శ్రీధర్, సీఈ సత్యనారాయణ, ఆలయ డిప్యూటీ ఈవో గోవిందరాజన్, అన్నప్రసాదం స్పెషలాఫీసర్ జీఎల్ఎన్ శాస్త్రి, డిప్యుటేషన్ ఉద్యోగులు, శ్రీవారి సేవకులు పాల్గొన్నారు.

ముంతాజ్ హోటల్ అక్రమ నిర్మాణాలను కూల్చివేయాలి

● 20 ఎకరాలను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలి

● శ్రీనివాసానంద సరస్వతి డిమాండ్



మాట్లాడుతున్న శ్రీనివాసానంద సరస్వతి

తిరుపతి(లీలామహల్), డిసెంబరు5 (ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ పేరూరు పంచాయతీ పరిధిలోని సర్వే నెంబరు 604/2లో నిబంధనలకు విరుద్ధంగా నిర్మిస్తున్న ముంతాజ్ హోటల్‌ను కూల్చివేయాలని ఏపీ సాధు పరిషత్ అధ్యక్షుడు శ్రీనివాసానంద సరస్వతి డిమాండు చేశారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఆయన మాట్లాడుతూ.. ఈ హోటల్ పనులు ఆపాలని టీటీడీ ధర్మకర్తల మండలి సమావేశంలో తీర్మానం చేశారన్నారు. అక్రమ కట్టడాలు నిర్మిస్తున్నట్లు గుర్తించిన తుడా అధికారులు, పేరూరు పంచాయతీ కార్యదర్శి ఈనెల 4వ తేదీన ఈ పనులను ఆపాలని నోటీసులు ఇచ్చారన్నారు. అనుమతులుంటే వారంలోపు చూపాలని, లేకుంటే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని అందులో పేర్కొన్నారన్నారు. అయినా, రాత్రింబవళ్లు నిర్మాణాలు చేస్తున్నారని ఆయన ఆరోపించారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకుని, అక్కడి వాహనాలు సీజ్ చేసి, హోటల్‌కు ఇచ్చిన 20 ఎకరాల భూమిని తక్షణమే ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని డిమాండు చేశారు. లేకుంటే హిందూ సంఘాలతో కలిసి స్వామీజీలం నిరశన దీక్ష చేస్తామన్నారు. ఈ సమావేశంలో గౌరవాధ్యక్షుడు అట్లూరి నారాయణరావు, తిరుక్షేత్రాల రక్షణ సమితి అధ్యక్షుడు తుమ్మా ఓంకార్, చంద్రమౌళి, బాలకృష్ణ, మధు, నీలకంఠ తదితరులు పాల్గొన్నారు.

8న కృత్రిమ కాలుకు కొలతలు

చిత్తూరు అర్బన్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు, తిరుపతి జిల్లాల్లోని విభిన్న ప్రతిభావంతుల్లో అవసరమైన వారికి ఈనెల 8న తపోవనంలో కృత్రిమ కాలుకు కొలతలు తీసుకోనున్నారు. ఈ మేరకు విభిన్న ప్రతిభావంతుల శాఖ ఏడీ శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. 20 రోజుల తర్వాత ఆధునిక వెయిట్‌లెస్ కృత్రిమ కాలు ఉచితంగా అమర్చుతామన్నారు. అవసరమైన వారు సహాయ సంచాలకులు, విభిన్న ప్రతిభావంతుల సంక్షేమశాఖ, నూతన కలెక్టరేట్ భవనం, అంబేడ్కర్ భవన్, చిత్తూరు అనే చిరునామాలో సంప్రదించాలని కోరారు. వివరాలకు 94403 57522 నెంబరుకు ఫోన్ చేయాలన్నారు.

డీటీసీవోగా జనార్దనరెడ్డి



తిరుపతి అర్బన్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): తిరుపతి డిస్ట్రిక్ట్ టూరిజం అండ్ కల్చరల్ ఆఫీసరు (డీటీసీవో)గా ఎం.జనార్దనరెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు గురువారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఇప్పటివరకు టూరిజం రీజనల్ డైరెక్టర్‌గా ఉన్న రమణప్రసాద్ అదనపు బాధ్యతలు నిర్వహిస్తూ వచ్చారు.

గూడూరు
సూళ్లూరుపేట/వెంకటగిరి

సమర్థవంతంగా సదస్సులు నిర్వహించాలి



మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్ రాఘువేంద్రమీనా

గూడూరు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): డివిజన్ పరిధిలో శుక్రవారం నుంచి నిర్వహించనున్న రెవెన్యూ సదస్సులను అధికారులు సమర్థవంతంగా నిర్వహించాలని సబ్‌కలెక్టర్ రాఘువేంద్రమీనా ఆదేశించారు. గురువారం స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో డివిజన్ పరిధిలోని తహీల్దార్లు, ఎంపీడీవోలతో రెవెన్యూ సదస్సుల నిర్వహణపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ శుక్రవారం నుంచి జనవరి 7వ తేదీ వరకు డివిజన్ పరిధిలోని అన్ని గ్రామాల్లో రెవెన్యూ సదస్సులను నిర్వహించనున్నా మన్నారు. ఈ సదస్సుల ద్వారా ప్రజలు భూసమస్యలను పరిష్కరించుకునే వీలుంటుంద న్నారు. ప్రధానంగా భూసమస్యలకు శాశ్వత పరిష్కారం చూపించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహించనుంద న్నారు. గ్రామంలో జరిగే గ్రామసభల్లో ప్రజలు భూసమస్యలను రెవెన్యూ అధికారులకు తెలియజేస్తే వాటిని త్వరగా పరిష్కరించేలా చర్యలు తీసుకుం టామని పేర్కొన్నారు. ప్రజలు ఈ రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

సస్పెండ్ చేసిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి



ఆర్టీసీ డిపో వద్ద ధర్నా నిర్వహిస్తున్న ఎస్‌డబ్ల్యుఎఫ్ నాయకులు

గూడూరు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్టీసీ డిపోలో అక్రమంగా సస్పెండ్ చేసిన కార్మికులను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని ఎస్‌డబ్ల్యుఎఫ్ డిపో కార్యదర్శి శ్రీధర్ అన్నారు. గురువారం స్థానిక ఆర్టీసీ డిపో వద్ద స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్‌డబ్ల్యుఎఫ్ యూనియన్ సభ్యుల పట్ల అధికారులు అవలంబిస్తున్న నిర్లక్ష్య వైఖరిని మానుకోవాలన్నారు. డిపోలో పనిచేస్తున్న డ్రైవర్లు, కండక్టర్లను అక్రమంగా డిపో మేనేజర్ సస్పెండ్ చేయడం తగద న్నారు. ఏకపక్షంగా వ్యవహరించడం, ఉద్దేశపూర్వకంగా విధుల నుంచి సస్పెండ్ చేయ డాన్ని ఖండిస్తున్నామన్నారు. ఉన్నతాధికారులు స్పందించి కార్మికులకు న్యాయం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రాము, భాస్కర్, కృష్ణయ్య, సుబ్రమణ్యం, కిరణ్, వెంకట్రామిరెడ్డి, టీవీరమణయ్య, సురేష్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మూఢనమ్మకాలకు దూరంగా ఉండాలి



బహుమతులు పొందిన విద్యార్థినులతో జేవీవీ సభ్యులు

గూడూరు అర్బన్, డిసెంబరు 5 (ఆంధ్ర జ్యోతి): ప్రజలు మూఢ నమ్మకాలకు దూరంగా ఉండాలని జేవీవీ పట్టణాధ్యక్షుడు వేగూరు రాజేంద్ర ప్రసాద్ కోరారు. గురు వారం స్థానిక బాలాజీ జూనియర్ కళాశాలలో జనవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో మూఢనమ్మకాలకు వ్యతిరేకంగా అవగాహన కల్పించేలా విద్యార్థులకు పోటీపరీక్షలు నిర్వహించారు. గెలుపొందిన వారికి బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైన్స్‌పట్ల అవగాహన కల్పించేందుకు ఈ తరహా పోటీలను నిర్వహించి ప్రభాకర్‌రెడ్డి దాతృత్వంతో బహుమతులను అందజేశామని వివరించారు. ఈ కార్యక్రమంలో కోటేశ్వరరావు, నాగరాజు, చెంచునారాయణ, రాధయ్య, ప్రభాకర్, వెంకటేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

దివ్యాంగులకు నిత్యావసరాల పంపిణీ



గూడూరు అర్బన్, డిసెంబరు 5 (ఆంధ్ర జ్యోతి): స్థానిక వీరభద్రస్వామి ఆలయం లో గురువారం రెడ్‌సంస్థ ఆధ్వర్యంలో ఇన్నర్ వీల్‌క్లబ్, ఆంధ్ర మహిళా మండలి సహకారంతో దివ్యాం గులకు నిత్యా వసరాలను అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ రోహిణి మాట్లాడుతూ దివ్యాంగులకు చేయూతనందించేలా ప్రతినెలా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్నేహలత, డాక్టర్ తనూజ, అనిత, జనా సుధీర్, వెంకటేశ్వర్లు, శ్రీనివాసాచారి పాల్గొన్నారు.

వేనాటి మునిరెడ్డికి ఘన నివాళి



అన్నదానం చేస్తున్న వేనాటి సతీష్ రెడ్డి, టీడీపీ నాయకులు

సూళ్లూరుపేట, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): టీడీపీ నేత వేనాటి మునిరెడ్డి వర్ధంతిని సూళ్లూరుపేటలో గురువారం ఘనంగా నిర్వహించారు. టీడీపీ జిల్లా కార్యదర్శి వేనాటి సతీష్ రెడ్డి ఆధ్వర్యంలో స్థానిక టీడీపీ కార్యాలయంలో వేనాటి చిత్రపటం ఏర్పాటు చేసి టీడీపీ నాయకులు, వేనాటి అభిమానులు పూలమాలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ వేనాటి మునిరెడ్డి ప్రజానాయకుడని ఆయన అడుగజాడల్లో అందరూ నడవాలన్నారు. అంతకుముందు రక్తదానం చేశారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. టీడీపీ నాయకులు చిట్టేటి పెరుమాల్, మాజీ మున్సిపాలిటీ ఛైర్మన్ ఎన్.విజయలక్ష్మీ, మాజీ ఎంపీపీ పిట్ల సుబ్రమణ్యం, వేనాటి జనార్ధన్ రెడ్డి, కామిరెడ్డి మురళి రెడ్డి, కేవీ రెడ్డి, నాపా మునిరాజా, మెస్ రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు అయ్యప్పస్వామి జ్యోతుల గ్రామోత్సవం

సూళ్లూరుపేట, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలో అయ్యప్ప స్వామి 26వ వార్షికోత్సవ జ్యోతుల గ్రామోత్సవం నిర్వహించ నున్నట్లు నిర్వాహకులు తెలిపారు. షార్ బస్టాండులోని వెంకటేశ్వరస్వామి ఆలయం వద్ద సాయంత్రం 6 గంటలకు జ్యోతిని వెలిగించి గామోత్సవాన్ని ప్రారంభిస్తారని భక్తులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

అట్రాసిటి కేసులో ఒకరి అరెస్ట్

పెళ్లకూరు, డిసెంబరు 5 (ఆంధ్ర జ్యోతి) : మండలంలోని చిల్లకూరులో రెండు నెలలు క్రితం దళిత మహిళను కులం పేరుతో దూషించిన కేసులో నిందితుడుగా ఉన్న అదే గ్రామానికి చెందిన అళ్ల నాగార్జునను డీఎస్పీ గురు వారం రాత్రి అరెస్ట్ చేశారు. అనంతరం నిందితుడిని కోర్టులో హాజరుపరచి రిమాండ్‌కు పంపారు.

నేడు జాబ్‌మేళా

వెంకటగిరిటౌన్, డిసెంబరు 5,(ఆంధ్రజ్యోతి): స్థానిక ఐటీఐ కళాశాలలో శుక్రవారం జాబ్ మేళా నిర్వహిస్తున్నామని ప్రిన్సిపాల్ ఉమారాణి గురువారం తెలిపారు. అమర్ రాజా గ్రూప్స్, గ్రీన్లం లిమిటెడ్, డైకిన్ ఎయిర్ కండీషనింగ్ లిమిటెడ్ సంస్థల ప్రతినిధులు పాల్గొంటారని తెలిపారు. పదో తరగతి, ఇంటర్, ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ చదివిన విద్యార్థులు అర్హులని వివరించారు.

వేనాటి మునిరెడ్డికి పలువురి నివాళి



తడ, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ నాయకుడు మాజీ ఎన్‌డీసీసీబీ ఛైర్మన్ వేనాటి మునిరెడ్డి 24వ వర్ధంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో మునిరెడ్డి చిత్రపటాన్ని ఉంచి నివాళులర్పించారు. తెలుగుదేశంపార్టీ ఆవిర్భావం నుంచి పార్టీ పటిష్ఠతకు మునిరెడ్డి కృషిచేశారని టీడీపీ మండల అధ్యక్షుడు కామిరెడ్డి మురళీరెడ్డి కొనియాడారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు నీలకంఠం, రమేష్, గిరిరెడ్డి పాల్గొన్నారు.

పేదలకు భూ పంపిణీ చేయాలి

నాయుడుపేట/సూళ్లూరుపేట డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట నియోజకవర్గంలోని పేద ఎస్సీ ఎస్టీ, బీసీలకు భూ పంపిణీ చేయాలని ఎమ్మెల్యే విజయశ్రీ కలెక్టర్ వెంకటేశ్వర్‌ను కోరారు. కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ ఆధ్వర్యంలో గురువారం ఏర్పాటు చేసిన రెవెన్యూ అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. రెవెన్యూ, ఇతర శాఖలలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని కోరారు. అన్నివర్గాల శ్మశానవాటికలు అభివృద్ధి చేయాలని, రోడ్లు నిర్మించాలని కోరారు.

నేడు ఎంపీడీవో కార్యాలయం ప్రారంభం

వెంకటగిరిటౌన్, డిసెంబరు5, (ఆంధ్రజ్యోతి): వెంకటగిరి ఎంపీడీవో నూతన కార్యాల యం శుక్రవారం మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి, ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ చేతులు మీదుగా ప్రారంభిస్తున్నామని ఎంపీపీ తనూజ గురువారం తెలిపారు. ఈ కార్యక్రమానికి అధికారులు, ప్రజాప్రతినిధులు అందరూ హాజరు కావాలని కోరారు.

గుంతలమయంగా జాతీయ రహదారి



నాయుడుపేట, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల వర్షాలకు నాయుడుపేట -పూతలపట్టు 71వ జాతీయ రహదారి గుంతలమయంగా మారింది. ఈ జాతీయ రహదారిలో తిరుమల, తిరుపతి, శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రాలకు, ఉపాధి నిమిత్తం బెంగళూరుకు నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఈ రహదారిపై గుంతలు ఏర్పడడంతో ప్రయాణికులు, వాహన చోదకులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి గుంతలను పూడ్చించాలని కోరుతున్నారు.

పురుగుల మందు తాగి వృద్ధుడి ఆత్మహత్య



మతి చెందిన వృద్ధుడు రమణయ్య

దొరవారిసత్రం, డిసెంబరు (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెదురుపట్టురాజు పాళెం గిరి జన కాలనీకి చెందిన చిలకల రమణయ్య(67) పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఇంట్లో డబ్బుల విషయంలో భార్య సుబ్బులమ్మ తో వివాదం ఏర్పడింది. మనస్తాపానికి గురై బుధవారం గడ్డి మందు తాగాడు. బంధువులు నెల్లూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతిచెందాడు. గురువారం పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగిం చారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

గేదెను ఢీ కొన్న ద్విచక్ర వాహనం.. ఒకరి మృతి

కోట, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని కేశవరం వద్ద గురువారం తెల్లవారుజామున గేదెను ఢీకొని ఓ ద్విచక్ర వాహనదారుడు మృతిచెందాడు. స్థానికుల కథనం మేరకు..నెల్లూరుకు చెందిన నాయబ్ రసూల్, చంద్రశేఖర్, బెంగళూరుకు చెందిన మూర్తి నవీన్(22)లు ద్విచక్ర వాహనంలో గూడూరు నుంచి కోట వైపు వెళ్తున్నారు. కేశవరం వద్ద అదుపుతప్పి గేదెను ఢీకొన్నారు. ముగ్గురూ గాయపడ్డారు. వారిని నెల్లూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మూర్తినవీన్ మృతిచెందాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సేంద్రియ ఎరువులు వినియోగించాలి



మాట్లాడుతున్న ఏడీఏ నాగర్జున సాగర్

వెంకటగిరి టౌన్, డిసెంబరు 5, (ఆంధ్ర జ్యోతి): రైతులు సేంద్రియ ఎరువులనే వినియోగిం చాలని ఏడీఏ నాగర్జున సాగర్ అన్నారు. గురువారం స్థానిక కృషి విజ్ఞాన కేంద్రంలో నేలల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పచ్చి రొట్ట ఎరువులు వాడడం అలవాటుగా మార్చుకోవాలని తెలియజేశారు. రైతులకు పీఎం ఫసల్ బీమా యోజన గురించి వివరించారు. తర్వాత అనంతరాజు పేట హార్టికల్చర్ విద్యార్థులకు భూసార పరీక్షల నమూన ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాసరెడ్డి, ఏవో సుజాత, ఆనంద్‌రెడ్డి, రాజీవన, నాగర్జున రెడ్డి, తిరుపాల్, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

తీర ప్రాంతాలను సస్యశ్యామలం చేస్తాం

పర్యావరణ పరిరక్షణ కార్పొరేషన్ ఛైర్మన్ పోలంరెడ్డి దినేష్‌రెడ్డి



దినేష్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్

కోట, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : సముద్రతీర ప్రాంతాలలో కోట్లాది రూపాయలతో ముఖద్వారాలు పూడికతీసి గిరిజన, మత్స్యకార గ్రామాలను సస్యశ్యామలం చేస్తామనిపర్యావరణ పరిరక్షణ కార్పొరేషన్ ఛైర్మన్ పోలంరెడ్డి దినేష్‌రెడ్డి అన్నారు. కోట పట్టణంలోని షాదీమందిర్‌లో గురువారం ఎఆర్‌డీ సంస్థ ఆధ్వర్యంలో చిల్లకూరు, కోట, వాకాడు మండలాల మత్స్యకారులు, గిరిజనుల జీవన విధానంపై ఎమ్మెల్యే డాక్టర్ పాశిం సునీల్‌కుమార్, పోలంరెడ్డి దినేష్‌రెడ్డిలు వారితో ముఖాముఖి నిర్వహించారు. తొలుత ఎమ్మెల్యే మాట్లాడుతూ పులికాట్ సరస్సు ముఖద్వారం పూడికతీత పనులు చేపడుతామన్నారు. వాకాడు మండలం పూడిరాయదొరువు సముద్రముఖద్వారం పూడికతీతకు రూ.97 కోట్ల నిధులను కేటాయిం చామన్నారు. ఆయా పనులు త్వరగా జరుగుతా యన్నారు. రాష్ట్రానికి ఉన్న 932 కిలోమీటర్ల సముద్రతీరాన్ని సుందర వదనంగా తీర్చిదిద్ది మత్స్యకార, గిరిజనుల జీవితాలలో వెలుగులు నింపుతామన్నారు. రానున్న ఐదేళ్లల్లో విద్యామంత్రి నారా లోకేశ్ ఆధ్వ ర్యంలో 20 లక్షల ఉద్యోగాలు రానున్నాయన్నారు. ఆయన చొరవతోనే రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుక పలు కంపెనీలు ముందుకు వస్తున్నా యని పేర్కొన్నారు. ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ మాట్లాడుతూ సముద్రాన్ని నమ్ముకొని జీవనం సాగిస్తున్న మత్స్యకార గిరిజనుల పక్షపాతి సీఎం చంద్రబాబు అని తెలిపారు. ప్రతి మత్స్యకార బిడ్డా చదువుకోవాలని కోరారు. వైసీపీ ప్రభుత్వంలో కోట మండలం కేశవరం పంచాయతీలలో పేదల భూములను వైసీపీ నాయకులు కబ్జా చేశారన్నారు. చిల్లకూరు మండలంలో అప్పటి వైసీపీ నాయకులు సిలికా మైన్‌లను దౌర్జన్యంలా లాక్కున్నారన్నారు. త్వరలోనే దీనికి సంబంధించిన భూబకాసురల భరతం పడుతామన్నారు. అనంతరం గిరిజన మత్స్య కారుల అభివృద్ధికి నిధులు కేటాయించాలని దినేష్‌రెడ్డికి ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ వినతిపత్రం అందజేశారు. ఈ సమావేశంలో ఏఆర్‌డీ స్వచ్ఛంద సంస్థ ఫౌండర్ బషీర్, మైనార్టీ సెల్ అధ్యక్షులు షేక్ జలీల్ అహ్మద్, సెంట్రల్ బ్యాంక్ మాజీ వైస్ ఛైర్మన్ నల్లపరెడ్డి జగన్ మోహన్‌రెడ్డి, చిల్లకూరు దశరథరామిరెడ్డి, పలగాటి భాస్కర్‌రెడ్డి, మధుయాదవ్, పోలయ్య, తూపిలి రాధాకృష్ణారెడ్డి, ఎంపీటీసీ సురేష్, షంషుద్దీన్, మస్తాన్‌బాషా ఉన్నారు.

గోతులమయం.. ప్రమాదకరం





వేములపాళెం సమీపంలో గోతులమయంగా మారిన ప్రధానరహదారి ● బీసీకాలనీ సమీపంలో విందూరు మార్గంలో అధ్వానంగా ఉన్న రోడ్డు

గూడూరు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): గూడూరు నుంచి మండలంలోని వేములపాళెం గ్రామానికి వెళ్లే ప్రధానరహదారి గోతులమయంగా మారింది. రాకపోకలు సాగించడానికి గ్రామస్తులు అవస్థలు పడుతున్నారు. గూడూరు పట్టణం నుంచి వేములపాళెం మీదుగా విందూరు, రామలింగాపురం, చంబడిపాళెం, సంతదాసుపల్లి, ఈదలపల్లి, మిటాత్మకూరు తదితర గ్రామాలకు ప్రజు రాకపోకలు సాగిస్తుంటారు. సుమారు పది గ్రామాలకు పైగా ప్రజలు వేములపాళెం మీదుగా గూడూరుకు వస్తుంటారు. విద్యార్థులు, రైతులు, కూలిపనులను వెళ్లేవారు తదితరులు వారివారి గ్రామాల నుంచి వాహనాల్లో వస్తుంటారు. గూడూరు బీసీకాలనీ నుంచి వేములపాళెం గ్రామానికి వెళ్లే మార్గం అడుగడుగునా గోతుల మయంగా మారింది. ఇటీవల కురిసిన వర్షాలకు ఈ మార్గం మరింత గుంతలమయ మైంది. ఐదారు చోట్ల భారీ గోతులు దర్శనమిస్తున్నాయి. స్థానిక బీసీకాలనీ సమీపం లో, మల్లితోట వాటర్‌వర్క్స్ సమీపంలో ప్రధాన రహదారి దారుణంగా తయారైంది. ఒక్కో ప్రాంతంలో పది అడుగులకు మేర రోడ్డు దెబ్బతింది. గోతుల్లో నీళ్లు నిలిచి మడుగులా మారింది. ద్విచక్ర వాహనాలు, ఆటోలు గుంతల్లో దిగి ప్రమాదాలకు గురవుతున్నాయి. ముఖ్యంగా రాత్రిపూట గుంతలు కనిపించక ఎక్కువ మంది ద్విచక్రవాహనదారులు గోతుల్లో పడ్డారు. రహదారిని బాగు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

జనార్దనరెడ్డి మరణం టీడీపీకి తీరని లోటు

● ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ



జనార్దన్‌రెడ్డి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ, మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం

పెళ్లకూరు, డిశంబరు 5 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని శిరసనంబేడు గ్రామానికి చెందిన టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు వేలూరు మురళీకృష్ణారెడ్డి తండ్రి జనార్దన్‌రెడ్డి మరణం టీడీపీకి తీరని లోటని సూళ్లూరుపేట ఎమ్మెల్యే విజయశ్రీ అన్నారు. గురువారం శిరసనంబేడులో శాస్త్రోక్తంగా జరిగిన కర్మక్రియల్లో ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ, పార్థసారథి దంపతులు, సూళ్లూరుపేట టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం, శ్రీకాళహస్తి మాజీ ఎమ్మెల్యే ఎస్సీవీనాయుడు తదితరులు జనార్దన్‌రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం వేలూరు కుటుంబసభ్యులైన హరిబాబురెడ్డి, రాజేంద్రప్రసాద్‌రెడ్డి, కళ్యాణ్‌రెడ్డి, సాయిగిరిధర్‌రెడ్డి తదితరులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో పెళ్లకూరు, ఓజిలి దొరవారిసత్రం టీడీపీ మండల అధ్యక్షులు సంచి కృష్ణయ్య, విజయ్‌కుమార్‌నాయుడు, శ్రీనివాసులు నాయుడు, నాయకులు పేరం రమేష్‌నాయుడు, కందమూడి శివకుమార్, దేవారెడ్డి నాగేంద్రప్రసాద్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, సిద్దులయ్య నాయుడు, మదన్‌మోహన్‌నాయుడు, నాయుడుపేట ఎంపీపీ కురుకొండ ధనలక్ష్మీ, వేలూరు హరినాయుడు, తాళ్ల యుగందర్‌గౌడ్ నివాళులు అర్పించారు.

జిల్లా పరిషత్ భూములకు రక్షణ కల్పిస్తాం



గ్రంథాలయ భవనాన్ని పరిశీలిస్తున్న డిప్యూటీ సీఈవో మోహన్‌రావు, అధికారులు

కోట, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి నెల్లూరు జిల్లాలోని పలు మండలాల్లో ఉన్న జిల్లా పరిషత్ భూములు అన్యాక్రాంతం కాకుండా ఉండేందుకు ఆ భూముల పర్యవేక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈవో మోహన్‌రావు తెలిపారు. కోట మండల పరిషత్ కార్యాలయాన్ని గురువారం ఆయన తనిఖీ చేశారు. పలు రికార్డులను పరిశీలించారు. బాలికల ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న బోజనం రుచిచూశారు. బోజన నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. గ్రంథాలయం ఉన్న జిల్లా పరిషత్ భూమిని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా పరిషత్ భూముల లీజులు కొనసాగేలా చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లా పరిషత్ భూములను ఎవరైన ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుం టామన్నారు. ఆయన వెంట ఎంపీడీవో వేణు, పలుశాఖల అధికారులు ఉన్నారు.

టీడీపీ మైనార్టీ నాయకుడికి ఎమ్మెల్యే పరామర్శ



కోట, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): కోట పట్టణంలోని దాదరాయి గుంట వద్ద నివాసం ఉంటున్న టీడీపీ మైనార్టీ సెల్ నాయకుడు షేక్ నౌషాద్‌తో పాటు ఆయన కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్ గురువారం పరామర్శించారు. షేక్ నౌషాద్ తల్లి మాజీ ఎంపీటీసీ గౌసినీషా ఇటీవల అనారోగ్యంతో మృతిచెందారు. దీంతో ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్, టీడీపీ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు జలీల్ అహ్మద్, టీడీపీ నాయకులు నల్లపరెడ్డి జగన్‌మోహన్‌రెడ్డి, చిల్లకూరు దశరథరామిరెడ్డి, పలగాటి భాస్కర్‌రెడ్డిలు నౌషాద్‌ను పరామర్శించారు.

కోటలో వికలాంగుల దినోత్సవం

కోట, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : కోటలోని షాదీ మందిర్‌లో గురువారం ప్రపంచ వికలాంగ దినోత్సవం జరిగింది. వికలాంగ సంక్షేమ సంఘం నాయకులు సుధీర్, కృష్ణల ఆధ్వర్యంలో కేక్‌ను తీసుకువచ్చి ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ సమక్షంలో కేక్ కట్‌చేశారు.

కొత్తచెరువుకు గండి

నాయుడుపేట టౌన్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : నాయుడుపేట మున్సిపాలిటీ పరిధిలోని బిరదవాడలోని కొత్తచెరువు తూముకు ఇటీవల కురిసిన వర్షాలతో గండి పడింది. దాంతో చెరువులో నీరు ఆయకట్టులోని పొలాల్లోకి నీరు చేరుతుంది. వరిపైరు మొత్తం నీట మునిగింది. ఇరిగేషన్, వ్యవసాయ, రెవెన్యూ అధికారులు పరిశీలించి పరిహారం అందించాల్సిందిగా రైతులు కోరుతున్నారు.

అడుగువేయాలంటే.. బురద తొక్కాల్సిందే

● తిన్నెలపూడి దళిత కాలనీల్లో వసతులు కరువు
● చెరువులా మారిన వీధులు







తిన్నెలపూడి దళితవాడలో గోతులను తలపిస్తున్న వీధులు, తూర్పుదళితవాడ వీధుల్లో ప్రవహిస్తున్న మురుగు, దక్షిణ దళితవాడలో మడుగును తలపిస్తున్న వీధులు

కోట, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని తిన్నెలపూడి పంచాయతీలో పలు దళితవాడలు దుర్గంధంలా మారాయి. తిన్నెలపూడి దళితవాడ, తూర్పు దళితవాడ, దక్షిణ దళిత వాడల్లో చెత్త పేరుకు పోయింది. సిమెంటు రోడ్లు, మురుగుకాలువలు లేకపోవడంతో వర్షపునీరంతా వీధుల్లో నిలిచిపోయింది. వీధులన్నీ చెరువుల్లా మారాయి. ఇంటి ముందు అడుగుతీసి అడుగువేయలేని పరిస్థితి. అడుగు వేస్తే బురదలో వేయాల్సిందే. ఇక దోమలు వృద్ధి చెంది రోగాలు ప్రబలే ప్రమాదం ఉంది. అధికారులు స్పందించి వీధుల్లో నీరు వెళ్లేలా చర్యలు తీసుకోవాలని దళితులు కోరుతున్నారు.